www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20

అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 | సంచిక : 196 | మంగళవారం 08-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ





- నెరవేరిన దశాబ్దాల కల
- 72 ఏళ్ల నిరీక్షణకు తెర
- వరల్డ్ కప్ కన్నా గొప్ప విజయం : కోహ్లి

చారిత్రక విజయం

ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా తొలిసారి సిరీస్ గెలిచి సంచలనం సృష్టించింది. 4 టెస్టుల సిరీస్‌ను 2-1 తేడాతో భారత్ కైవసం చేసుకోవడంతో 72 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. ఆసీస్ గడ్డపై ఇన్నేళ్ల తర్వాత తొలి టెస్టు సిరీస్‌ను టీమిండియా కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని కోహ్లిసేన ముద్దాడి విదేశీగడ్డపై సత్తా చాటింది. 12లో

ఎన్నికల తాయిలం...!



ఉత్తరాదిలో మూడు కంచుకోటల్లో భంగపాటు తప్పని నేపథ్యంలో... ప్రధాని నరేంద్ర మోడీ జన సమ్మోహనాస్త్రాలను బయటకు తీస్తున్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని గత ఎన్నికల్లో నిరుద్యోగులను ఊరించిన మోడీ... ఆ హామీని గాలికి వదిలేసిన నేపథ్యంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని యువత తగిన శాస్తి చేసింది. ఉద్యోగాల పేరిట దూరమైన నిరుద్యోగులు, ముఖ్యంగా అగ్రవర్ణాలను ఆకర్షించేందుకు తన ఎన్నికల సంచిలోని ఒక తురుపు ముక్కనే సోమవారం బయటకు తీశారు. ఈబీసీకి రిజర్వేషన్ కార్డును ప్రయోగించారు. దేశ చరిత్రలో ఈ నిర్ణయం కీలకమే. ఇప్పటి వరకూ దళితులు, గిరిజనులు, బలహీనవర్గాల రిజర్వేషన్లను పరోక్షంగా వ్యతిరేకించి.. అమలులో ప్రతిబంధకాలు సృష్టించిన బీజేపీ.. తాజాగా అగ్రవర్ణాల్లో పేదలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కేంద్ర మంత్రి వర్గం ఆమోదించింది. రాజ్యాంగ పరంగా సాధ్యాసాధ్యాలను పక్కన పెడితే... ఇప్పటి వరకూ అండదండగా నిలిచిన అగ్రవర్ణాల ఓటు బ్యాంకును మోడీ సర్కారు సుస్థిరం చేసుకుంటోందనేది రాజకీయ పరిశీలకుల విశ్లేషణ.

- తెరమీదకు ఈబీసీ కోటా
- అగ్రవర్ణ పేదలకు 10 శాతం
- విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్
- ఐదు ఎకరాల సాగుభూమి
- రూ.8 లక్షల లోపు వార్షికాదాయం
- వెయ్యి చదరపు అడుగుల్లో ఇల్లు
- ఇవీ పేదరికానికి అర్హతలు

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల కాలం దూసుకువస్తున్న నేపథ్యంలో... అగ్రవర్ణాల్లో పేదలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్ కల్పించాలని సోమవారం కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. రూ.8 లక్షలలోపు వార్షికాదాయం కలిగిన అగ్రవర్ణాలకు ఈ రిజర్వేషన్లు వర్తిస్తాయని కేంద్ర కేబినెట్ పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా అగ్రవర్ణాల్లో పేదలకు విద్య, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్ కల్పించేందుకు మోడీ సర్కార్ రాజ్యాంగ సవరణను చేపట్టనుంది. మంగళవారం రాజ్యాంగంలోని ఆర్టికల్ 16, 17లకు సవరణను ప్రతిపాదించనుంది. ఇక కేబినెట్ నిర్ణయంతో జనరల్ కేటగిరిలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ ఫలాలు తొలిసారిగా అందుబాటులోకి రానున్నాయి. కాగా మరికొన్ని నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయానికి ప్రాధాన్యం సంతరించుకుంది. రూ.8 లక్షల కంటే తక్కువ వార్షిక ఆదాయం, 5 ఎకరాల కంటే తక్కువ సొంత వ్యవసాయ భూమి, వెయ్యి చదరపు అడుగుల కంటే తక్కువ విస్తీర్ణంలో ఇల్లు, నోటిఫైడ్ మున్సిపాలిటీ పరిధిలో - మిగతా 2 లో

సున్నిత సమస్యను జటిలం చేశారు



అగ్ర వర్ణాల్లో పేదలకు పది శాతం రిజర్వేషన్ ఇవ్వటం సముచితమే. కానీ ఎలాంటి చర్చ లేకుండా ఎన్నికల సమయంలో ఏకపక్షంగా సంకుచిత నిర్ణయం తీసుకున్నారు.
- కె.నారాయణ

చెల్లుబాటు కాని నిర్ణయం...



అగ్ర వర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ సంస్థలను దెబ్బతీసే చర్యల్లో భాగమే. గతంలో ఇలాంటి నిర్ణయం తీసుకున్నా చెల్లుబాటు కాలేదు.
- ప్రకాశ్ అంబేద్కర్

ఇది పచ్చి అబద్ధం



అగ్రవర్ణాల్లో పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడం పచ్చి 'అబద్ధం' తప్ప మరోటి కాదు. ఈ నిర్ణయం న్యాయ పరమైన చిక్కులకు తావిస్తున్నది.
- యశ్వంత్ సిన్హా

రాజకీయ లబ్ధి కోసమే



అగ్రవర్ణాలకు రిజర్వేషన్ల నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా. ఇష్టం వచ్చినట్లు రిజర్వేషన్లు ఇస్తామంటే కుదరదు. రిజర్వేషన్లను అరవై శాతానికి పెంచుతామంటే ఊరుకునేది లేదు.
- ఆర్.కృష్ణయ్య

నేటి నుంచి కార్మిక సంఘాల సమ్మె

20 కోట్ల మంది ఆక్రోశం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా 20 కోట్ల మంది కార్మికులు రెండు రోజులపాటు సమ్మె చేపట్టారు. కార్మిక చట్టాలకు తూట్లుపెడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. 10 కేంద్ర కార్మిక సంఘాల నుంచి దాదాపు 20 కోట్ల కార్మికులు మంగళ, బుధవారాల్లో జరిగే సమ్మెలో పాల్గొంటారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సంఘటిత, అసంఘటిత కార్మికులు ఇందులో పాల్గొంటారని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ సంయుక్త మీడియా సమావేశంలో వెల్లడించారు. టెలికం, ఆరోగ్య, విద్య, కోల్, స్టీల్, విద్యుత్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ట్రాన్స్‌పోర్టు రంగాలు ఈ సమ్మెలో పాల్గొంటున్నాయన్నారు. న్యూఢిల్లీలోని మండి హౌస్ నుంచి పార్లమెంటు వరకు ప్రదర్శన జరుపుతామన్నారు. ఇలాంటి ప్రదర్శనలే దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో వెల్లడించారు. చర్చల్లో యూనియన్లు అనేక డిమాండ్లు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని ఆమె వివరించారు. 2016 సెప్టెంబరు 6న, సమ్మె చేపట్టామని, 2017 నవంబరు 9 నుంచి 11 వరకు మహాపడవ్ (ఆందోళన) నిర్వహించామని అయినా కేంద్రం సంప్రదింపులు జరపలేదని - మిగతా 2 లో





సంగీత, నృత్య అకాడమీ చైర్మన్‌గా వందేమాతరం

- సాహిత్య అకాడమీ చైర్మన్‌గా కొలకలూరి
- మరో రెండు కార్పొరేషన్లకు చైర్మన్ల ఎంపిక
- నేడో, రేపో అధికారిక ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం నాలుగు కార్పొరేషన్లకు చైర్మన్‌లను ఎంపిక చేసింది. సంగీత నృత్య అకాడమీ చైర్మన్‌గా ప్రముఖ సినీ సంగీత దర్శకులు, ప్రజానాట్యమండలి ముద్దుబిడ్డ వందేమాతరం శ్రీనివాస్, సాహిత్య అకాడమీ చైర్మన్‌గా ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్‌లను ఎంపిక చేసినట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్(మైనార్టీస్) ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా మద్దిరాల జోసెఫ్ ఇమ్మాన్యుయేల్, జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ (ఫోక్ అండ్ క్రియేటివ్ అకాడమీ) చైర్మన్‌గా పొట్లూరి హరికృష్ణను నియమించనున్నట్లు సమాచారం. ఈ ఎంపికను అధికారికంగా - మిగతా 2 లో



గిన్నిస్ ప్రతినిధుల నుంచి అవార్డు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

మార్చిలోపు మరో రికార్డు

- లక్ష్యం 65 వేల క్యూబిక్ మీటర్లు
- 32 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని పూర్తి గిన్నిస్ ప్రతినిధుల నుంచి అవార్డు స్వీకరించిన సీఎం చంద్రబాబు
- పని చేసిన కార్మికులు, ఇంజనీర్లకు అభినందనలు
- రికార్డు స్థాపనకు పూజలు, పైలాన్ ఏర్పాటు

విశాలాంధ్ర - పోలవరం : పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టు ఏజెన్సీ నవయుగ కన్‌స్ట్రక్షన్ కంపెనీ మార్చిలోపు 65 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని చేసి మరో చరిత్ర సృష్టించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. కాంక్రీట్ పనులలో గిన్నిస్ రికార్డు స్థాపించి అవార్డు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం మండలం రామయ్యపేట వద్ద నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టును ముఖ్యమంత్రి సోమవారం మధ్యాహ్నం సందర్శించారు. నవయుగ కంపెనీ 24 గంటల్లో 32 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వర్క్ పూర్తి చేసి, ప్రపంచ రికార్డు సాధించిన నేపథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో - మిగతా 2 లో

సర్కారుకు ఆర్బీఐ సాహో..!

- రూ.30 వేల కోట్ల బదిలీకి ఓకే
- ఎన్నికల వేళ పన్నుల గండం
- అందుకే మోడీకి అండదండ



న్యూఢిల్లీ : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎట్టకేలకు మోడీ సర్కారుకు తలొగ్గింది. తన సర్వస్వతంత్ర స్థాయిని కోల్పోయింది. కేంద్ర ఆర్థిక శాఖ మాజీ అధికారి శక్తికాంత్ దాస్ ఆర్బీఐ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన సమయంలో అందరూ ఊహించినట్టే ఆర్బీఐలో పరిణామాలు చోటు చేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం కోరినట్టే నగదు బదిలీకి శ్రీకారం జరుగుతోంది. ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టే తరుణంలో... రూ.30 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాలని ఆర్బీఐ నిర్ణయం తీసుకుంది. ఈ మొత్తాన్ని 2019 మార్చి నెలాఖరులోపు ప్రభుత్వానికి సమకూర్చుతుంది. దీంతో పన్నుల భారం లేకుండా మోడీ ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించే అవకాశం ఉంది. కేంద్రానికి ఆర్బీఐ నిల్వల నుంచి నగదు కేటాయింపు, తదితర సమస్యలతో గత నెలలో కేంద్ర ప్రభుత్వం, ఆర్బీఐ మధ్య వివాదం నడిచిన విషయం విదితమే. దీంతో అప్పటి గవర్నర్ ఊర్జిత్ పటేల్ రాజీనామా చేయటంతో మోడీకి అత్యంత విధేయుడిగా పేరొందిన శక్తికాంత్ దాస్‌ను నియమించారు. ఇక మే నెలలో ఎన్నికల జరగనున్న నేపథ్యంలో ప్రజారంజక బడ్జెట్‌ను తీసుకు రావాలంటే.. ఆర్థికంగా వెసులు బాటు కావాలి. ఈ నేపథ్యంలోనే ఆర్బీఐ మిగులు నిధుల నుంచి కొంత ఇవ్వాలని ప్రభుత్వం ఆర్బీఐపై ఒత్తిడి తెచ్చింది. ఇందుకు ఆర్బీఐ తలొగ్గినట్టే. కేంద్ర ప్రభుత్వానికి రూ.30 వేల కోట్ల డివిడెండ్‌ను పంచుతున్నట్టు ఆర్బీఐ అధికారులు తెలిపారు. జీడీపీలో 3.3 శాతం లోటును అధిగమించేందుకు ఈ నిధులు కేంద్రానికి అత్యవసరం. ఇప్పటికే సుమారు లక్ష కోట్ల మేరకు కేంద్ర ప్రభుత్వ ఆదాయం పడిపోయినట్టు ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వానికి నగదు కేటాయింపును పర్యవేక్షించేందుకు - మిగతా 2 లో

17 నుంచి మీసేవ బంద్

- చాలీచాలని కమీషన్‌తో ఆర్థిక ఇబ్బందులు
- సమస్యల పరిష్కారానికి డిమాండు

11లో

పల్లె గొంతెండుతోంది..

- గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి అవస్థలు
- శీతాకాలంలోనూ ట్యాంకర్లే ఆధారం

11లో

ఇదీ లోకం!



వెన్నుదన్నుగా ఉంటాం

- ప్రభుత్వం మెడలు వంచేలా ఉద్యమం
- చీకటి జీవోలతో ఉద్యోగుల తొలగింపా..? : రామకృష్ణ, ఓబులేసు, రవీంద్రనాథ్
- సాక్షరభారత్ ఉద్యోగుల ధర్నాకు సీపీఐ, కార్మిక సంఘాల సంఘీభావం



మహాధర్నాలో మాట్లాడుతున్న జి.ఓబులేసు, వేదికపై ఆర్.రవీంద్రనాథ్, పోతిన మహేష్, వెంకట సుబ్బయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సాక్షరభారత్ ఉద్యోగుల ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలుస్తామని, ప్రభుత్వం తక్షణమే వారికి వేతనాలిచ్చి, విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ డిమాండు చేశారు. ఆంధ్రప్రదేశ్ వయోజనవిద్య ఒప్పంద ఉద్యోగుల సంఘం(ఏఐటీయూసీ) ఆధ్వర్యాన సోమవారం విజయవాడ ధర్నాచౌక్ ప్రాంగణంలో మహాధర్నా నిర్వహించారు. శిబిరానికి పై నాయకులతోపాటు వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా - మిగతా 2 లో

ఏపీపై కేంద్రం వివక్ష

- 'అరుణ్ జైట్లీ' వ్యాఖ్యలు దారుణం
- హోదా, విభజన హామీల అమలులో వైఫల్యం
- 'పోలవరం' కార్మికలోకానికి అభినందనలు
- నేడు, రేపు దేశ వ్యాప్త కార్మికుల సమ్మెకు సంఘీభావం : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



11లో

ఏపీలో ఆర్టీజీఎస్ సేవలు భేష్..

చంద్రబాబుకు బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రశంస

2లో



అజర్‌బైజాన్‌లో మహిళల ప్రదర్శన

బకు : అక్రమంగా జర్నలిస్టు మెహమాన్ హొసినోవ్‌ను అజర్‌బైజాన్ జైలులో నిర్బంధించినందుకు నిరసనగా వందలాదిమంది ప్రదర్శన జరిపారు. జైలులో నిర్బంధించన జర్నలిస్టు పదిరోజులుగా నిరాహారదీక్ష చేస్తున్నారు. ఆయనను తక్షణం జైలు నుండి విడుదల చేయాలని ప్రదర్శన జరిపిన మహిళలు నినాదాలు చేసారు. రెండేళ్లుగా జర్నలిస్టు జైలులో దుర్భరజీవితం గడుపుతున్నారు. అక్రమకేసులను బనాయించి ఆయనను జైలులో పెట్టారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం ప్రమాదకరంగాఉందని అధికారులు తక్షణం ఆయనపైన బనాయించిన కేసులను ఎత్తివేసి విడుదల చేయాలని మహిళలు డిమాండ్ చేసారు. ఆయనకు విధించిన జైలుశిక్ష గడువు మరో రెండునెలలో ముగుస్తుంది. ఈ దశలో ఆయనపై మరికొన్ని నేరారోపణ కేసులను బనాయించారు. ఆరోపణలు రుజువైతే ఆయన మరో ఏడేళ్లపాటు జైలులో ఉండవలసివస్తుంది. ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించిందని నిరసనకారులు ఆందోళన వ్యక్తంచేసారు. ఆయనకు తగిన వైద్య చికిత్స అందించాలని లాయర్లను నియమించుకునేందుకు తక్షణం అనుమతించాలని కూడా వారు డిమాండ్ చేసారు.

ఎర్డొగన్‌పై మహిళల నిరసన

అంకారా : తమ హక్కులను కాపాడాలని గౌరవమైన జీవనాన్ని సాగించేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ టర్కీలో వందలాది మహిళలు నిరసన ప్రదర్శన జరిపారు. 160 మహిళా సంఘాల ప్రతినిధులు ఇస్తాంబుల్‌లోని ఫుల్యా ఆర్ట్స్ సెంటర్‌లో సమావేశమై హక్కుల సాధనకు ఉద్యమించాలని తీర్మానించారు. రెండు రోజులపాటు ఈ సదస్సు జరిగింది. మహిళా సంఘాల తరపున చేసినతీర్మానాన్ని పీపుల్స్‌డెమొక్రాటిక్ పార్టీ డెప్యూటీలు ఫిలాన్ డీరియట్ టాస్ డెమిర్, జులియా గులమ్, పీపుల్స్ డెమొక్రాటిక్ కాంగ్రెస్ ప్రతినిధి కొసిగిట్ చదివి వినిపించారు. మనం ఇళ్లల్లో ఉంటున్నాం, పనులు చేస్తున్నాం, వీధుల్లో నిరసన తెలియజేస్తున్నాం,హోటల్‌లో అలాగే యూనివర్సిటీల్లో, గ్రామాల్లో వివిధ కార్యకలాపాల్లో పాల్గొంటున్నాం..పార్లమెంటులోనూ మనప్రాతినిధ్యం ఉంది. అనేక విభాగాల్లో మనం పనులు చేస్తూ ఉన్నాం..ఈ దశలో హక్కులను, గౌరనీయమైన జీవనాన్ని సాగించేందుకు ఉద్యమాన్ని కొనసాగించాలని తీర్మానించారు. మహిళలపట్ల ద్వేషాన్ని విడనాడాలి..అసమాన సమాజంలో టర్కీ 144దేశాల్లో 131స్థానంలో ఉందని ప్రపంచ ఆర్థిక వేదిక 2017 నివేదిక తెలియజేసింది. మహిళలకు వేతనాలు పురుషులకంటే 17.8శాతం తక్కువగా చెల్లిస్తున్నారు. స్త్రీ,పురుష సమానత్వాన్ని ప్రభుత్వం అన్ని రంగాలలోనూ అమలుచేయాలి. మహిళలపై హింస ఇటీవలికాలంలో పెరిగింది. 25ఏళ్ల లోపు ఉన్న మహిళలకు ఉపాధిలేకుండాపోయింది. దేశంలో చేపడుతున్న ఉద్యమానికి అర్జెంటైనా నుండి ఇరాన్ వరకు ఐస్‌లాండ్ నుండి అమెరికా వరకు, పోలెండ్ నుండి స్పెయిన్‌వరకు సంఘీభావం వ్యక్తమవుతోందని సదస్సులో పలువురు వక్తలు తెలిపారు.

విశాలాంధ్ర ప్రపంచం

వాణిజ్య యుద్ధం స్వస్తికి అమెరికా, చైనా చర్చలు

బీజింగ్ : రెండు దేశాల మధ్య తలెత్తిన వాణిజ్యయుద్ధాన్ని పరిసమాప్తి చేసేందుకుగాను అమెరికా, చైనా ప్రతినిధుల మధ్య సోమవారం కీలక చర్చలు ప్రారంభమయ్యాయి. గతంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు సమావేశమై 90 రోజుల పాటు ఎలాంటి సుంకాలను పెంచరాదని నిర్ణయించారు. ఈ నిర్ణయానికి అనుగుణంగానే తాజాగా చర్చలు ప్రారంభమయ్యాయి. 2018 ప్రారంభంలోనే ట్రంప్ చైనా నుండి దిగుమతి చేసుకునే పలు వస్తువులపైన సుంకాలను పెంచడంతో వాణిజ్య యుద్ధం మొదలయ్యింది. అమెరికాకు దీటుగా సమాధానం చెబుతూ ఆదేశం నుండి దిగుమతి చేసుకునే వస్తువులపైన చైనా కూడా సుంకాలను పెంచింది. ఆ తరువాత ట్రంప్ యూరోపియన్ యూనియన్ దేశాల నుండి దిగుమతి చేసుకునే అల్యూమినియం ఇంకా ఇతర వస్తువులపైన కూడా సుంకాలను పెంచారు. ఈ ప్రభావం ప్రపంచంలోనే అనేక స్టాక్‌మార్కెట్లపైన, ఆర్థికరంగంపైన ఉన్నది. గత ఏడాది 250 బిలియన్ డాలర్ల విలువైన



సుంకాలను 25 శాతం వరకు చైనా వస్తువులపైన ట్రంప్ పెంచారు. అనంతరం చైనా అమెరికా వస్తువులపైన 110 బిలియన్ డాలర్లమేర సుంకాలను పెంచింది. ఎట్టకేలకు ఈనెల 1వ తేదీ నుండి 90 రోజులపాటు సుంకాలను పెంపుదల చేయకుండా నిలువరించాలని ట్రంప్, జిన్‌పింగ్ నిర్ణయించారు. సోమవారం ప్రారంభమైన చర్చలలో అమెరికా వాణిజ్య విభాగం డిప్యూటీ ప్రతినిధి జఫ్రీగెరిష్ నాయకత్వంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. రెండురోజుల పాటు ఈ చర్చలు జరిగాయి. చైనా నుండి ఉపమంత్రుల స్థాయిలో ఉన్న ప్రతినిధులు పాల్గొన్నారు. రెండు దేశాల మధ్య జరిగే వాణిజ్యంలో తమకు 375 బిలియన్ డాలర్లమేర లోటు ఏర్పడుతున్నందునే దీనిని సరిదిద్దాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ సమావేశంలోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్న హామీలేదని చైనా ప్రతినిధులు తెలిపారు. వాణిజ్య అసమతౌల్యాన్ని సరిదిద్దేందుకు ఇరుదేశాల ప్రతినిధులు ప్రయత్నిస్తున్నారని హాంకాంగ్ నుండి వెలువడే సౌత్‌చైనా మార్నింగ్ పోస్టు పత్రిక తెలిపింది. అమెరికా నుండి సోయాబీన్ విత్తనాల కొనుగోలును పునరుద్ధరించాలని కార్లు, ఇతర వస్తువులపై విధించిన సుంకాలను తగ్గించాలని చైనా యోచిస్తున్నది. సాంకేతిక పరిజ్ఞానాన్ని బలవంతంగా బదిలీచేయకుండా నిషేధం పెట్టాలని కూడా భావిస్తున్నది. చర్చలు ఫలవంతం కాకపోతే మరో 267 బిలియన్ డాలర్ల విలువైన చైనా వస్తువులపైన దిగుమతి సుంకాలను పెంచుతామని ట్రంప్ ఇంతకుముందే చెప్పారు. వాణిజ్యయుద్ధం నేపథ్యంలో చైనా ఆర్థికవృద్ధి మూడవ త్రైమాసికంలో 6.5శాతం నమోదైంది.

అధ్యక్షుడు బషీర్ గద్దె దిగాల్సిందే..

సూడాన్‌లో అమెరికా జోక్యానికి కమ్యూనిస్టుల ఖండన

ఖార్టోమ్: సూడాన్‌లో ప్రతిపక్షాన్ని విభజించి తమ అనుకూల ప్రభుత్వాన్ని రక్షించేందుకు అమెరికా జోక్యం చేసుకుంటున్నదని సూడాన్ కమ్యూనిస్టు పార్టీ ఖండించింది. సూడాన్ అధ్యక్షుడు ఒమర్‌అల్ బషీర్ ప్రభుత్వంతో చర్చలను కమ్యూనిస్టులు తిరస్కరించారు. అధ్యక్షుడు బషీర్ ఎట్టి పరిస్థితుల లోను రాజీనామా చేయవలసిందేనని డిమాండ్ చేస్తూ దేశంలో భారీగా ప్రదర్శనలు జరుగుతు న్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో సూడాన్ కమ్యూనిస్టు పార్టీ కీలకపాత్ర నిర్వహిస్తోంది. బషీర్ పదవినుండి వైదొలగి ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలని కమ్యూనిస్టులు కోరుతున్నారు. ఉద్యమాన్ని పక్కదారి పట్టించేందుకు అమెరికా ప్రభుత్వం ప్రయత్నిస్తు న్నదని కమ్యూనిస్టు పార్టీ తెలిపింది. అంతర్జాతీయ తోడ్పాటుతో సూడాన్ ప్రభుత్వం అధికారాన్ని నిలుపుకునేందుకు ఒక పథకాన్ని రూపొందించిందని కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. పరివర్తన దశ కోసం జాతీయస్థాయిలో చర్చలు జరగాలని చేసిన ప్రతి పాదనను కూడా కమ్యూనిస్టులు తిరస్కరించారు. అలాగే సైన్యం ప్రభుత్వాన్ని హస్తగతం చేసుకునేందుకు చేసే ప్రయత్నాన్ని కూడా గట్టిగా తిరస్కరించారు. నిరసనకారులపైన కాల్పులు జరపడాన్ని వందలాదిమందిని అరెస్టు చేయడాన్ని కమ్యూనిస్టు పార్టీ ఖండించింది. అరెస్టయినవారిలో 5గురు కమ్యూనిస్టు పార్టీ నాయకులున్నారు. ఇంటర్నెట్ వినియోగంపైన ప్రభుత్వం పరిమితి విధించింది. అనేకమంది జర్నలిస్టులను అరెస్టు చేశారు. జర్నలిస్టులలో ఒకరైన కమాల్‌కరర్ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు. పలు రాయితీలను ప్రకటించడం ద్వారా బషీర్ తన ప్రభుత్వాన్ని కాపాడుకుని రాజీనామా చేయకుండా కొనసాగాలని భావిస్తు న్నారు. ప్రభుత్వరంగ కార్మికులకు వేతనాలు పెంచుతానని కూడా ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. 1989లో జరిగిన తిరుగుబాటు సందర్భంగా బషీర్ ప్రభుత్వం ఏర్పడింది. ఆ తరువాత జాతుల మధ్య తీవ్ర ఘర్షణలు, అంత ర్యుద్ధం ఏర్పడ్డాయి. దేశంలో ఆర్థిక సంక్షోభానికి కారణం అంతర్జాతీయ ఆంక్షలేనన్న కారణాన్ని చూపేందుకు బషీర్ ప్రయత్నిస్తున్నారు. 50 బిలియన్ డాలర్లకుపైగా సూడాన్ అప్పుల్లో మునిగివుంది. అరబ్ దేశాల నుండి సహాయాన్ని పొందేందుకు ప్రయత్నిస్తున్నది. ఘర్షణల్లో 40 మందికిపైగా చనిపోయారు.



గోడకు బదులుగా ఉక్కు కంచె

వాషింగ్టన్ : అమెరికా మెక్సికో సరిహద్దుల్లో కాంక్రీటుగోడ నిర్మాణానికి బదులుగా ఉక్కు కంచె నిర్మించాలన్న ప్రతిపాదనను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచనప్రాయంగా చేశారు. గోడ నిర్మాణానికి 5.6 బిలియన్ డాలర్ల నిధులను మంజూరు చేయాలని ట్రంప్ చేసిన ప్రతిపాదనను ప్రతినిధుల సభ తిరస్కరించడంతో ట్రంప్ ప్రభుత్వం పాక్షికంగా రెండు వారాలుగా మూతపడిన విషయం తెలిసిందే. దీనికి ఏదోవిధమైన పరిష్కారం కావాలన్న భావనతో ట్రంప్ పైవిధంగా సూచించినట్టు తెలుస్తోంది. ఈ అంశంపైన విభేదాలను పరిష్కరించుకునేందుకు ప్రతినిధుల సభలో మెజార్టీవున్న డెమోక్రటిక్ పార్టీ కూడా సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. కాంక్రీట్ గోడకు బదులుగా తక్కువ వ్యయంతో బలమైన ఉక్కుకంచెను నిర్మించినట్లయితే అక్రమ వలసలను అరికట్టవచ్చునన్న ప్రతిపాదన ట్రంప్ చేశారు. ఈ



ప్రతిపాదన వెలువడకముందు ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన పార్లమెంటులో ఉన్నతస్థాయి నాయకులతో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో స్పీకర్ నాన్సీపెలోసి, సెనేట్ మైనార్టీ నాయకుడు చుక్‌షుమర్ పాల్గొన్నారు. ఈ సమావేశం ఫలితాన్ని ఇచ్చిందని ట్రంప్ తెలిపారు. సరిహద్దు భద్రతపైన అనేక అంశాలను చర్చించినట్టు ట్రంప్ వెల్లడించారు. ఉక్కు కంచెను నిర్మించే అంశాన్ని తాను వివరించానని ఆయన వెల్లడించారు. ఈ ప్రతిపాదనపైన వ్యతిరేకత వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని ఆయన అన్నారు. ఉక్కుకంచెను తయారుచేయడానికి తమ దేశంలో మంచి కంపెనీలు ఉన్నాయని, అవి తయారుచేసి ఇస్తాయని క్యాంప్ డేవిడ్ నుండి తిరిగి వైట్‌హౌస్‌కు చేరుకున్న ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ పై విషయం తెలియజేశారు. ఉక్కుకంచె గోడకంటే కూడా ఎక్కువ భద్రతను కల్పిస్తుందని ఆయన అన్నారు. కాంక్రీట్‌గోడ నిర్మాణానికి డెమోక్రాట్లు అంగీకరించనందున ఉక్కు కంచె ప్రతిపాదన చేశానని ట్రంప్ చెప్పారు. అక్రమ వలసలను నిరోధించేందుకు ఇలాంటి ఏర్పాటు ఏదో ఒకటి ఉండాలని ఆయన అన్నారు. వందలవేల మంది అక్రమంగా దేశంలోకి ప్రవేశించటంవల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు వందలాది బిలియన్లు నష్టం జరుగుతున్నదని ట్రంప్ చెప్పారు.

14న బ్రెగ్జిట్‌పైన పార్లమెంటులో ఓటింగ్

లండన్ : యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుండి వైదొలగేందుకు కుదిరిన బ్రెగ్జిట్ ఒప్పందం ముసాయిదాపైన బ్రిటన్ పార్లమెంటులో ఈనెల 14వ తేదీన చర్చల అనంతరం ఓటింగ్ జరుగుతుందని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. గతంలోనే ఓటింగ్ జరగవలసి ఉన్నప్పటికీ ఒప్పందం ముసాయిదాను ప్రతిపాదిస్తే తిరస్కరించే అవకాశం ఉన్నదని భావించిన ప్రధానమంత్రి థెరిసామె ఓటింగ్ తేదీని వాయిదా వేశారు. తన మంత్రివర్గ సభ్యులనుండేకాక ప్రతిపక్షాల నుండి కూడా ముసాయిదాపైన వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. పార్లమెంటు ఆమోదిస్తేనే ఒప్పందం అమలులోకి వస్తుంది. ఈ ఏడాది మార్చిలోపు ఈయూ నుండి బ్రిటన్ పూర్తిగా వైదొలగవలసివుంది. అన్ని అంశాలు పరిష్కరించుకునేందుకు దాదాపు రెండేళ్లు పరివర్తన దశ ఉంటుంది. ఇంతకుముందే దిగువ సభలో (హౌస్ ఆఫ్ కామన్స్) బ్రెగ్జిట్ ముసాయిదాపైన చర్చ జరిగింది. పార్లమెంటులో 650 మంది సభ్యులున్నారు. వీరిలో అత్యధికుల తోడ్పాటు లభిస్తుందన్న హామీ లేకపోవడంతోనే ప్రధాని ఓటింగ్‌ను వాయిదా వేస్తూ వచ్చారు. ఉత్తర ఐర్లాండ్ పార్టీ డియుపి సాధారణంగా థెరిసా ప్రభుత్వంవైపు ఉంటుంది. అయితే బ్రెగ్జిట్‌పైన ఆ పార్టీ కూడా వ్యతిరేకంగా నిలిచింది. బ్రెగ్జిట్‌ను ఆమోదించడానికి 318 ఓట్లు అవసరమవుతాయి. వీరిలో 7గురు సిన్‌ఫెన్ సభ్యులు, నలుగురు స్పీకర్లు ఓటు చేయరు. ఓటింగ్ వాయిదాపడటానికి ముందు 3 రోజులపాటు చర్చలు జరిగినప్పటికీ ఒక అవగాహనకు రాలేకపోయారు. బుధవారం నుండి తిరిగి సమావేశాలు ప్రారంభమవుతాయి. ఈ సమావేశాలలో ఎన్నిరోజులు చర్చలు జరగాలి, ఎప్పుడు ఓటింగ్ జరగాలనేది నిర్దిష్టమైన నిర్ణయం జరుగుతుంది. ప్రస్తుతానికి 9, 10 తేదీలలో చర్చలు జరిగే అవకాశం వుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. 11వ తేదీన కూడా చర్చలు జరగాలని కొంతమంది ప్రతిపాదించారు.ప్రతిరోజు 8 గంటలసేపు చర్చలు సాగుతాయి. ముసాయిదా ఒప్పందంలో సవరణలను కూడా ప్రతిపాదించే అవకాశం ఉంది.

20 కోట్ల మంది ఆక్రోశం

(మొదటిపేజీ తరువాయి)

కౌర్ వివరించారు. అహంకారపూరితంగా వ్యవహరిస్తున్న ప్రధాని మోడీ ప్రభుత్వం కార్మికులను అణగదొక్కాలని చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, యూటీసీయూ ఎల్‌పీఎఫ్, యూటీయూసీలు ఈ సమ్మెలో పాల్గొనుండగా, ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ భారతీయ మజ్దూర్ సంఘ్ దీనిలో పాల్గొనడం లేదు. ట్రేడ్ యూనియన్ చట్టం 1926ని నిర్వీర్యం చేస్తూ, యూనియన్లకు స్వతంత్రత లేకుండా కేంద్రం దురహంకారం ప్రదర్శిస్తోందని ఆమె ధ్వజమెత్తారు. ఈ సమ్మెకు విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయని యూనియన్లు వెల్లడించాయి.

చైర్మన్‌గా వందేమాతరం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం వెల్లడించాల్సి ఉంది. ఒకటి రెండు రోజుల్లో జీవోలు విడుదల చేసే అవకాశముంది. ప్రొఫెసర్ ఇనాక్, వందేమాతరం శ్రీనివాస్ ఎంపిక పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభృతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నియామకంతో ప్రజల, అభ్యుదయ పాటకు పట్టాభిషేకం జరిగినట్లు అయిందన్నారు.

ఇంకా పదవులు పట్టుకొని వేళాడుతారా ? : సర్వే

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు కుంతియా తమ పదవుల నుంచి తప్పుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ డిమాండు చేశారు. ఆదివారం జరిగిన పార్టీ సమీక్ష సమావేశంలో పార్టీ ముఖ్యనేతలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారన్న కారణంతో సర్వేపై సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఉత్తమ్, కుంతి యాలపై నిప్పులు చెరిగారు తనపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలంటే హైకమాండ్‌కే అధికారం ఉందన్నారు. పార్టీలో పరిణామాలపై ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా.. అని ప్రశ్నిస్తూ పార్టీ నుంచి తొలగించే అధికారం ఎవరికీ లేదని, నేతల పని తీరుపై నిలదీసినందుకే టార్గెట్ చేశారని సర్వే మండిపడ్డారు. గత ఎన్నికల్లో తనను, మల్లు భట్టి విక్రమార్కను ఓడించాలని ఉత్తమ్ ప్రయత్నించారని ఆరోపించారు. గూడూరు నారాయణ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు గతంలో దిగ్విజయ్ సమక్షంలోనే కొట్టుకున్నారని అప్పుడు వారినెందుకు పార్టీ నుంచి తొలగించలేదని ప్రశ్నించారు.



వెన్నుదన్నుగా ఉంటాం

(మొదటిపేజీ తరువాయి)

రామకృష్ణ మాట్లాడుతూ.. ఏళ్లతరబడి సాక్షరాభారత్ ఉద్యోగుల సేవలను ప్రభుత్వం వినియోగించుకుని, ఉన్నపళంగా వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నామంటూ జీవోలు జారీచేయడం ఘోరమైన చర్యని అన్నారు. అంకిత భావంతో పని చేస్తున్న ఉద్యోగులందర్నీ ప్రభుత్వం దారుణంగా దగా చేసిందని విమర్శించారు. అమరావతి నిర్మాణానికి మోడీ డబ్బులు ఇవ్వకపోయినా చంద్రబాబు పనులు కొనసాగిస్తున్నారని, అదే దిశగా సాక్షరభారత్ సిబ్బందికి వేతనాలు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాల్లోనూ నేడు సాక్షరాభారత్ ఉద్యోగులు భాగస్వాములుగా ఉన్నారని వివరించారు. వారితో అన్ని రకాలుగా పని చేయించుకుని, నేడు వారికి వేతనాలు ఇవ్వలేమంటూ బయటకు పంపడం కుట్రపూరిత చర్యని విమర్శించారు. ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయిస్తే.. సాక్షరభారత్ ఉద్యోగులందరికీ వేతనాలు ఇవ్వొచ్చని సూచించారు. వారంతా కన్నెర్రజేస్తే.. రాబోయే ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం ఇంటికెళ్లడం తథ్యమని రామకృష్ణ స్పష్టంచేశారు. ఓబులేసు మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు కాంక్రీటు పనుల రికార్డు వెనుక శ్రామికుల కష్టార్జితం దాగివుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్ని పథకాల్లోనూ కార్మికులు, కర్షకులు, ఉద్యోగుల కృషి ఉందన్నారు. వయోజనవిద్య నుంచి పోలవరం కార్మికుల వరకు ఫలితాలు సాధించినా..అదంతా చంద్రబాబు కీర్తిగానే ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సాక్షరభారత్‌కు చెందిన 21,500 మంది సిబ్బందిని ఏళ్లతరబడి పని చేయించుకుని..వారిని అకారణంగా విధుల నుంచి తొలగించారని మండిపడ్డారు. మార్చి నుంచి జూన్ వరకూ సాక్షరభారత్ ఉద్యోగులు పని చేస్తున్నట్లుగా లెక్కలున్నాయని, చీకటి జీవోలతో వారిని తొలగించామంటూ ప్రభుత్వం ప్రచారం చేయడం మోసపూరితమని విమర్శించారు. సాక్షరభారత్ ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకుని, వారికి పెండింగ్‌లో ఉన్న ఏడు మాసాల వేతనాలివ్వాలని డిమాండు చేశారు. ఉద్యోగులు చేసే పోరాటాలకు ఏఐటీయూసీ నిత్యం అండగా నిలుస్తుందని ఓబులేసు భరోసా ఇచ్చారు. ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా 21 వేల మంది కార్మికులను ఇంటికి పంపడం దారుణమైన చర్యని తూర్పారబట్టారు. సాక్షరభారత్ సమన్వయకర్తలందరూ గ్రామాల్లో నూరుశాతం అక్షరాస్యత సాధనకు కృషి చేశారని పేర్కొన్నారు. తొలగించిన ఏసీఓ, డీసీఓ, వీసీవో ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని రవీంద్రనాథ్ డిమాండు చేశారు. జనసేన రాష్ట్ర నాయకుడు పోతిన వెంకట మహేష్ మాట్లాడుతూ.. సాక్షరభారత్ ఉద్యోగుల ఆందోళనలకు జనసేన సంపూర్ణ మద్దతు తెలుపుతోందని చెప్పారు. వయోజన విద్య ఒప్పంద ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సాక్షరభారత్ ఉద్యోగుల సేవలు కీలకంగా నిలుస్తున్నాయని చెప్పారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా జూన్ 14 నుంచి మెమోలు ఇచ్చారని చెప్పారు. ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ, లక్షలాది మందికి అక్షరాలు నేర్పించిన చేతులనే ప్రభుత్వం అన్యాయంగా చిదిమేస్తోందని ఎద్దేవా చేశారు. కార్మిక మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకులు ధనలక్ష్మి, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు నరసింహారావు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో 3 లక్షలమంది కార్మికులు పని చేస్తున్నారని చెప్పారు. వారందరి సమస్యల్ని పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. ఈ సభకు ఏపీ వయోజన విద్య ఒప్పంద ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.సిద్ధారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో 13 జిల్లాలకు చెందిన సాక్షరభారత్ ఉద్యోగులు, సిబ్బంది, వివిధ కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

మార్చిలోపు మరో రికార్డు

(మొదటిపేజీ తరువాయి)

ఆయన పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్టు కాంక్రీట్ పనుల్లో ప్రపంచ రికార్డు స్థాపించినందుకు పూజలు నిర్వహించి, అక్కడ పైలాన్ ఆవిష్కరించారు. అనంతరం పోలవరం ప్రాజెక్టులో స్పిల్ చానల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రపంచ స్థాయి కాంక్రీట్ పనుల గుర్తింపు పత్రాన్ని ముఖ్యమంత్రికి గిన్నిస్ బుక్ నిపుణులు రిషినాథ్ అందించారు.

కార్యక్రమంలో భాగస్వాములైన ఇంజినీర్లను, అధికారులను సీఎం సన్మానించిన అనంతరం చంద్రబాబు బహిరంగ సభలో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టులో ఎన్ని కార్యక్రమాలు చేసినా ఇప్పుడు పొందిన ఆనందం మరెన్నడూ పొందలేదని ఆయన అన్నారు. 24 గంటల్లో 32,100 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని విజయవంతంగా పూర్తి చేసినందుకు నవయుగ కంపెనీ, కార్మికులకు, ఇంజనీర్లకు జలవనరుల శాఖ అధికారులకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. గిన్నిస్ బుక్ రికార్డు అధిగమించడానికి శ్రమించిన కార్మికులకు, ఇంజనీర్లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఈ ఏడాది జూన్ నాటికల్లా గ్రావిటీ ద్వారా రాష్ట్ర ప్రజలకు సాగునీటిని, తాగునీటిని అందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులువచ్చినా రాక పోయినా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని, కేంద్ర ప్రభుత్వం బకాయిపడ్డ సొమ్ములను వడ్డీతో సహా చెల్లించాలని ఆయన డిమాండు చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా అనంతపురం జిల్లాకు నీరు అందించడంతో పరిశ్రమల స్థాపన, అభివృద్ధి జరిగిందన్నారు. గోదావరి, కృష్ణ నదుల అనుసంధానంతో రాష్ట్రంలో రూ.14 వేల కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతిపక్షాలు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని కోరుతూ, ఏపీని భవిష్యత్‌లో ఇతర రాష్ట్రాలు అనుసరిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ముఖ్యకార్యదర్శి శశిభూషణ్, ఇంజనీరింగ్ చీఫ్ వెంకటేశ్వరరావు, పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ శ్రీధర్, జల వనరుల శాఖ శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, పితాని సత్యనారాయణ, ఎమ్మెల్యేలు మరియన్, శ్రీనివాస్, కొత్తపల్లి సుబ్బారాయుడు, పోలవరం ప్రాజెక్టు సీనియర్ మేనేజర్ క్రాంతి పాల్గొన్నారు.

సర్కారుకు ఆర్బీఐ సాహో..!

(మొదటిపేజీ తరువాయి)

ఓ కమిటీని ఆర్బీఐ నియమించింది. ఫిబ్రవరి 1 లోపు కొంత సొమ్ము కేంద్రానికి కేటాయించే అవకాశం ఉంది.

అవసరానికి తగు నిర్ణయం ...!

అవసరాన్ని బట్టి ఆర్థిక రంగానికి నగదును సరఫరా చేస్తామని, దేశ ఆర్థిక వ్యవస్థలో నగదు కొరత సమస్య ఉంటే.. దానిపై భారత రిజర్వు బ్యాంకు తగిన చర్యలు తీసుకుంటుందని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ అన్నారు. ప్రస్తుతానికి నగదు నిల్వల సమస్య చాలా వరకు తీరిందని వెల్లడించారు. ఢిల్లీలో సోమవారం చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంఘాల ప్రతినిధులతో శక్తికాంత్ దాస్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగదు కొరత సమస్య తగ్గిందని, తరచూ ఈ అంశంపై సమీక్ష చేస్తున్నామని చెప్పారు. బ్యాంకింగేతర ఫైనాన్షియల్ కంపెనీలతో బుధవారం సమావేశం కానున్నట్లు ఆయన తెలిపారు.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పునర్నిర్మాణం కోసం వచ్చే రుణాల దరఖాస్తుల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని శక్తికాంత్ బ్యాంకులకు సూచించారు. ఆర్థిక వ్యవస్థలోకి నగదును సరఫరా అవసరాలను బట్టి ఉంటుందని, ఆర్బీఐ తగినంత నగదు నిల్వలను ఉంచుతుందని ఆయన పేర్కొన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ డబ్బు కోల్పోవడాన్ని ఆర్బీఐ ఇష్టపడదని ఆయన వెల్లడించారు.

సున్నిత సమస్యను జటిలం చేశారు

విశాలాంధ్ర ప్రతినిధి : అగ్రవర్ణాల్లో పేదలకు పదిశాతం రిజర్వేషన్ ఇవ్వటం సముచితమే. కానీ ఎలాంటి చర్చ లేకుండా, ఎన్నికల సమయంలో ఏకపక్షంగా సంకుచిత నిర్ణయం తీసుకున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ఈబీసీ కోటాపై ఆయన స్పందిస్తూ... అగ్రవర్ణాల్లో పేదలకు రిజర్వేషన్ కల్పించే అంశంపై అన్ని వర్గాల్లో చర్చ జరగలేదన్నారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించలేదన్నారు. తెలంగాణలో ముస్లింలు, ఆంధ్రప్రదేశ్‌లో కాపులు రిజర్వేషన్లు కోరుతున్నారని, ఈ విషయంతో ఈ వర్గాలు డిమాండు చేసే అవకాశం ఉందన్నారు. పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజారిటీ ఉండాలి, రాజ్యసభలో నెగ్గుతుందో లేదో? ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో అగ్రవర్ణాలు తిరుగుబాటు చేశారు, వీరిని బుజ్జగించటానికే మోడీ ఈ నిర్ణయం తీసుకున్నారని నారాయణ స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో మిగిలిన వర్గాల్లో ఆందోళన రగులుతుందని, ఈ చట్టం అమలు జరగటం కష్టమన్నారు. సున్నితాంశంగా మార్చేశారని, కేవలం సంకుచిత వైఖరితోనే అతి మంచి అంశాన్ని జటిలంగా మార్చారని నారాయణ విమర్శించారు. ఎన్నికల్లో లబ్ధి పొందటానికే అగ్రవర్ణాల రిజర్వేషన్ తీసుకు వచ్చారని ఆయన స్పష్టం చేశారు.

ఇది మోడీ లాలీపాప్ : హార్థిక్ పటేల్

అహ్మదాబాద్ : ఆర్థికంగా వెనకబడిన అగ్రవర్ణ కులాలకు పది శాతం రిజర్వేషన్ కల్పించాలనే కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని పాటిదార్ ఉద్యమ నేత హార్థిక్ పటేల్ తప్పుబట్టారు. ఓ జాతీయ చానెల్‌తో మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు కోసం ప్రధాని నరేంద్ర మోడీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని, అందుకే తన అమ్ములపొదిలోని చివర అస్త్రాన్ని ఈ రకంగా వదిలారన్నారు. ఈ రిజర్వేషన్ లాలీపాప్ ప్రజలకు అందిస్తే అది పెద్ద పొరబాటు అవుతుందని, సరిగ్గా అమలు చేయక పోయినా ప్రజలు తిరగబడతారని వ్యాఖ్యానించారు. మోడీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

ఎన్నికల తాయిలం...!

(మొదటిపేజీ తరువాయి)

109 గజాల కంటే తక్కువ నివాస స్థలం, నోటిఫైడ్ కాని మున్సిపాలిటీ పరిధిలో 209 గజాల కంటే తక్కువ స్థలం ఉన్నవారిని ఆర్థికంగా వెనుకబడిన వారిగా పరిగణిస్తారని తెలుస్తోంది. వీరికి రిజర్వేషన్ వర్తించే అవకాశం ఉంటుందని సంబంధిత వర్గాల నుంచి సమాచారం. ఇప్పటి వరకు రిజర్వేషన్ వల్ల ఎలాంటి ప్రయోజనం పొందని ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ రిజర్వేషన్లు అందుతాయని తెలుస్తోంది. కుల ఆధారిత రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని గతంలో సుప్రీంకోర్టు వెల్లడించింది. ఈ పది శాతం రిజర్వేషన్‌పై సవరణలను పార్లమెంటు ఆమోదిస్తే కోటా 50 శాతం దాటి పోనుంది. చాలా కాలంగా ఈ డిమాండ్ ఉండగా.. ఎన్నికలకు ముందే కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ బిల్లు కోసం రేపటితో ముగియనున్న పార్లమెంట్ సమావేశాలను రెండు రోజులపాటు పొడిగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. అగ్రవర్ణాల్లో తమ పట్టును మరింత పెంచుకునేందుకు మోడీ సర్కార్ వ్యూహాత్మకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు భావిస్తున్నారు. రాం విలాస్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్జేపీ, రాందాస్ అథవలే నేతృత్వంలోని ఆర్పీఐ తదితర ఎన్డీయే మిత్రపక్షాలు అగ్రవర్ణాల పేదలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని గతంలోనూ డిమాండు చేశాయి. ఈ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతులు బలం ఉండాలి. లోక్‌సభలో గట్టెక్కినా రాజ్యసభలో కష్టమే. ఆమోదం పొందితే తమ ఘనత..లేకపోతే ప్రతిపక్షాల కుట్రగా అభివర్ణించే అవకాశం ఉందనేది రాజకీయ పరిశీలకుల విశ్లేషణ.

ఏపీలో ఆర్టీజీఎస్ సేవలు భేష్..

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీజీఎస్ విధానం అద్భుతంగా అమలు చేస్తున్నారని సీఎం చంద్రబాబును బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. సోమవారం ఆయన బ్రిటన్ నుంచి అమరావతికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రియల్‌టైమ్ గవర్నెన్స్ పని విధానాన్ని టోనీ బ్లెయిర్ పరిశీలించారు. వ్యవసాయ రంగం సాగులో ఆర్టీజీఎస్ వినియోగిస్తున్న తీరును ఆయనకు సీఎం వివరించారు. గ్రీవెన్స్ కేంద్రంలో 3 వేల మంది 1100 ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. సచివాలయంలో బ్లెయిర్‌కు ఆయన ప్రత్యేక ఆతిథ్యం ఇచ్చారు. అనంతరం బ్లెయిర్‌ను చంద్రబాబుతోపాటు మంత్రులు నారా లోకేష్, పుల్లరావు, ఆనందబాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠాలు ఘనంగా సత్కరించారు.

ముఖం చెల్లకే మోడీ డ్రామాలు

ప్రధానిపై ఆర్థిక మంత్రి యనమల ఫైర్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ప్రజల నుండి వ్యక్తమవుతున్న నిరసనలకు భయపడి గుంటూరు పర్యటనను రద్దు చేసుకున్న ప్రధాని దొడ్డిదారిన కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్‌ల డ్రామా ఆడుతున్నారని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రానికి రావడానికి ముఖం చెల్లక, రాఫెల్ కుంభకోణంపై నుంచి దృష్టి మళ్లించాలని మోడీ ఎత్తుగడ వేశారని ఆరోపించారు. రూ.43 వేల కోట్ల రాఫెల్ స్కామ్‌పై మోడీ మౌనం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. అవినీతి రహిత రాష్ట్రాల్లో ఏపీ 3వ స్థానంలో ఉందని, మీ గుజరాత్ ఏ స్థానంలో ఉంది, బీజేపీ పాలిత రాష్ట్రాలు ఏ స్థానంలో ఉన్నాయని ప్రశ్నించారు. వాటి గురించి మాట్లాడకుండా ఆంధ్రప్రదేశ్‌లో అవినీతి అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడే మోడీ అవినీతి గురించి చెప్పిన విషయం ఆయన గుర్తెరగాలన్నారు. ఎన్టీఆర్ పేరెత్తే యోగ్యత, ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత గానీ మోడీకి లేదన్నారు. 'సన్ రైజ్ స్టేట్' అనే దానికి కూడా వక్రభాష్యాలు తీశారు. బీజేపీ నీచ ధోరణికి ఇదే తార్కాణమన్నారని తెలిపారు. నిధులు ఇవ్వకుండా ఏపీని దొంగదెబ్బ తీయడంతోపాటు అసలు మనుగడే దెబ్బతీసేందుకు మోడీ కుట్రలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. నరేగాలో గతంలో రూ.1,300 కోట్లు బకాయి పెట్టారు. ఇప్పుడు మరో రూ.1,200 కోట్లు ఇవ్వాలి. పోలవరానికి ఇంకా రూ.3,500 కోట్లు ఇవ్వాలి. తొలి ఏడాది ఆర్థిక లోటుకు ఇంకా రూ.12 వేల కోట్లు ఇవ్వాలి. అయినా ఏపీ అభివృద్ధి చెందుతుండడంతో ప్రధాని అక్కసు వెళ్లగక్కుతున్నారని పేర్కొన్నారు. గుజరాత్‌ను మించిపోతుందనే ఆంధ్రప్రదేశ్ పై కక్ష పెంచుకున్నారని విమర్శించారు.

సార్వత్రిక సమ్మెకు ఎస్టీయూ మద్దతు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశ వ్యాప్తంగా 8, 9 తేదీల్లో కార్మిక సంఘాలు నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) సంపూర్ణ మద్దతిస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎస్టీయూ నేతలు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. 8న జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, 9న కేంద్ర కార్యాలయాల ఎదుట చేపట్టే మానవహారాలకు స్థానిక నేతలంతా మద్దతివ్వాలని పిలుపునిచ్చారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా దేశ వ్యాప్త సమ్మెకు సంఘీభావం తెలిపారు.

అరకులో మూడురోజుల పర్యాటక సదస్సు

విశాలాంధ్ర - అమరావతి : పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అరకు కేంద్రంగా పలు క్రీడలు, సదస్సులు నిర్వహించనున్నామని పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం కార్యక్రమానికి సంబంధించి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. మీనా మాట్లాడుతూ సంక్రాంతి పండగ అనంతరం ఈ నెల 17 నుంచి 20 వరకు మూడు రోజుల పాటు అరకులో సాహస పర్యటన, భవిష్యత్తు సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పారా మోటరింగ్, వాటర్ రోలర్, హాట్ ఎయిర్ బెలూనింగ్, కయాకింగ్, సైక్లింగ్, హైక్స్, జార్బ్ తదితర సాహస పర్యాటక అంశాల ప్రదర్శన ఉంటుందని వివరించారు. కొన్ని సదస్సు జరిగే ప్రాంగణంలో జరుగనుండగా, మరికొన్ని బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించనున్నామని, ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని జాతీయ స్థాయిలో అగ్ర స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

అత్యధిక యుద్ధాలు ఎదుర్కొన్న భారత్

విశాలాంధ్ర-విశాఖసిటీ: ప్రపంచంలో అత్యధిక యుద్ధాలను ఎదుర్కొంది భారత దేశమేనని, దేశ రక్షణ కోసం నిరంతరం సన్నద్ధంగా ఉండాలని అరుణాచల్ ప్రదేశ్ గవర్నర్ డాక్టర్ బీడీ మిశ్రా తెలిపారు. సోమవారం విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన 'విపత్తు నిర్వహణ జాతీయ సదస్సు'ను జ్యోతి ప్రజ్వలనచేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం దేశ రక్షణ అంశంపై ప్రసంగిస్తూ, ప్రతీ వ్యక్తి దేశభక్తితో సాగాలని, దేశ రక్షణ, వికాసానికి పునరంకితం కావాలన్నారు. సరిహద్దు వద్దే కాకుండా అంతర్గతంగా సైతం పలు విపత్తులు నిత్యం దర్శనమిస్తున్నాయని, వీటిని ఎదుర్కోవడానికి సమాయత్తం, సన్నద్ధత ఎంతో అవసరమన్నారు. పొరుగుదేశం చైనా నౌకా, విమాన, రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టి తమ రక్షణ సంపత్తిని పెంపొందించుకుంటుందని వివరించారు. భారత ఆర్మీ చాలా పటిష్టంగా పనిచేస్తోందని, దేశ సరిహద్దుల్లోనూ, అంతర్గత భద్రతను పరిశీలించడం ఎంతో అవసరమన్నారు. దేశమే ప్రథమం అనే భావన ప్రతీ వ్యక్తిలో కలిగించే ప్రయత్నం జరగాలన్నారు. గతంలో అమెరికా, ఫ్రాన్స్ దేశాలపై జరిగిన ఉగ్రదాడుల సమయంలో అక్కడ ప్రజలు చూపిన దేశభక్తి సంఘటనలను ఆయన ఉదహరించారు. మన దేశంలో జాతీయ గీతాన్ని ఆలపించడానికి న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన అవసరం లేదని, ఎప్పుడైనా, ఎక్కడైనా జాతీయ గీతాన్ని ఆలపించాలన్నారు. జాతీయ గీతాన్ని, జెండాను గౌరవించడం, దేశం కోసం త్యాగాలు చేయడానికి సిద్ధం కావడం ఎంతో అవసరమన్నారు. భారతీయ సైనికులు దేనికీ తక్కువ కాదని అయితే యుద్ధ తంత్రంలో ఎంతో మార్పువచ్చిందన్నారు. నాలుగేళ్ళకాలంలో రాజకీయ నాయకుల ఆలోచనల్లో సైతం ఎంతో మార్పు వచ్చిందన్నారు. ఢోక్లాం సంఘటనలో మన నాయకత్వం చైనాకు మంచి సందేశాన్ని అందించిందన్నారు. త్రివిధ దళాలు సమన్వయం చేసకుంటూ ఐక్యంగా సాగాలన్నారు. యుద్ధ సమయంలో హార్డ్‌వేర్‌తో పాటు సాఫ్ట్‌వేర్ కీలకంగా మారుతోందన్నారు. వీటిని అభివృద్ధి చేసుకోవడానికి పెట్టుబడి, పరిశోధన, నిబద్ధత ఎంతో అవసరమని గవర్నర్ వివరించారు.

మట్టి, నీళ్లు ఇచ్చి మోసం

- ఎన్టీఆర్ గురించి మాట్లాడే హక్కు మోడీకి లేదు
- నిడదవోలు జన్మభూమిలో చంద్రబాబు విమర్శ



సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణ శంకుస్థాపనకు వచ్చి మట్టి, నీళు ఇచ్చి మోసం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 'అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ గుజరాత్‌ని మించిపోతుందనే భయంతో మనల్ని అణగదొక్కాలనుకుంటున్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా కాలయాపన చేశారు. మూడు సార్లు ఆయనపై అవిశ్వాస తీర్మానం పెట్టి ఒత్తిడి తెచ్చినందుకే ఆయనకు కోపం వచ్చింది. నేను ఎన్టీఆర్‌ను మోసం చేశానని అంటున్నారు. అసలు ఆయనకు ఎన్టీఆర్ గురించి మాట్లాడే హక్కు లేదు" అని చంద్రబాబు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలులో సోమవారం జరిగిన జన్మభూమి-మాఊరు గ్రామ సభలో ఆయన ప్రసంగించారు. తనపై, తన కుటుంబంపై ప్రధాని నరేంద్ర మోడి చేసిన వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా మండిపడ్డారు. తనపై అక్కసుతోనే మోడీ విమర్శలు చేస్తున్నారన్నారని ఆవేశంగా అన్నారు. నోట్ల రద్దు తుగ్లక్ చర్యగా పేర్కొన్నారు. రెండు వేల నోట్లు తీసుకొచ్చి టన్నుల కొద్ది డబ్బును ఎన్నికల్లో ఖర్చుచేశాంన్నారు. విభజించు, పాలించు పాలనను మోడీ అమలు చేస్తున్నా రన్నారు. కేసీఆర్‌పై ఒక కేసు ఉంటే ఆధారాలు లేవని కొట్టేయించిన వ్యక్తి మోడీ అని అన్నారు. జగన్‌పై ఉన్న రూ.43వేల కోట్ల అవినీతి కేసును నీరుగారుస్తున్నార న్నారు. తన కుమారుడు లోకేష్ చదువు తరువాత వ్యక్తిగత అభిప్రాయాల మేరకు రాజకీయాల్లోకి వచ్చార న్నారు. దీనిని కూడా విమర్శించి తమ కుటుంబాన్ని కూడా మోడీ రోడ్డు మీదకు తీసుకొస్తున్నారన్నారు. ప్రధాని కావాలనుకుంటే ఎప్పుడో అయ్యేవాడినని, ఆ కోరిక తనకు లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు మే నెలకు పూర్తి చేసి గ్రావిటీ ద్వారా నీరు ఇస్తామని, డిసెంబరు నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు పనుల్లో ఎవరూ చేయలేని పనిని ఒక్క రోజులో మనం 32వేల క్యూబిక్ పని చేశామన్నారు. రాష్ట్రంలో 2022 నాటికి అందరికి సొంత ఇల్లు సమకూర్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. సొంత ఇంట్లో వుండాలనే ప్రజల కలను నిజంచేస్తామ న్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 83వేల కోట్ల రూపాయలతో 30 లక్షల ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు. 2022నాటికి ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు నిర్మించే బాధ్యత తానే తీసుకొంటానన్నారు. ఏప్రిల్ నుంచి ఎన్టీఆర్ వైద్య సేవల పరిమితిని 5లక్షలకు పెంచబోతున్నామన్నారు. అన్ని పార్టీలను కలుపుకొంటేనే తప్ప రాష్ట్రానికి న్యాయం జరగదన్నారు. జగన్ పార్టీ కోడి కత్తి పార్టీ అని ఆయన పేర్కొన్నారు. తాను ఏనాడూ హత్యా రాజకీయాలు చేయలేదని స్పష్టం చేశారు. కేసీఆర్, జగన్, మోడీ రాష్ట్రం అభివృద్ధి కాకుండా అడ్డుకుంటున్నారన్నారు. తనపై రాజశేఖరరెడ్డి 26 ఎంక్వైరీలు వేస్తే ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. అనంతరం పశ్చిమగోదావరి జిల్లా హెల్త్ బులిటెన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన్మభూమి ప్రతిజ్ఞను ప్రజలు, అధికారులతో చేయించారు. అనంతరం పలువురికి ఎన్టీఆర్ గృహాలు మంజూరు పత్రాలు, చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ మాగంటి మురళీ మోహన్, రాష్ట్ర మంత్రులు పితాని సత్యనారాయణ, కెఎస్ జవహర్, జెడ్‌పి ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మున్సిపల్ ఛైర్మన్ బొబ్బా కృష్ణమూర్తి, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పాలి ప్రసాద్, ఎమ్మెల్సీ రాము సూర్యారావు, జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్, జన్మభూమి కమిటీ స్పెషల్ ఆఫీసర్ ఉదయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల భారీ ధర్నా

విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్): బ్యాంకు పెన్షనర్లు, బ్యాంకు విశ్రాంతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ ధర్నా చౌక్ వద్ద సోమవారం పెన్షనర్లు, విశ్రాంత ఉద్యోగులు పెద్దఎత్తున తరలి వచ్చి నిరసన తెలిపారు. కో ఆర్డినేషన్ ఆఫ్ బ్యాంకు పెన్షనర్సు అండ్ రిటైరీస్ అర్గనైజేషన్(సీబీపీఆర్‌ఓ), ఆల్ ఇండియా బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ (ఏఐబీఆర్‌ఎఫ్) దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు ఈ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.ఎల్లారావు,స్టేట్ బ్యాంకు పెన్షనర్స్ అసోసియేషన్ ప్రాంతీయ కార్యదర్శి వీవీఎన్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ, రిజర్వు బ్యాంకు విశ్రాంత ఉద్యోగులతో సమానంగా కుటుంబ పించన్ పెంచాలని డిమాండు చేశారు. 2002కు ముందు పదవీ విరమణ చేసిన ఉద్యోగులందరికి నూరు శాతం కరవు భత్యం ఇవ్వాలన్నారు. భారతీయ స్టేట్ బ్యాంకు విశ్రాత ఉద్యోగులందరికి పదవి విరమణ చేసిన నెలలోని మూలవేతనంలో 50 శాతం పింఛన్ మూల వేతనంగా ఇవ్వాలనీ, బ్యాంకింగ్ పరిశ్రమలలోని ఇతర విశ్రాంత ఉద్యోగులకు ఇస్తున్న మాదిరిగా పెన్షన్ లెక్కించేటప్పుడు ప్రొబేషన్ కాలాన్ని పరిగణించాలన్నారు. రాజీనామ చేసిన ఉద్యోగులకు పింఛన్ ప్రయోజనాలు వర్తింపచేయాలన్నారు. తమ డిమాండ్లు అన్ని న్యాయపరమైనవనీ, బ్యాంకులపై ఎటువంటి అర్థిక భారం పడదన్నారు. ప్రస్తుతం పింఛన్ నిల్వ రూపంలో 3 లక్షల కోట్లు ఉన్నాయని అందులో 40 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారన్నారు. మిగిలిన దానిలో నుండి తమ సమస్యలు పరిష్కరించినా సరిపోతుందన్నారు. నిరసనలో రఘురామ్, పీఎల్ ప్రకాశ్, జే వెంకటరత్నం, అంజనేయశ్రాస్తి పాల్గొన్నారు.

గన్‌మెన్‌లను సరెండర్ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఆళ్లగడ్డలో తన వర్గీయుల ఇళ్లలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ చేయటాన్ని నిరసిస్తూ పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిలప్రియ నాలుగు రోజుల క్రితం గన్‌మెన్‌లను సరెండర్ చేయగా, ఆమెకు మద్దతుగా సోదరుడు, నంద్యాల ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి కూడా సోమవారం గన్‌మెన్‌లను తిప్పి పంపించేశారు. మంత్రి, ఎమ్మెల్యే గన్‌మెన్‌లను వెనక్కి పంపించటం కర్నూలు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వీరిద్దరూ గన్‌మెన్‌లు లేకుండానే ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమి మా ఊరు గ్రామ సభలకు హాజరవుతున్నారు. ప్రస్తుతం ఎన్నికలు లేకపోయినప్పటికీ, పోలీసులు తమ వర్గీయుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించటాన్ని నిరసిస్తూ ఆమె గన్‌మెన్‌లను వెనక్కి పంపించేశారు. ఆళ్లగడ్డ నియోజవర్గంలోని నల్లమలకు సమీపంలోని రుద్రవరం మావోయిస్టులకు సేఫ్‌జోన్‌గా ఉంటోంది. గతంలో మావోయిస్టులను అరెస్టు చేసిన సందర్భాలూ ఉన్నాయి. దీంతో అఖిలప్రియ గన్‌మెన్‌లను సరెండర్ చేసినా, పోలీసులు దూరంగా ఉండి రక్షణ కల్పిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న ఆళ్లగడ్డలో పోలీసులు లేనిపోని రచ్చ చేస్తున్నారని ఆమె మండిపడుతున్నారు. అకారణంగా తన వర్గీయుల ఇళ్లలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారని విమర్శిస్తున్నారు.

సంపాదకీయం

మోడీ ఎన్నికల జిమ్మిక్

సార్వత్రిక ఎన్నికలకు ఇంకా కొన్ని నెలలు మాత్రమే సమయం వుండగా మోడీ ప్రభుత్వం రిజర్వేషన్ల అస్త్రాన్ని ప్రయోగించింది. కేంద్రంలో అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లకు పైగా గడచిపోయినా ఏనాడూ రిజర్వేషన్ల గురించి గుర్తుకు రాని మోడీ ప్రభుత్వానికి ఈ రోజే అమాంతం జ్ఞానోదయం అయినట్లు కేంద్ర మంత్రివర్గం సోమవారం కీలక నిర్ణయం తీసుకొంది. విద్య, ఉద్యోగాల్లో అగ్రవర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకొంది. ఇది కేవలం ఎన్నికల జిమ్మిక్కు అని, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి వలవేయడమేనని స్పష్టంగా అర్థమవుతోంది. మోడీ ప్రభుత్వం పట్ల బడుగు, బలహీన వర్గాలు, మధ్య తరగతి ప్రజల్లో మాత్రమే గాక అగ్రవర్ణాలలోని పేదల్లో కూడా ప్రజాదరణ తగ్గిపోవడాన్ని పసిగట్టిన మోడీ రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తన అమ్ములపొదిలో నుండి జన సమ్మోహనాస్త్రాలు ఒక్కొక్కటిగా ప్రయోగిస్తున్నారు. అయితే కేంద్ర నిర్ణయం చట్ట పరమైన చిక్కులకు తావిస్తుంది. అగ్రవర్ణాలలోని పేదలకు రిజర్వేషన్లు కల్పించడానికి రాజ్యాంగాన్ని సవరించవలసిన అవసరం వుంది. రాజ్యాంగ సవరణ బిల్లును మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం వుంది. మంగళవారంతో ముగియనున్న పార్లమెంటు శీతాకాల సమావేశాలను ఈ బిల్లుకోసం మరో రెండు రోజులు పొడిగించవచ్చునని భావిస్తున్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండు వంతుల మంది సభ్యులు అనుకూలంగా ఓటు వేయవలసి వుంటుంది. లోక్‌సభలో బీజేపీ, దాని మిత్రపక్షాలకు తగినంత బలమున్నందున బిల్లు ఆమోదానికి యిబ్బంది ఏమీ వుండదు. రాజ్యసభలో ఆమోదానికి తగిన సమయం కూడా లేదు. ఈ విషయం తెలిసే కేంద్రం ఈ రిజర్వేషన్ల నిర్ణయం చేయడంలోనే దాని అవకాశవాద వైఖరి అర్థమవుతోంది. రాజ్యసభలో మోడీ ప్రభుత్వానికి తగిన సంఖ్యాబలం లేనందున రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి నోచుకోకపోవచ్చు. దీన్ని సాకుగా చేసుకొని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాలపై విమర్శనాస్త్రాలు సంధించాలన్నదే మోడీ ప్రభుత్వ పథకంగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అత్యంత ప్రధానమైన రిజర్వేషన్ల అంశాన్ని మోడీ ప్రభుత్వం సంకుచిత అభిప్రాయంతో, రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఆఖరి ఘట్టంలో తీసుకున్న నిర్ణయంగానే భావించాలి. అగ్రవర్ణాలలోని ఆర్థికంగా వెనుకబడిన పేద వర్గాలకు నిజంగా విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలన్న చిత్తశుద్ధి మోడీ ప్రభుత్వానికి వుండి వున్నట్లయితే, పార్లమెంటులో ఈ అంశాన్ని ప్రతిపాదించి, ఇంతకు ముందే చర్చల ద్వారా ఏకాభిప్రాయాన్ని సాధించడానికి ప్రయత్నం చేసి వుండేది. అలాగే అనేక రాష్ట్రాల్లో వివిధ వర్గాల వారు రిజర్వేషన్ల కోసం ఆందోళనలు చేపడుతున్న దృష్ట్యా, రిజర్వేషన్ల కల్పనపై ఒక నిర్ణయం తీసుకోకముందే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు కూడా జరపవలసిన అవసరం వుంది. అలా చేయకుండా మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడంవల్ల వివిధ రాష్ట్రాల్లోని ప్రజల మధ్య విభజన తీసుకొచ్చి, ఘర్షణ వాతావరణానికి తెరతీసినట్లయింది. ఒక వ్యక్తికి వార్షికాదాయం రూ. 8 లక్షలకన్నా తక్కువ, సొంత వ్యవసాయ భూమి ఐదు ఎకరాలకంటే తక్కువ విస్తీర్ణంలో ఇల్లు, నోటిఫైడ్ పురపాలక పరిధిలో 209 గజాల కంటే తక్కువ, వెయ్యి చదరపు అడుగుల కంటే తక్కువ స్థలం ఉన్న వారిని ఆర్థికంగా వెనుకబడిన వారిగా (ఈబీసీలు) పరిగణిస్తారని, వీరికి రిజర్వేషన్ వర్తించే అవకాశం వున్నట్లు సమాచారం. ఇప్పటి వరకూ రిజర్వేషన్ వల్ల ఎలాంటి ప్రయోజనం పొందని ఈబీసీలకు ఈ రిజర్వేషన్లు లభిస్తాయని భావిస్తున్నారు. కుల ఆధారిత రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని గతంలో సుప్రీంకోర్టు వెల్లడించింది. ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటు ఆమోదిస్తే కోటా 50 శాతం మించిపోతుంది. కేంద్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయం అమలుకు నోచుకోవాలంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16లకు సవరణలు చేయవలసి వుంటుంది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని సుప్రీం కోర్టు తీర్పు యిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం కొత్తగా రిజర్వేషన్లు కల్పించడం సమస్యలను సృష్టిస్తుంది. బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో 1932 రామ్‌సే మెక్ డొనాల్డ్ సిక్కులు, ఆంగ్లో-ఇండియన్లు, ముస్లింలు, దళితులు, క్రైస్తవులకు మౌలికంగా ప్రత్యేక నియోజక వర్గాల సాధికార నిర్ణయ భావనను ప్రవేశపెట్టారు. ప్రత్యేక నియోజక వర్గాల ఏర్పాటుతో వారు ఎన్నికల్లో పోటీచేసి, విజయం సాధించడం ద్వారా వారి కులాలు, సముదాయాల అభివృద్ధికి కృషి చేస్తారన్నది మెక్ డొనాల్డ్ భావన. ఈ భావనను దళిత జనోద్ధారకుడు డా॥ బి.ఆర్. అంబేద్కర్ స్వాగతించారు. కానీ మహాత్మా గాంధీ దీన్ని వ్యతిరేకించారు. ఆ విధంగా చేయడం వలన హిందూ సమాజంలో కలతలు రేపుతుందని గాంధీ అభిప్రాయపడ్డారు. దీనికి వ్యతిరేకంగా పూణేలోని ఎరవాడ జైల్లో ఆయన దీక్ష చేశారు. అంతిమంగా, దళితులకు (హిందూ కులవ్యవస్థలో) ప్రత్యేక నియోజక వర్గాలకు హామీ కల్పించే పూనా ఒడంబడికపై అంబేద్కర్ సంతకం చేశారు. స్వాతంత్ర్యం సాధించిన అనంతరం భారత జాతీయ కాంగ్రెస్ దళితుల గణనను చేపట్టింది. దళితులు, గిరిజనుల వంటి సామాజికంగా, ఆర్థికంగా, విద్యా పరంగా వెనుకబడిన వర్గాలను సామాజిక, విద్య, ఆర్థికపరంగా ఆదుకోవడం ప్రభుత్వ విధిగా పేర్కొంటూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16, 46 రూపొందించబడ్డాయి. ఇది రిజర్వేషన్ల చారిత్రక నేపథ్యం. ఆ తర్వాత రాష్ట్రాలలోని పరిస్థితులను బట్టి కొన్ని కులాలకు రిజర్వేషన్లు కల్పించారు. వీపీసింగ్ ప్రధానమంత్రిగా వున్న సమయంలో మండల్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించారు. అగ్రవర్ణాలలోని వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని వామపక్షలు ఎప్పట్నుండో డిమాండు చేస్తున్నాయి. ఎట్టకేలకు ఇందుకు సంబంధించి కేంద్రం నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామమే అయినప్పటికీ, నిర్ణయం తీసుకొన్న "టైమింగ్" అనుమానాలకు తావిచ్చేదిగా, ఆందోళనలకు ఆస్కారం కల్పించేదిగా, ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని లబ్ధిపొందేందుకు తీసుకున్నదిగానే భావించక తప్పదు.

చురక

రాఫెల్ విమానాల్లో
రగిలిపోయె అవినీతి
పార్లమెంటు ప్రాంగణంలో
ప్రతిధ్వనించే దాని ఖ్యాతి

బీజేపీ కాంగ్రేసుల
పరస్పర ఆరోపణ
పరువు దీస్తు దాక్కున్నది
పరిష్కార నిరూపణ

- వేల్పుల నారాయణ



సౌర వనాలు.. ప్రగతి ఫలాలు

జి. మురళి

విద్యుత్‌రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఒకప్పుడు విద్యుత్ రంగంలో చీకట్లు ఉండేవి.. ప్రస్తుతం మిగులు విద్యుత్ సాధ్యమైంది. ఫలితంగా ఇంధన రంగంలో దేశంలోనే అగ్రగ్రామిగా ఏపీ నిలిచింది ఏపీ. 2014 సెప్టెంబరులో అనంతపురం సౌర పార్కు నిర్మాణంపై జాతీయ థర్మల్ పవర్ కార్పొరేషన్‌తో అవగాహన ఒప్పందం కుదిరింది. అలా మొదలైన సౌర పార్కుల ప్రస్థానం భారీగా విస్తరించింది. నాలుగు వేల మెగావాట్ల పార్కులకు బీజం పడింది.

పునరుత్పాదక ఇంధన వనరులు

ముఖ్యంగా సౌర రంగంపై ప్రపంచమంతా దృష్టి సారిస్తోంది. ఈ రంగంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సౌర విద్యుత్తు ధర బొగ్గు ప్రాజెక్టుల విద్యుత్తు ధర స్థాయికి దిగివచ్చింది. ఇదే తరుణంలో సౌర విద్యుత్తును నిల్వ చేసే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. సౌర మినీగ్రిడ్‌ల ద్వారా ఎక్కడికక్కడ స్థానికంగానే విద్యుత్తు అందించాలనేది ఆశయం.

సౌర పంపుసెట్ల పంపిణీ:

రాష్ట్రంలో సుమారు 14 వేల సౌర పంపుసెట్లను రైతులకు ఇచ్చారు. కేంద్రం ఇచ్చే రాయితీకి తోడు విద్యుత్ పంపిణీ సంస్థలు కొంత మొత్తాన్ని భరిస్తున్నాయి. రూ.55 వేలు రైతు చెల్లిస్తే సరిపోతుంది. రాష్ట్రంలో లక్ష పంపుసెట్లకు సౌర విద్యుత్ కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రచించింది. ఒక మెగావాట్ సౌర విద్యుత్ యూనిట్ నిర్మాణానికి సుమారు ఐదెకరాల భూమి కావాలి. భూసేకరణ అత్యంత ఇబ్బందికరమైన అంశం. ఈ ఇబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం చాలా వరకు అధిగమించింది. దాదాపు 27 వేల ఎకరాల సేకరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో కొద్దిగా మినహా సేకరణ కూడా పూర్తయింది. ప్రపంచవ్యాప్తంగా సౌర ఫలకాల ధర తగ్గడం వరమైంది. ఉత్పత్తి దారుల్లో పోటీ పెరిగి సౌర విద్యుత్ ధర తగ్గింది. తద్వారా దాన్ని ఉపయోగించుకోవడం సులువయింది. సౌర విద్యుత్ స్థాపక సామర్థ్యంలో దూకుడు ప్రదర్శించినందున ప్రస్తుత సంవత్సరంలో ఆర్‌పీవోను చేరుకోవడం ఇబ్బంది కాకపోవచ్చు. దేశస్థాపక సామర్థ్యం ప్రస్తుతం 12 వేల మెగావాట్లకు పైగా చేరుకుంది. గత జనవరిలో ఇది 9,235 మెగావాట్లే. ఈవిషయంలో దేశంలో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగంలో నిలిచింది. తమిళనాడు, తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాలు దీనికి పెద్ద పీట వేస్తున్నాయి.

సౌర పార్కులకు భూసేకరణ తీరు

రాష్ట్రంలో సౌర పార్కుల సాకారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆంధ్రప్రదేశ్ సౌర విద్యుత్ సంస్థను నెలకొల్పాయి. దీని ద్వారానే భూసేకరణ, 'పార్కుల' అభివృద్ధి జరుగుతోంది. రాష్ట్రంలో ఇళ్ల పైకప్పు సౌర విద్యుత్ స్థాపక సామర్థ్యం 15 మెగా వాట్లకు చేరుకుంది. ఈ విద్యుత్‌ను వాడుకోడానికి రాష్ట్ర ప్రభుత్వం నెట్‌మీటరింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. వినియోగదారుడు తన అవసరాలకు సౌర విద్యుత్‌ను వాడుకోవచ్చు. మిగిలితే విద్యుత్ సంస్థలకు విక్రయించవచ్చు. సోలార్ రూఫ్‌టాప్ ధరలు కూడా గణనీయంగా తగ్గాయి. కర్నూలు సౌర పార్కు ఒక రకంగా దేశాన్ని మలుపుతిప్పింది. ధరల తగ్గుదలకు నాంది పలికింది. సౌరఫలకాల ధర తగ్గడం ఒక ఎత్తయితే భూమి సిద్ధంగా ఉండడం వల్ల వెంటనే ప్రాజెక్టులను నెలకొల్పే అవకాశమూ కలిగింది. తద్వారా పెట్టిన పెట్టుబడికి వెంటనే ఆదాయం వచ్చింది.

సౌర, పవన ప్రాజెక్టులు రాయలసీమలోనే ప్రధానంగా కేంద్రీకృతమయ్యాయి. సాగు భూమి తక్కువగా ఉండటంతో ఇది సాధ్యమైంది.

పుష్కలంగా ఇంధన వనరులు:

ఆంధ్రప్రదేశ్‌లో పుష్కలంగా ఇంధన వనరులు ఉన్నాయి. అతి తక్కువ ధరకే సౌర విద్యుత్ అందుతుంది. ఒకప్పుడు యూనిట్ సోలార్ విద్యుత్ ధర రూ.14 ఉండేది, ఇప్పుడు నాలుగు రూపాయిలకే లభిస్తోంది. దీనిని రూపాయిన్నరకే ఇచ్చే రోజులు త్వరలోనే రానున్నాయి. ఎనర్జీ సేవింగ్ పరికరాల తయారీలో ముందుంటే ఏపీకి తిరుగుండదు. 4,059 మెగావాట్ల పవన విద్యుత్, 2,591 మెగావాట్ల సౌర విద్యుత్‌తో కలిపి 7,464 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏపీ చేరుకుంది. 2014లో యూనిట్ కు రూ.6.49గా ఉన్న సౌర విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని ప్రస్తుతం రూ.2.70కు తగ్గింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 31,725 సౌర విద్యుత్ పంపుసెట్లను అమర్చారు.

అనంతపురం, కడప, కర్నూలులో మొత్తం కలిపి 4000 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ పార్కులను ఏర్పాటు చేశారు. అందులో ఇప్పటికే 1850 మెగావాట్లు అందుబాటులోకి వచ్చాయి. కర్నూలు సోలార్ పార్కు ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ పార్కు ఇక్కడ 1000 మెగావాట్లు అందుబాటులోకి వచ్చాయి.

తక్షణ తలాక్ బిల్లు రాజ్యాంగ విరుద్ధ చర్య



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

"రాజకీయం కాదు, మానవత్వం కోసం చరిత్ర సృష్టించబోతున్నాం" 28-12-17న 'ముస్లిం మహిళల వివాహ హక్కుల రక్షణ బిల్లు, 2017' లోక్‌సభలో ప్రవేశపెడుతూ న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్. రాజ్యసభ ఆమోదించని ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యవసర మైంది. 3 నెలలు ఆగలేక సెప్టెంబర్ '18లో ఆర్డినెన్స్ జారీ చేసింది. 27-12-18న సవరణ బిల్లును రాజకీయంతో కాదు, మానవత్వంతో చూడమన్నారు ప్రసాద్. ఆయన వ్యాఖ్య విరోధాభాసం. బిల్లే రాజకీయం. మానవత్వరహితం. ఈ బిల్లు అనవసరం. రాజ్యాంగ విరుద్ధం.

జూన్ '2016లో సంఘీయ 'రాష్ట్రవాది ముస్లిం మహిళా సంఘ్' ముస్లిం వ్యక్తిగత చట్టం, షరియత్‌ను చట్టబద్ధీకరించమని సుప్రీంకోర్టును కోరింది. ముస్లిం స్త్రీల సామాజిక, ఆర్థిక స్థితి విషాదమని మోడీ సర్కారు కోర్టుకు అఫిడవిట్ ఇచ్చింది. ఈ ప్రచారంతోనే యు.పి. ఎన్నికల్లో ముస్లిం మహిళల ఓట్లు సంపాదించారు. దీన్ని చట్టంచేస్తే లాభమని దురాశించింది. ఫలితమే ఈ "మానవత్వ" బిల్లు. షమీమ్ అరా వర్సెస్ యు.పి. ప్రభుత్వం కేసులో తక్షణ తలాక్ చెల్లదని 2002లో సుప్రీంకోర్టు తీర్పిచ్చింది. షాయరా బానో వర్సెస్ భారత ప్రభుత్వం కేసులో ముమ్మాటి తలాక్ రాజ్యాంగబద్ధం కాదని 22-08-17న అదే కోర్టు కొట్టేసింది. 'షరియత్ అనువర్తన చట్టం, 1937' ప్రకారం ముస్లిం మగళ్ళు భార్యలకు ఏకపక్ష విడాకులివ్వచ్చు. ముస్లిం మహిళ విడాకులివ్వాలంటే 'ముస్లిం వివాహ రద్దు చట్టం, 1939' ప్రకారం కోర్టుకు దరఖాస్తు చేసుకోవాలి. ఈ చట్టాలను రాజ్యాంగ నిబంధన 14 పరిధిలో సవరించి, ముస్లిం మగాళ్ళ విడాకుల మార్గదర్శక చట్టం చేస్తామని అటార్నీ జనరల్ ఆగస్టు'17లో సుప్రీంకోర్టుకు తెలిపారు. జాతిమత కులలింగస్థలాలతో చట్ట సమానత్వాన్ని, సమాన చట్టరక్షణను రాజ్యం ఎవరికీ నిరాకరించరాదని నిబంధన 14 చెప్పింది. 2017 బిల్లు, తక్షణ తలాక్‌ను వారంట్ అక్కరలేని, బెయిల్ అవకాశంలేని క్రిమినల్ నేరంగా పరిగణించి, మూడేళ్ళ జైలు, జరిమానా విధించింది. కోర్టుకిచ్చిన హామీని తుంగలో తొక్కింది. ముస్లిం మహిళలకే రక్షణ. ముస్లిం మగళ్ళకే శిక్ష. ఇతర బాధిత మహిళల రక్షణ లేదు. ఇతర నేరపురుషులకు శిక్ష లేదు. ఇది రాజ్యాంగ నిబంధన 14 ఉల్లంఘన. ముస్లిం వివాహం సామాజిక ఒప్పందమే. పరస్పర ఆమోదంతో విడాకులు తీసుకోవచ్చు. మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చు. ముస్లిం వివాహ రద్దు పౌర నేరం. ఒప్పంద తప్పిదంగా సుప్రీంకోర్టు గుర్తించిన విడాకుల లోపాన్ని సరిచేయాలి కాని క్రిమినల్ నేరంగా శిక్షించరాదు.

ఈ చట్టంతో తలాక్ రద్దు కాదు. తక్షణ తలాక్‌పై చర్యలుంటాయి. చట్ట అమలు బాధ్యత కోర్టుకు కాకుండా పోలీసులకు అప్పజెప్పారు. దేశంలో 60% పోలీసులు సంఘ్ కార్యకర్తలని ఒక సంఘ్ నాయకుడన్నాడు. పుకార్లతోనే హత్యలు చేసే సంఘ్ సభ్యులు, సంఘ్‌తో మమేకమైన పోలీసులు ఏమైనా చేస్తారు. మతకక్ష తీర్చుకోవచ్చు. ముస్లిం మగాళ్ళపై సంఘ్ కత్రలు నర్తిస్తాయి. బిల్లులో క్రిమినాలిటీయే సమస్యని నాటి విదేశాంగ సహాయమంత్రి ఎమ్.జె. అక్బర్ బాధ. ఈ చట్టం బాధిత భార్యల కష్టాలు తొలగించదు పెంచుతుంది. విడాకులిస్తానన్న భర్త జీవనభృతి చెల్లించాలి. జైలుకెళ్ళిన భర్త భృతి ఎలా చెల్లిస్తాడు? బిల్లులో తాత్కాలిక సహాయ ప్రస్తావన లేదు. పరిహారం అందేవరకు బాధితురాలు ఎలా బతకాలి? బిల్లులో ప్రస్తావించిన జీవనభృతి 'ముస్లిం మహిళల విడాకుల హక్కుల రక్షణ చట్టం, 1986' ప్రకారం చెల్లించే భృతికి అదనమా అన్న వివరణ లేదు. ముస్లిం వివాహ రద్దు చట్టం, 1939 సెక్షన్ 2(3) ప్రకారం భర్తకు ఏడేళ్ళ జైలు పడితేనే ముస్లిం భార్య విడాకులకు అర్హురాలు. బిల్లులోని మూడేళ్ళ జైలుతో విడాకుల అర్హత రాదు. విడాకులు రానిదే మారుపెళ్ళి కుదరదు. బహుభార్యత్వం, నికాహ్ హలాలా వంటి ముస్లిం మహిళలను వేధించే సామాజిక దుశ్చర్యల నివారణ బిల్లులో లేదు. పూర్వ భర్తను మళ్ళీ పెళ్ళిచేసుకోవాలంటే ముస్లిం మహిళ మరొకరిని పెళ్ళాడి అతనితో దాంపత్య జీవితం గడపాలన్న నియమమే నికాహ్ హలాలా. దీనికి మహిళల సమ్మతి లేదు. దీనికీ భారీ రుసుం అద్దె మొగుళ్ళు తయారయ్యారు. 2018 సవరణ బిల్లు భార్య వాదన విన్న తర్వాతే బెయిలు నిర్ణయించే అధికారాన్ని మేజిస్ట్రేటుకు ఇచ్చింది. రాజీకి అవకాశమిచ్చింది. భార్య లేదా ఆమె సన్నిహిత బంధువులే ఫిర్యాదు చేయాలన్నది.

తలాక్‌తో, మతాలతో సంబంధం లేకుండా ముస్లిం స్త్రీలకు రక్షణ ఉంది. మహిళలందరికీ గృహహింస నిరోధక చట్టం, 2005, భారత శిక్షాస్మృతి 498(ఎ) అధికరణ వర్తిస్తాయి. సి.పి.సి.125 ప్రకారం భర్త, భార్యాపిల్లలకు జీవనభృతి చెల్లించాలి. ముస్లిం స్త్రీలకు 'ముస్లిం మహిళల చట్టం' రక్షణ కల్పిస్తుంది. 2011 జనాభా లెక్కల్లో వివాహ బంధంలో ఉన్న మహిళల్లో ముస్లింలు-87.8%, హిందువులు- 86.2%, క్రైస్తవులు-83.7%, ఇతరులు-85.8%. వివాహబంధంలో ఎక్కువ ముస్లిం మహిళలే ఉన్నారు. పునర్వివాహసౌకర్యం కారణం కావచ్చు. వితంతువుల్లో ముస్లింలు 11.1%, హిందువులు 12.9%, క్రైస్తవులు 14.6%, ఇతరులు 13.3%. హిందూ వితంతువులే అతి బాధితులు. విడాకులు ఇవ్వకుండా వదిలేయబడిన మహిళల్లో హిందువులు- 0.69%, ముస్లింలు-0.67%, క్రైస్తవులు-1.19%, ఇతరులు-0.68%. వీళ్ళూ హిందువులే ఎక్కువ. దేశంలో అనాథ మహిళల సంఖ్య 24.5 లక్షలు. వీరిలో హిందువులు 20 లక్షలు. ముస్లింలు 2.80 లక్షలు, క్రైస్తవులు 90 వేలు, ఇతరులు 80 వేలు. హిందు అనాథ మహిళలు హరిద్వార్, మథుర, వృందావన్, వారణాసిలలో బతుకులీడిస్తున్నారు. లైంగికదాడితో సహా పలు దోపిడీలకు గురవుతున్నారు. మెట్టినింట్లోనో, పుట్టినింట్లోనో ఉన్నవారు పనిమనుషుల్లా బతుకుతున్నారు. దేశంలో 4.30 కోట్ల వితంతువులున్నారు. వారిలో 10 లక్షలు ప్రభుత్వ సాయంకోసం ఎదురుచూస్తున్నారు. పేద, ధనిక, కులమత భేదాలు లేకుండా భర్తకు దూరమైన మహిళ జీవితం దయనీయమే. 44 ఏళ్ళ క్రితం వదిలేయబడ్డ జశోదా బెన్ మోడీ పిలిస్తే ఆయన దగ్గరకెళతానన్నారు. ఆయన పిలవలేదు. ఇందరు ఏకవనితలు ఏడుస్తోంటే ఎప్పుడో బాధపడబోయే ముస్లిం మహిళలే మోడీకి ఎందుకు కన్పించారు? మహిళలందరికీ న్యాయం చేయాలి కదా. తలాక్ ఖురాన్ సమ్మతమే. ముమ్మాటి తలాక్ కాదు. సున్నీలోని 3 సంప్రదాయాల్లో తక్షణ తలాక్ చెల్లుబాటు కాదు. నాల్గవ సంప్రదాయం దేవ్‌బంద్‌లోనే ఇది అమల్లో ఉంది. భారత ముస్లింలలో తక్షణ తలాక్ పాటించేవారి లెక్కలు ప్రభుత్వం దగ్గర లేవు. తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. ఒక స్వచ్ఛంద సంస్థ సర్వేలో 1% కంటే తక్కువ ఈ పద్ధతిలో విడాకులిచ్చారని తేలింది. ఇంత తక్కువమంది కోసం, సుప్రీంకోర్టు రెండుసార్లు రద్దు చేసిన తక్షణ తలాక్‌పై హామీ తప్పిన బిల్లు అవసరమా?

రాజ్యాంగ నిబంధన 25(2) ప్రకారం ఆర్థిక, రాజకీయ ప్రగతికి మత అంశాల చట్టాలూ చేయవచ్చు. తక్షణ తలాక్ బదులు ముస్లిం మహిళల ఆస్తి, వారసత్వ హక్కుల చట్టాలు చేయవచ్చు. మహిళా రిజర్వేషన్ చట్టంతో మహిళలందరికీ మేలు జరిగేది. సవరణ బిల్లు రాజ్యసభలో నెగ్గలేదు. ఐనా బీజేపీపై హిందూ దురభిమానం సమీకృతమైంది. ముస్లిం మహిళల సానుభూతి పారుతుంది. సర్కారు సంకర ప్రజాస్వామ్య ఆర్డినెన్స్ పొడిగించవచ్చు. పాలకపక్షం రాజకీయ లబ్ధికి మానవత్వం మరిచి రాజకీయం చేస్తోంది. లౌకికస్ఫూర్తి, సామాజిక చైతన్యం, సంస్కరణలు నేటి భారత అవసరాలు. ఈ బిల్లు రాజ్యాంగ నిబంధన 14, కోర్టు ఆదేశం, కోర్టుకిచ్చిన హామీల వక్రీకరణ. నిబంధన 25(2) నిర్వీర్యమైంది. ఇల్లాలిని ఈసడించి పక్కింటి మగనాలికి భార్య చీరలిచ్చిన మృగ దురుద్దేశం ఈ బిల్లు. తాటిచెట్టు ఎక్కింది దూడగడ్డికన్నట్లు అనవసర రాజ్యాంగవిరోధ చర్య ఇది.

వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం
జాతీయ కార్యదర్శి, సెల్ : 9490204545

మోడీ ప్రభుత్వంపై

కార్మిక వర్గం సమర శంఖం



ఉజ్జిని రత్నాకర్ రావు

జాతీయ స్థాయిలో పది కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, వివిధ ఉద్యోగ, కార్మిక అసోసియేషన్లు కేంద్రంలో మోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై దేశ వ్యాప్తంగా నేడు, రేపు సార్వత్రిక సమ్మె జరపాలని కార్మిక వర్గానికి పిలుపు నిచ్చింది. ఇదివరకే దేశవ్యాపితంగా కార్మిక సంఘాల నాయకత్వాన కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై 2015-2016 సం॥లలో దేశవ్యాపిత సమ్మెలు, 2017 నవంబర్ 9,10,11 తేదీలలో లక్షలాది మంది కార్మికులతో పార్లమెంట్ స్ట్రీట్ ఢిల్లీలో మహాపడావ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

నరేంద్రమోడీ ప్రభుత్వం గత నాలుగున్నర ఏండ్లుగా ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను దూకుడుగా కొనసాగిస్తున్నది. కార్మికుల, రైతుల, వ్యవసాయ కూలీల సామాజిక తరగతుల బతుకులను దిగజార్చుతున్నది. బీజేపీ విధానాల వల్ల సంపన్నుల ఆస్తులు అనేక రెట్లు పెరిగాయి. 73% సంపద 1 శాతంగా ఉన్న ధనవంతుల వద్ద కేంద్రీకృతమైంది. అందువల్లనే దేశంలో నిరుద్యోగం, కనీస వేతనాలు, గిట్టుబాటు ధరలు, దారిద్ర్యం, వలసలు తదితర సమస్యలు పరిష్కారం కావటం లేదు. కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల నిత్యవసర ధరలు పెరిగిపోయి, కార్మికుల జీవన ప్రమాణాలు దిగజారుతున్నాయి. రైతాంగానికి గిట్టుబాటు ధర ప్రభుత్వ రుణ వసతి, నాణ్యమైన ఎరువులు, విత్తనాల సరఫరా లేకపోవటంతో ఆత్మ హత్యలు పెరిగాయి. రైతుల పరిస్థితే ఇట్లుంటే అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోట్లాది మంది కార్మికుల పరిస్థితి మరీ దారుణం.

కార్పొరేట్ శక్తుల చేతుల్లో కార్మికుల్ని బానిసలుగా చేసే కుట్రలో భాగంగా కార్మిక చట్టాల నిర్వీర్యానికి మోడీ సర్కార్ కార్మికవర్గం అనేక త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా సవరించి యాజమాన్యాలకు అనుకూలంగా, కార్మికులకు నష్టం జరిగే రీతిలో సవరణకు పూనుకున్నారు. 8 గంటల పని విధానానికి తూట్లు పొడిచి పొడిగించే యత్నాన్ని తీవ్రతరం చేసింది. మేక్ ఇన్ ఇండియా నినాదాలతో హైర్ & ఫైర్ (వాడుకుని వదిలేసే) పద్ధతిలో శ్రమజీవులను బానిసలుగా మార్చే నిర్ణయాలు చేస్తున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఉద్యోగుల భవిష్య నిధి, ఇయస్ఐ, మొదలైన వాటిని సంక్షేమ కోర్టు ద్వారా విచ్ఛిన్నం చేయటానికి ప్రభుత్వాలు కుట్రపన్నుతున్నది. సాంఘీక సంక్షేమ నిధికి కార్మికులు కూడబెట్టిన 24 కోట్ల రూపాయలను షేర్ మార్కెట్ వ్యాపారానికి మళ్ళించటానికి ప్రయత్నం ఉద్దేశపూర్వకంగా మోసపూరితంగా ఈ పథకాలను ఒకే త్రాటి పైకి తేవాలని ప్రయత్నిస్తుంది. కార్మికుల కనీస హక్కులను, రక్షణలను, సంక్షేమ పథకాలను అమలు పర్చలేని దర్భర పరిస్థితులను సృష్టిస్తుంది. పర్మినెంట్ ఉద్యోగి వ్యవస్థకు తిలోదకాలు ఇస్తూ కార్మికులను వాడుకొని వదిలేసే పూర్తి దుర్మార్గ చర్యకు పూనుకుంటుంది. మరోవైపు నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ చట్టానికి తూట్లు పొడిచింది. రైతాంగం తీవ్ర సంక్షోభంలోనికి కూరుకుపోయేలా చేస్తున్నది. ఇలా కార్మిక, కర్షక బాగోగులను పట్టించుకోవటం మానేసి కార్పొరేట్ సేవలో మోడీ సర్కార్ మునిగి తేలుతున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అనుసరించే ప్రజా కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకై జనవరి 8,9 తేదీలలో దేశవ్యాపితంగా ఉద్యోగ కార్మిక సంఘాలు సమ్మె పిలుపునిచ్చాయి.



1957 ఇండియన్ లేబర్ కాంగ్రెస్ (ఐఎల్‌సి) 15వ తీర్మానం, 1992 సుప్రీం కోర్టు జడ్జిమెంట్ ప్రకారం కార్మికుల కనీస వేతనం నేటి మార్కెట్ ధరల ప్రకారం నెలకు రూ.26వేలు ఇవ్వాలి. అయినప్పటికీ 7వ పే కమిషన్ సందర్భంగా నిర్ణయించిన రూ.18వేలను కనీస వేతనంగా అమలు జరపమని దేశంలోని జాతీయ కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా కోరుతున్నప్పటికీ మోడీ ప్రభుత్వం పెడచెవిన పెడుతుంది. 2016 అక్టోబర్ 26న సమాన పనికి సమాన వేతన విధానాన్ని అమలు చేయాలని సుప్రీం కోర్టు డైరెక్షన్స్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చినప్పటికీ వేతన విధానాన్ని అమలు పర్చటం లేదు. కనీస పెన్షన్ 6 వేలు అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల మూలధన వాటాల విక్రయం, విశృంఖలంగా సాగిస్తున్న ప్రైవేటీకరణ ఆపాలని, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలని, సాంఘీక భద్రతా చర్యలు, సంక్షేమ పథకాలు చేపట్టాలని నూతన పెన్షన్ స్కీం రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఫెడరేషన్లు దేశ వ్యాపితంగా ఉద్యమిస్తున్న మోడీ ప్రభుత్వం నిరాకరిస్తుంది. ప్రొ॥స్వామినాథన్ కమీషన్ సిఫార్సుకు అనుగుణంగా ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించి రైతాంగాన్ని ఆత్మహత్యల గండం నుండి గట్టెక్కించాల్సిన కేంద్ర ప్రభుత్వం దాగుడు మూతలు ఆడుతున్నది. గత ఎన్నికల ముందు సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మోడీ వాగ్దానం నెర వేరలేదు. వేలాది ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా నిరుద్యోగులను దగా చేస్తుంది. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశ తదితర స్కీంల్లో శ్రామిక మహిళల ఉద్యోగ భద్రతకు ముప్పుతెచ్చే ప్రయివేటీకరణ చర్యలను వేగవంతం చేసింది. మరో వైపు మతం, సాంప్రదాయాలు, మూఢత్వాల పేరుతో దేశ ప్రజల ఐక్యతకు చిచ్చు పెడుతుంది.

కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శించడం, కార్మికుల, ఉద్యోగుల ట్రేడ్ యూనియన్ హక్కులను ద్వైపాక్షిక, త్రైపాక్షిక ఒప్పందాలను ఉల్లంఘించడం, ఉద్యోగుల వేతనాల కొరకు జరిగే సంప్రదింపుల క్రమంలో 7వ పే కమిషన్ సిఫార్సు మేరకు సవరించాల్సిన వేతనాల విషయం పెడచెవిన పెట్టడం, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు నూతన పెన్షన్ పథకం రద్దు చేయాలని, కనీస వేతనం అమలుకు గ్యారెంటీ కోరినా ఎటువంటి హామీ లేదు.

పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు, ప్రభుత్వ నయా ఉదారవాద విధానాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశాయి. ఉద్యోగ అవకాశాలు మృగ్యం కావడం, ఉన్న ఉద్యోగాలు కోల్పోవడం, బలవంతంగా ఉద్యోగాల నుండి తొలగించడం, పరిశ్రమలను అక్రమంగా మూసి వేయడం, ప్రజా జీవితంపై తీవ్ర ప్రభావాన్ని కలిగించింది. ప్రభుత్వరంగ సంస్థలలో నూతన ఉద్యోగాల కల్పన లేకపోవడంతో పనిభారం పెరిగింది. అయినా ప్రభుత్వం ఉద్యోగాల కల్పన జరిగిందని కల్పిత కథలను ప్రచారం చేస్తుంది. ఈ నేపథ్యములో న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు ఐక్యంగా చేస్తున్న రెండు రోజుల సమ్మెకు రాష్ట్రంలోని కార్మికులు ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాలు సంపూర్ణంగా మద్దతు ప్రకటించాయి. నేడు, రేపు రాష్ట్ర వ్యాపితంగా జరుగుతున్న సమ్మె, ర్యాలీలు, ధర్నాలు, సభల్లో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని రాష్ట్ర కార్మిక సంఘాల సన్నాహక కమిటీ పిలుపునిచ్చింది.

వ్యాస రచయిత : ప్రధాన కార్యదర్శి, ఎఐటియుసి
తెలంగాణ రాష్ట్ర సమితి, సెల్ : 9490952646

వి-మెయిల్

అజ్ఞానం కన్నా హానికరం అశాస్త్రీయ విజ్ఞానం

దారి తెలియని అజ్ఞానం కన్నా దారి తప్పిన విజ్ఞానమే ఎక్కువ నష్ట పెడుతుంది. సమాజంలో అసలైన విజ్ఞానం, శాస్త్రీయ దృక్పథం పెరిగేలా కృషి జరగాలి. విద్యార్థికులు అందుకు ముందుండాలి. బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్నవాళ్లు మరింత శ్రద్ధగా ఆ పని చేయాలి. ఇప్పటికే మూఢ నమ్మకాలతో దిగజారుతున్న సమాజానికి మరిన్ని మూఢ నమ్మకాల్ని పరిచయం చేస్తూ మరింత గందరగోళ పర్చరాదు. జలంధర్ పట్టణంలో జరుగుతున్న ప్రతిష్టాత్మక భారత సైన్స్ కాంగ్రెస్ 106వ సమావేశాల్లో ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రసంగం శాస్త్రీయ స్ఫూర్తికి విరుద్ధం. ఆయన భారతంలో కౌరవుల జననానికి కారణం స్టెమ్ సెల్ పరిజ్ఞానమంటూ, అలాగే అప్పటి బాణాలు మిస్సైల్ టెక్నాలజీ అంటూ సరికొత్త థియరీలు చెప్పారు. శాస్త్రవేత్తలు, శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి ఉన్న విద్యార్థులు, ఆ సమావేశాల వైపు చూస్తున్న దేశప్రజలకు ఒక విశ్వ విద్యాలయ పెద్ద చెప్పవలసిన మాటలా ఇవి? పురాణాల్నీ, చరిత్రనీ, సంస్కృతినీ సైన్స్‌తో కలగలిపి వక్రభాష్యాలు చెప్పడంలో ఏ ప్రయోజనం వుంది? మన పూర్వీకులు గొప్ప వారని చెప్పాలనుకొంటే చెప్పగలిగిన దృష్టాంతాలు చరిత్రలో కోకొల్లలు. ఆర్యభట్ట, సుశ్రుతుడు, నలంద, తక్షశిల విద్యాలయాలు తదితర విషయాలెన్నో ఉన్నాయి. పురాణాల్లో ఉదంతాల్ని సృజనాత్మకతకి దర్పణంగా వర్ణించవచ్చు. తప్పుడు భాష్యాలు, నమ్మకాలూ కొంప ముంచుతాయి. దక్షిణ ఆఫ్రికాలో(ఎంబెకే అధ్యక్షుడుగా ఉన్న టైము) హెచ్ఐవీతో ఎయిడ్స్ రాదు అని తప్పుడుగా ప్రభుత్వం నమ్మి ఏ చర్యలూ తీసుకోకపోవడంతో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. తరువాత తప్పు దిద్దుకొన్నారనుకోండి.

సమకాలీనంగా కూడా దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు వెళ్తోంది. ఇలాంటి నేపథ్యంలో ఒక మంచి వేదికని అశాస్త్రీయ విజ్ఞాన వేదికగా మార్చడం, అదీ బాధ్యతాయుత స్థానంలో ఉండీ చెయ్యడం తప్పు. దేశంలో పరిశోధన రంగం బలపడాల్సిన అవసరం ఎంతో ఉంది. పరిశోధనలకు, నూతన ఆవిష్కరణలకు, పరిశోధనా పత్రాలకు ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే పరిస్థితిలో ప్రస్తుతం దేశం లేదు. ఆ వాతావరణం కల్పించడానికి ఎంతో కృషి జరగాల్సి ఉంది. మరోవైపు మూఢనమ్మకాలు ప్రబలి ఆర్థికంగా దేశం నష్టపోతోంది. ప్రభుత్వం కన్నా, విధాన కర్తలు కన్నా శాస్త్రీయ దృక్పథం పెంచడంలో విద్యార్థికుల పాత్ర ఎక్కువ. అవసరమనుకొంటే ప్రభుత్వాన్ని నిలదీయాలి. శాస్త్రజ్ఞానం వైపు నిలవాలి. ఇప్పటికైనా తన భాష్యం పొరపాటని వైస్ ఛాన్సలర్ ప్రకటించాలి.

- డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం

విశాలాంధ్ర
బతుకు
The Life
మంగళవారం
08 జనవరి 2019

గడ్డ కట్టిన దాల్ !

కాశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లో ప్రసిద్ధి చెందిన దాల్ లేక్ గడ్డ కట్టిన దృశ్యం ఇది. ఉష్ణోగ్రతలు జీరోకి పడిపోయిన నేపథ్యంలో దాల్ సరస్సు మంచుమయంగా మారింది.



పల్లె నుంచి ఫుట్‌బాల్ క్రీడాకారుడు...



మనం ఎలా ఎదుగుతామనేది మన ప్రతిభా సామర్థ్యాలకు సాన బెట్టుకోవడంపై ఉంటుంది. అవును..... ఈ విషయం పల్లె నుంచి ప్రముఖులుగా ఎదిగినవారిని చూస్తే అర్థమవుతుంది. ఇప్పుడు ఈ జాబితాలో మరో కుర్రోడు చేరాడు... అతనే గుండా శివప్రసాద్. పక్కా పల్లెటూరి నుంచి ప్రపంచ స్థాయి క్రీడా కారుడిగా మారాడు.





భారత క్రీడాకారులతో



మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ షీల్డ్‌తో

పల్లెటూరు వాతావరణం బహు పసందుగా ఉంటుంది. పల్లెకు పోదాం పండగ చేసుకుందాం... ఛలోఛలో...అని ఎప్పుడైనా పాడుకోవచ్చు. అంత ఆహ్లాదంగా ఉంటుంది పల్లెటూరి వాతావరణం. పచ్చని పైరుల మధ్య, స్వచ్ఛమైన మనసుల మధ్య ఎదిగే పిల్లలు ఏదైనా సాధించగల నేర్పునూ ఒంటబట్టించుకుంటారు. ఇదంతా ఒక కోణం. అక్కడ సరైన సదుపాయాలు ఉండవు. చదువుకునేందుకు సౌకర్యాలు ఉండవు. ఆడుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు ఉండవు, ఉన్నతస్థితిని అందుకునేందుకు అవకాశాలు ఉండవు...ఇది మరో కోణం. ఈ రెండు కోణాల్లో మనం దేనిని స్వీకరిస్తా మనేది...మన ఆలోచనా ధోరణిని బట్టి ఉంటుంది. మనం ఎలా ఎదుగుతామనేది మన ప్రతిభాసామర్థ్యాలకు సాన బెట్టుకోవడంపై ఉంటుంది. అవును.....ఈ విషయం పల్లె నుంచి ప్రముఖులుగా ఎదిగినవారిని చూస్తే అర్థమవుతుంది. ఇప్పుడు ఈ జాబితాలో మరో కుర్రోడు చేరాడు...అతనే గుండా శివప్రసాద్. పక్కా పల్లెటూరి నుంచి ప్రపంచ స్థాయి క్రీడాకారుడిగా మారాడు. గత ఏడాది అంటే 2018లో అమెరికా ఫ్లాగ్ ఫుట్‌బాల్ వరల్డ్ ఛాంపియన్ షిప్ పోటీలకూ వెళ్ళాడు. అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని ఫుట్‌బాల్ మ్యాచ్‌లు ఆడి దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకొస్తానంటున్నాడు ప్రకా శం జిల్లా కంభం మండలం, యర్రబాలెం గ్రామానికి చెందిన ఈ చిన్నోడు. ఒంగోలు గిత్తలా సత్తా చాటుతున్న శివప్రసాద్ క్రీడాకారుడిగా ఎదగడం వెనక అతని కృషి, శ్రమతో పాటు మొండిధైర్యమూ చాలానే ఉంది.

మండల కేంద్రానికి సుదూరంగా ఉన్న గ్రామం అది. చుట్టూ కొండలు... చెరువు...ఇదీ యర్రబాలెం వాతావరణం. ఇలాంటి వాతావరణంలో సెలవు రోజుల్లోనే కాదు...స్కూల్ నుంచి ఇంటికెళుతూనో లేక ఇంటి నుంచి బజారుకెళుతూనో స్నేహితులతో కలిసి ఎంచక్కా ఆటలాడేస్తూ ఉంటారు పిల్లలు. ఆ పనే చేశాడు ఇదే గ్రామానికి చెందిన శివప్రసాద్ కూడా. క్రమంగా పాఠశాల స్థాయిలోనే కబడ్డీ, ఫుట్‌బాల్, క్రికెట్, వాలీబాల్, బాల్ బాడ్మింటన్ క్రీడాకారుడిగా మారాడు. అప్పట్లోనే మండల, జిల్లా స్థాయిలో పలువురి మన్ననలు అందుకున్నాడు. ఆటల్లో ముందున్నాడు కదాని చదువు సాగలేదు అనుకోకండి. శివప్రసాద్‌కి చదువులోనూ మంచి రికార్డు ఉంది. చదువులో రాణిస్తూనే క్రీడాకారుడిగానూ ఛాంపియన్ అయ్యాడు. చదువులో బీటెక్ పూర్తిచేసిన శివప్రసాద్ ఆటల్లో... మండల, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి అంచెలంచెలుగా ఎదిగాడు. పల్లె నుంచి వచ్చిన ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా ప్రశంసలు అందుకున్నాడు, అందుకుంటున్నాడు. తన కుటుంబమే కాదు...ఊరు...రాష్ట్రం...దేశం గర్వపడేలా రికార్డులు సాధిస్తున్నాడు.

కుటుంబం-చదువు

గుండా మల్లికార్జునరావు, రంగ లక్ష్మమ్మ....శివప్రసాద్ తల్లిదండ్రులు. తండ్రి మాజీ సైనికుడు. తండ్రి సైనికుడిగా దేశానికి సేవ చేస్తే తనయుడు క్రీడాకారుడిగా దేశానికే గొప్ప కీర్తిప్రతిష్ఠలు తీసుకొస్తున్నాడని అంటున్నారు స్థానికులు. శివప్రసాద్ ఈ ప్రాంతానికే తలమానికం, అతను క్రీడాకారునిగా ఎదిగిన తీరు ఎంతోమందికి ఆదర్శం అని అంటున్నారు. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకూ గ్రామంలోనే చదువుకున్నాడు. ఎనిమిది నుంచి పదో తరగతి వరకూ తురిమిళ్ళ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్తి చేశాడు. ఇంటర్మీడియట్ ఒంగోలులోని తేజశ్విని జూనియర్ కాలేజీలో చదువుకున్నాడు. 2006లో బీటెక్ పూర్తి అయ్యింది.

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా...

బీటెక్ చదివే సమయంలోనే క్రీడాకారుడిగా ఛాంపియన్ షిప్‌లూ గెలిచాడు. ఇంటర్ యూనివర్శిటీ ఛాంపియన్‌షిప్, జెఎన్‌టియు ఛాంపియన్‌షిప్‌లు గెలిచాడు. క్రమంగా జాతీయస్థాయికి, అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు, మంచి గుర్తింపును తెచ్చుకున్నాడు. 2011లో ఎల్‌బీ స్టేడియంలో అమెరికన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ ఆధ్వర్యంలో ఒక ఫ్రెండ్‌షిప్ మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్‌లో బెంగళూరు జట్టుతో తలపడిన హైదరాబాద్ జట్టులో శివప్రసాద్ కూడా ఉన్నాడు. ఈ మ్యాచ్‌ను శివప్రసాద్ జట్టు ఓడిపోయినప్పటికీ ఇక్కడ తాను ఎంతో నేర్చుకున్నానని చెబుతాడు శివప్రసాద్. స్ట్రైకింగ్స్ జట్టు తరఫున జాతీయ స్థాయిలో 5 మ్యాచ్‌లు ఆడాడు. 2015 ఒక మ్యాచ్, 2016లో రెండు, 2017లో రెండు జాతీయ మ్యాచ్‌ల్లో శివప్రసాద్ ఉన్నాడు. అంతర్జాతీయ స్థాయిలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ తన సత్తా చాటాడు. జాతీయస్థాయిలో ఆడిన ఐదు మ్యాచ్‌లకు ఒక మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు. భారత అమెరికన్ ఫుట్‌బాల్‌సమాఖ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ ఫ్లాగ్ ఫుట్‌బాల్ టోర్నీలో మన రాష్ట్ర పురుషుల జట్టు విజేతగా నిలిచింది. ఢిల్లీ జట్టును ఓడించిన ఈ బృందంలో మన శివప్రసాద్ ఉన్నాడు.

తల్లి దండ్రుల దీవెనలు, మేనమామ నెమలిగుండం. వెంకటేశ్వర్లు సహకారంతో జాతీయస్థాయిలో క్రీడాకారుడిగా ఎదగగలిగానని చెప్పే శివప్రసాద్ అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని మెడల్స్‌తో పాటుగా భారతదేశానికి కీర్తిప్రతిష్ఠలు తీసుకొస్తానని చెబుతున్నాడు. ఇందుకు తగిన సహాయసహకారాలు ప్రభుత్వం నుంచీ అందించాల్సిన బాధ్యత ఉంది. శివప్రసాద్ లాంటి క్రీడాకారులు మరింతమంది వచ్చేందుకు ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరమూ ఉంది.

షేక్ మీరావలి, కంభం, ప్రకాశం జిల్లా.



దుబాయ్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు సభ్యుడిగా



క్రీడాకారిణి సింధూతో ప్రసాద్ (కుడి నుండి మొదటి వ్యక్తి)

చలికాలంలో రోగనిరోధక శక్తి కోసం...

మన రోగ నిరోధక శక్తి ప్రధానంగా మనం తీసుకునే ఆహారాన్ని బట్టే ఉంటుంది. కాలం ప్రభావం అంటే సీజన్ ప్రభావమూ ఉంటుంది. ఒక్కో కాలంలో ఒక్కోరకమైన ఆహారం తీసుకోవడానికి కారణం కూడా ఇదే. సరిపడ రోగనిరోధక శక్తి ఉంటే వ్యాధుల భయం ఉండదు. మరి చలికాలంలో రోగనిరోధక శక్తి పెరగాలంటే...ఇలా చేసి చూడండి.



- మీ రోజువారీ ఆహారంలో పుట్టగొడుగులనూ చేర్చుకోండి. దీనివల్ల చలికాలంలో రోగనిరోధక శక్తి బాగా పెరుగుతుంది. ఇందులో ఉండే విటమిన్ డి శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. మామూలుగా కూరల రూపంలో మష్రూమ్స్‌ని తినలేనివారు దీనిని సూప్‌లు, సలాడ్‌ల రూపంలో తీసుకోవచ్చు. దీనివల్ల ఎక్కువ ప్రయోజనాలూ అందుతాయి.
- శీతాకాలంలో అల్లం, వెల్లుల్లి వాడకాన్ని బాగా పెంచాలి. రోజువారీ వంటల్లో వీటిని వాడడం వల్ల మంచి ప్రయోజనాలు దక్కుతాయి. ఈ రెండింటిలోనూ యాంటీ వైరల్, యాంటీ ఫంగల్, యాంటీ బాక్టీరియల్ గుణాలు ఎక్కువ. ఇవి జలుబు, వైరల్ ఫీవర్‌లను నిరోధిస్తాయి.



- చలికాలంలో పెరుగుని తినడానికి చాలామంది సంకోచిస్తారు. కానీ ఈ కాలంలో తప్పనిసరిగా తీసుకోవలసిన పదార్థం పెరుగు. దీనివల్ల ఎలాంటి హాని ఉండదు. పైగా ఎన్నో లాభాలు ఉన్నాయి. అందుకే కచ్చితంగా తీసుకోవలసిన చలికాలం ఆహార పదార్థాల జాబితాలో దీనిని చేర్చుకోవాల్సిందే. పెరుగు చలికాలంలో గొప్ప మేలు చేస్తుంది. శరీరానికి మేలు చేసే బాక్టీరియా ఉత్పత్తికి ప్రో బయోటిక్ ఫుడ్ అయిన పెరుగు చాలా అవసరం. ఇవి జీర్ణక్రియను సవ్యంగా సాగేలా చేస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. వాపు, ఇన్ఫెక్షన్లను నివారిస్తాయి.
- ఈ కాలంలో బచ్చలి, క్యాబేజీ, బ్రకోలీ, నిమ్మజాతి పండ్లను డైట్‌లో చేర్చుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చు.



చిలకడదుంపల ఆకుల్లోనూ....!



చిలకడదుంపలు అద్భుతమైన, ఆరోగ్యకరమైన, అత్యంత రుచికరమైన ఆహార పదార్థం అని అందరికీ తెలుసు. మరి వాటి ఆకులూ ఏ విషయంలోనూ ఈ దుంపలకు తీసిపోవనే విషయం మీకు తెలుసా?

ఈ దుంపల మాదిరిగానే వాటి ఆకులూ సూపర్ ఫుడ్డే. చిలకడదుంపలే కాదు వాటి ఆకుల్లోనూ మంచి విటమిన్లు ఉన్నాయి. మనిషికి అవసరమైన విటమిన్లు ఈ ఆకుల్లో పుష్కలంగా ఉన్నాయి. వీటిల్లో విటమిన్లు ఉన్నాయి కాబట్టి, ఆరోగ్యానికి మంచిది కాబట్టి తినాలని బలవంతంగా తినక్కర్లేదు. ఒక్కసారి తింటే మళ్ళీమళ్ళీ ఆకర్షించే రుచి వీటి సొంతం. అవును ప్రపంచంలోని చాలా దేశాల్లో వీటికి అత్యధిక డిమాండ్ కూడా ఉందని తెలుసా మీకు. మనదేశంలో మాత్రం వాటికి ఆకులు ఉంటాయనే కాదు...అవి తినవచ్చునని, అవి మంచి రుచికరంగా ఉంటాయని చాలామందికి తెలియదు. వీటిల్లో ఆస్కార్బిక్ యాసిడ్‌తో పాటు పలు రకాల బి విటమిన్లు ఉన్నాయి. చిలకడదుంపలతో పోలిస్తే వీటి ఆకుల్లో విటమిన్ బీ6 మూడు రెట్లు ఎక్కువగా, విటమిన్ సీ ఐదు రెట్లు ఎక్కువగా, రైబోఫ్లోవిన్ దాదాపుగా 10 రెట్లు ఎక్కువగా ఉంటుంది. అంటే చిలకడదుంపల ఆకులు పోషకాల పరంగా చూస్తే పాలకూరతో సమానం. అయితే పాలకూర లాంటి కొన్ని ఆకుకూరల్లో ఉండే ఆక్సాలిక్ యాసిడ్ ఈ ఆకుల్లో తక్కువగా ఉంటుంది. ఈ ఆకుల కాడలు కూడా మంచి రుచిగా ఉంటాయి. విటమిన్ బీ6, ఇతర అత్యావశ్యకమైన విటమిన్లు అటు లేత ఆకులు, ఇటు ముదురు ఆకుల్లో కూడా పుష్కలంగానే ఉంటాయి. లేత ఆకుల్లో ఆస్కార్బిక్ యాసిడ్ బాగా ఎక్కువగా ఉంటుంది. ముదురు ఆకులు, మొగ్గల్లో ఇది కొంచెం తక్కువగా కనిపిస్తుంది.

ఉడికిస్తే...



- మూతపెట్టకుండా ఉడికించే పదార్థాలలో ఎ విటమిన్ లోపిస్తుంది
- నీళ్ళు ఎక్కువగా పోసి ఉడికిస్తే బి విటమిన్ నశిస్తుంది.
- పదార్థాలు ఎక్కువసేపు ఉడికితే సి విటమిన్ పోతుంది
- క్యాబేజీ వాసన రాకుండా ఉండాలంటే ఉడుకుతుండగానే అందులో ఒక బ్రెడ్ పీసును వేస్తే అది వాసనని పీల్చేసుకుంటుంది
- బెండ ముక్కల్ని ముందు కొంచెం నూనెలో వేయించి తర్వాత ఉడకబెట్టి కూర వండితే జిగురు ఉండదు
- బఠాణీలు ఉడికించే ముందు ఆ నీళ్ళకి ఒక చెంచా పంచదార కలిపితే రుచిగా ఉంటాయి.

రోజ్‌వాటర్...బాడీ లోషన్

స్నానం తర్వాత ఒంటికి రాసుకనే బాడీలోషన్‌లు బయట కొనుక్కొస్తున్నారా? ఇకపై మానేయండి. ఎంచక్కా ఇంట్లోనే తయారు చేసుకోండి. 100 ఎంఎల్ రోజ్ వాటర్‌లో ఒక టేబుల్ స్పూన్ స్వచ్ఛమైన మంచి గ్లిజరిన్‌ని కలిపేయండి. అంతే మంచి బాడీ లోషన్ రెడీ. దీనిని ఒక బాటిల్‌లో పోసి బిగుతైన మూత పెట్టి ఉంచుకుంటే మీకు ఎప్పుడు కావాలంటే అప్పుడు వాడుకోవచ్చు.



సౌందర్యానికి అలోవెరా



- కలబంద గుజ్జుని పసుపుతో కలిపి ముఖానికి పూసుకుంటే కొద్దిసేపటికే మెరుపు వస్తుంది.
- కలబంద గుజ్జుని జుట్టు కుదుళ్ళ వరకూ పట్టించి కొద్దిసేపటి తర్వాత తలస్నానం చేయాలి. ఇలా చేస్తే జుట్టుకి ఆరోగ్యమే కాదు జీవం, కాంతి కూడా వస్తాయి.
- కలబంద గుజ్జు, బంతిపూల పేస్ట్, నిమ్మకాయ రసం, కొద్దిగా కమలాఫలం రసం కలిపి మిశ్రమంలా చేసి ముఖానికి రాసుకుని అరగంట తర్వాత కడిగేయండి. మీరు ఊహించనంత మెరుపు ముఖానికి రావడం ఖాయం.

నేను - సుడిగుండం

(నవల) 9

పి.చంద్రశేఖర్ ఆజాద్
సెల్: 92465 73575

నిన్నటి సంచిక తరువాయి

నావరకు నేను వ్యవసాయం చేస్తున్నాను. అందువల్ల నాలుగు ముద్దలు తింటున్నాం. అవసరాలు తీర్చుకుంటున్నాం. అయినా నేను పండిన పంట జనం దగ్గరకు వెళ్లినప్పుడు సంతోషం కలుగుతుంది. వ్యవసాయదారుడు వరి పండిస్తాడు. కూరగాయలు పండిస్తాడు- ఎన్ని నష్టాలు వచ్చినా.

గంజాయి కూడా పంటే. అందులో రిస్క్ వుంది. అసలు వ్యవసాయం అంటేనే రిస్కు రైతు పండించిన పంట వృధాగా నీళ్ల పాలయినపుడు బాధ పడతాడు. అంతేగాని అందరూ గంజాయి పండించరు. చదువూ అంతే. ఈ చదువులు విషాన్ని అమ్ముకునే వారిని తయారు చేస్తాయి. అమృతాన్ని అందించే వారిని కూడా!

అందుకే అనుకుంటాను ఇంజినీర్లు, డాక్టర్లు ఎవరయినా గాని వారిలో రైతు హృదయం వుంటే ఇన్ని అరాచకాలు జరగవు. అందుకోసం చదువుకో. అర్చనా, వెన్నెల గురించి రాసావు. మీకు నేను చేసిన సహాయం గురించి రాసావు. నేను నా చెల్లికి చేసాను. లోకానికి ఏదయినా చేయగల స్తోమత నాకు లేదు. అందుకని అది పెద్ద విశేషం కాదు.

అమ్మా, పిల్లలూ, అత్తయ్యా నిన్ను గురించి తలచుకుంటున్నారు. బాగా చదువుకో.

ఈ ఉత్తరంలో కొన్ని అంశాలను మావయ్య ప్రస్తావించలేదు. ముఖ్యంగా అర్చన, వెన్నెల విషయంలో మౌనంగా వుండటం అసంతృప్తిని కలిగించింది.

ఉదయం సుధాకర్ మాట్లాడాడు. అతను నీళ్లంటే భయం అన్న మిత్రుడు.

"నిన్న ఏమైపోయావు" అన్నాడు.

"ఆ ఆలోచన ఇప్పుడు వచ్చిందా" అన్నాను. అంతటితో ఆగలేదు.

"అప్పుడు కూడా నా మీద జోకులేసుకున్నారా. నేను మీ ముందు నుంచే నడుచుకుంటూ వెళ్లాను. అది మరిచిపోయారు. నీకు నీళ్లంటే భయం అన్నావని నిన్ను వదిలేసారు. నాకు మీరంటే ఇష్టం లేదన్నాను అందుకని పట్టించుకోరా?"



"అది కాదు రామూ...."

"నాకు చెప్పొద్దు సుధా. నీళ్లంటే సముద్రమే కాదు. మీరు తాగి పగలగొట్టిన బాటిల్స్ లో వుంది కూడా నీళ్లే. అవి చల్లవో, వేడివో నాకు తెలియదు. నీటి గండం బీరు నీళ్ల నుంచి కూడా రావచ్చు"

"నువ్వు సరదాగా మాట్లాడగలవు" అన్నాడు.

"నేను సీరియగా మాట్లాడుతున్నా. సారానో, అలాంటి మద్యమో తాగి తాగి చచ్చిన వారి గురించి నేను విన్నాను" అనగానే సుధ ముఖం మాడిపోయింది.

"మీరందరూ ఇతరుల్ని మారుస్తారు గాని మీరు మారరన్న మాట. అంటే మనుషులందరూ బీడీలూ, సిగరెట్లు తగలెయ్యాలి. మద్యం తాగాలి. ఇదన్నమాట మీరు తీసుకొచ్చే మార్పు"

"నిజంగానే సీరియస్గా మాట్లాడుతున్నావు" అన్నాడు. అప్పుడు మరింత కోపం వచ్చింది. అతన్ని చూస్తుంటే...

"నీకు నలుగురితో కలవటం రాదు. ఈ వయసులో సరదాగా ఏదో చేస్తాం. దాన్ని నువ్వింత సీరియస్గా తీసుకోకూడదు"

"ఓహో... ఈ వయసు సరదాల కోసం అయితే ఏ వయసులో గొప్ప పనులు చేస్తారు. నేను నలుగురితో కలవలేను అన్నారు కదా. ఇంకెప్పుడూ ఇలాంటి పనులకి నన్ను పిలవొద్దు. నానవాన నన్ను చదువుకోనీయండి" అన్నాను.

కొద్దిసేపు నన్ను చూసి "సారీ రామూ" అని వెళ్లిపోయాడు.

నా మాటలు సుధాకర్ మీద కొంతవరకు పని చేసాయి. మిగతా వారితో ఏం చెప్పాడో, ఏం మాట్లాడుకున్నారోగాని...

వాడితో కెమిస్ట్రీ వర్కవుట్ కాలేదు. రాముగాడు 'మిస్టర్ సీరియస్" అనుకున్నారంట.

ఈ అనుభవంలో నాకంటూ తృప్తిని యిచ్చింది - సముద్రం నాకు యిచ్చిన గవ్వ! అందులోనూ మొదటిసారి నాకు దొరికిన గవ్వ. నాకు మామూలుగా గవ్వలంటే ఇష్టం. ఇది మాత్రం అపూర్వంగా అనిపించింది.

ఈ గవ్వను దాచుకోగలగాలిగాని మనం లేకపోయినా ఆగవ్వ వుంటుంది. మనుషులు చనిపోతే భౌతికంగా గుర్తులుండవు.

గవ్వలు అలా కాదు..

\- - - - -

అమిత

కాలం వేగంగా పరుగులు తీస్తోంది. తొందర్లో సెలవులు రాబోతున్నాయి. ఇదివరకటిలా అమ్మా వాళ్లు గుర్తు రానంతగా చదువులోనూ, ఇతర విషయాల్లోనూ మునిగిపోయాను.

నాకు లలిత పరిచయం చిత్రంగా జరిగింది.

నాకు ఆడపిల్లల్లో మాట్లాడాలంటే సిగ్గు. ఒక్క వెన్నెలతోనే హాయిగా మాట్లాడతాను. అర్చన చిన్నది. నేను తలదించుకుని నడుస్తుంటాను. లలితది మా గ్రూపే.

ఓసారి నోట్బుక్ కావాలని అడిగింది. నేను యిచ్చాను. అప్పుడు పొడి పొడిగా రెండు మాటలు. పుస్తకం తిరిగి యిచ్చాక 'థాంక్స్" అంది. నేను చిన్నగా నవ్వాను. నాగురించి ఏమనుకుందో తెలియదు.

తన పుట్టినరోజు చిన్న హొటల్లో జరుపుకుంటున్నానని ముఖ్యమైన స్నేహితులను పిలుస్తున్నాను మీరు రావాలి అని హొటల్ గురించి చెప్పింది. అప్పుడు నేను కంగారు పడ్డాను. ఈసారి ఎలాంటి అనుభవం ఎదురవుతుందో అని. అప్పటికి తలూపాను. వెళ్లకుండా తర్వాత ఏదొకటి చెప్పాలనుకున్నాను.

ఇంతవరకు నేను నలుగురితో కలిసి పుట్టినరోజు జరుపుకోలేదు. పట్టినరోజు నాకే గుర్తుండేది కాదు. ఓసారి అమ్మ గుర్తు పెట్టుకుంది. నా తల అంటింది. నా బట్టల్ని చెంబు ఇస్త్రీ చేసింది. ఆ రోజు మావయ్య ఊర్లో లేడు. అత్త కాళ్లకి దండం పెట్టిరా అంది. నేను అలా చేస్తుంటే వెన్నెల చిత్రంగా చూసింది. ఆ సాయంకాలం అత్త మా ఇంటికి పాయసం పంపింది.

మా ఊర్లో కూడా స్నేహితులు పుట్టినరోజులు జరుపుకోవటం నేను చూడలేదు. అందరిదీ ఒకే రకమైన ఆర్థిక పరిస్థితి.

అందుకే లలిత ఎలా జరుపుకుంటుందో చూడాలనిపించింది. పట్టిన రోజుకి ఏదో ఒక బహుమతి తీసుకు వెళ్తారని తెలుసు. లలితకు ఏం తీసుకు వెళ్లే బాగుంటుందా అని ఆలోచించాను. ఎంతకీ నాకు అర్థం కాలేదు. ముందు పెద్ద షాపులోకి అడుగు పెట్టటానికి నాకు ధైర్యం చాల లేదు.

అప్పుడు గుర్తొచ్చింది సముద్రం దగ్గర దొరికిన గవ్వ! అది ఇస్తే ఎలా వుంటుందనుకున్నాను. ఇది వెన్నెలకి ఇవ్వాలనుకున్నాను. ఇంతలోనే నిర్ణయం మార్చుకున్నానేంటి! అయినా లలిత విశాఖలోనే వుంటుంది. ఎన్నోసార్లు సముద్రాన్ని చూసి వుంటుంది. గవ్వల్నీ ఏరుకుని వుంటుంది. ఇక్కడ రంగు రంగుల గవ్వలు దొరుకుతాయి. అవన్నీ ప్రత్యేకంగా పాలిష్ చేసి, అందంగా తీర్చిదిద్దినవి. ఇంట్లో అలంకారంగా పెట్టుకుంటారు. అలాంటిది నాకు దొరికిన గవ్వకి విలువ వుంటుందా? నేను తేల్చుకునే లోగానే పుట్టిన రోజు వచ్చేసింది.

ఎలాంటి కానుకా తీసుకోకుండానే వెళ్లాను. నా మనసులో అందుకు సరిపోయిన రీజన్ వుంది. మనల్ని మనం సంతృప్తి పరుచుకోవటం ముఖ్యం. ఓసారి మనం కానుక యిస్తే ఏదో సందర్భం చూసుకుని తిరిగి ఇస్తుంది. ఇలాంటివన్నీ పెంచుకోవటం మంచిది కాదు. అసలు విషయం నా దగ్గర డబ్బు లేదు. చివరకి ఇలాంటి వాటికి కూడా మావయ్య డబ్బుని ఎందుకు వాడాలి. నేను సంపాదించినప్పుడు ఇలాంటివి ఆలోచిస్తాను.

అందరూ ఆడపిల్లలు. అందులో నేను ఒక్కడ్నే మగవాడిని. అందులో పరిచయం లేని వారు ఎక్కువ. నన్ను సాదరంగా ఆహ్వానించింది. కేక్ కట్ చేయటానికి ఎవరి కోసమో ఎదురు చూస్తోంది. నేను ఓ మూలన కూర్చున్నాను. పది నిముషాల తర్వాత ఓ కారు వచ్చి ఆగింది. అందులో నుండి ఓ అమ్మాయి దిగింది. లలిత ఆనందంగా తనని రిసీవ్ చేసుకుంది.

"ఆలస్యం అయింది ఏమీ అనుకోవద్దు" అంటోంది.

"అదేం లేదు" అంటూ అప్పటికప్పుడు అన్ని ఏర్పాట్లు చేసారు. అందరం "హ్యాపీ బర్త్ డే టూయూ" అని పాడుతుంటే లలిత కేక్ కట్ చేసింది. ముందు ఆ అమ్మాయికి తినిపించింది. అందరూ లలిత నోటికి కేక్ అందిస్తున్నారు. నేను కాస్త దూరంగా వున్నాను. నా వంతు వచ్చింది.

నాకు మొహమాటంగా వుంది. కేక్ ముక్కనీ ఆమె చేతికే అందించాను. 'థాంక్యూ' అంటూ చిన్నగా నవ్వింది. అక్కడ నుండి కేక్ తీయకముందు, లలిత ముఖానికి ఇద్దరమ్మాయిలు పైనున్న పేస్ట్రి రాసారు. చప్పట్లు... జోకులు... ముఖం తుడుచుకుంది.

భోజనాలకు ముందు ఆ అమ్మాయిని తీసుకు వచ్చింది. 'నా బెస్ట్ ఫ్రెండ్ అమీత' అని నాకు పరిచయం చేసింది. నమస్కరించాను. తనూ అంతే. 'రాము" అంది,

'అమీత' పేరు నాకు విపరీతంగా నచ్చింది.

మధుమిత, మధుబాల ఇలాంటి పాత పేర్లంటే నాకు ఇష్టం. ఆ పేర్లలో ఏదో అందం వుంటుంది. ఇప్పటి పేర్లలో ఇతరులకి భిన్నంగా వుండాలనుకోవటం తప్ప కొన్ని పేర్లకు అర్థం వుండదు. చాలా పేర్లలో హృదయం వుండదు. అప్పుడు నా పేరు మీద నాకున్న అసంతృప్తి మళ్లీ బయటకు వచ్చింది. మార్చుకోవాలి. నా పేరు ఎప్పటికయినా మార్చుకుంటాను అనుకున్నాను.

భోజనాలు మొదలయ్యాయి. నా వరకు నాకు భోజనం చాలా బాగుంది. ఇలాంటి రుచి ఇంతకుముందు నాకు తెలవదు. అందరం వీడ్కోలు తీసుకుంటు న్నప్పుడు మీరు బస్లో వచ్చారు కదూ' అంది లలిత. అవునన్నాను.

"అమిత కారులో మిమ్మల్ని డ్రాప్ చేస్తుంది" అంది "ఎందుకండి. నేను వెళ్తాను" అన్నాను. "ప్రతిదానికీ మొహమాటపడొద్దు" అంటూ వెళ్లింది.

కారు ఎక్కటం కూడా నాకు మొదటిసారి. అమిత కూడా మా యూనివర్సిటీలోనే చదువుతోందంట. తను సైకాలజీ తీసుకుంది. నన్ను దించేసి 'మళ్లీ కలుద్దాం' అని వెళ్లిపోయింది.

ఆ రకంగా కొత్త అనుభవం మిగిలింది.

\- - - - -

(ఇంకా ఉంది)

అహింసా మెసెంజర్ పథకం ఎప్పుడు ప్రారంభమైంది ?



భారతదేశ గ్రామీణాభివృద్ధి పథకాలు

బిట్‌బ్యాంక్

- మొట్టమొదట పనికి ఆహారం పథకం 1977-78 సంవత్సరంలో ఏ రాష్ట్రంలో ప్రారంభించారు ? **- రాజస్థాన్**
- గ్రామీణ ఉపాధి హామీ పథకం 2006 సంవత్సరంలో ఏ రాష్ట్రంలో ప్రారంభించారు ? **- ఆంధ్రప్రదేశ్**
- గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్ర, రాష్ట్రాల నిధుల వాటా నిష్పత్తి ఎంత ? **- 90 : 10**
- జాతీయ గ్రామీణ ఉద్యోగితా కార్యక్రమం (ఎన్‌ఆర్‌ఈపీ) మొట్టమొదట ఏ ప్రణాళికలో ప్రారంభమైంది ? **- 6వ ప్రణాళికలో**
- 1989లో ఎన్‌ఆర్‌ఈపీని ఆర్‌ఎల్‌ఈజీపీతో కలిపి దేన్నిగా మార్చారు ? **- జవహర్ రోజ్‌గార్ యోజన (జేఆర్‌వై)**
- భూమిలేని గ్రామీణులకు ఉపాధి హామీ పథకం (ఆర్‌ఎల్‌ఈజీపీ)ని ఏ ప్రణాళికలో ప్రారంభించారు ? **- 6వ ప్రణాళికలో**
- ఆర్‌ఎల్‌ఈజీపీ పథకం ప్రకారం భూమిలేని గ్రామీణ కుటుంబాలలో ఒక్కొక్కరికి సంవత్సరానికి ఎన్ని రోజుల పని కల్పించడం లక్ష్యం ? **- 100 రోజులు**
- జవహర్ రోజ్‌గార్ యోజన (జేఆర్‌వై) పథకం మొదటిసారి ఎప్పుడు ప్రారంభమైంది ? **- 1989, ఏప్రిల్ 1**
- జేఆర్‌వై పథకం ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, మహిళలకు ఎంత శాతం రిజర్వేషన్ కల్పించారు ? **- 30 %**
- జేఆర్‌వై పథకానికి అయ్యే ఖర్చులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా నిష్పత్తి ఎంత ? **- 80 : 20**
- 1999లో జేఆర్‌వై లోని కేంద్ర, రాష్ట్రాల నిధుల వాటాను 75:25గా మార్చుతూ ఏ పథకంగా మార్చారు ? **- జవహర్ గ్రామ్ సమృద్ధి యోజన (జేజీఎస్‌వై)**
- 2001 సెప్టెంబర్‌లో జేజీఎస్‌వైని ఈఏఎస్ తో కలిపి ఏ పథకంగా మార్చారు ? **- సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన (ఎస్‌జీఆర్‌వై)**
- మిలియన్ బావుల పథకాన్ని ఏ సంవత్సరంలో ప్రారంభించారు ? **- 1988**
- మిలియన్ బావుల పథకం ఖర్చులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిష్పత్తి ఎంత ? **- 80 : 20**
- గ్రామీణ పేద ప్రజల ఉద్యోగ హామీ పథకం ఎప్పుడు ప్రారంభమైంది ? **- 1993, అక్టోబర్ 2**
- గ్రామీణ పేద ప్రజల ఉద్యోగ హామీ పథకం ద్వారా ప్రతి వ్యక్తికి ఎన్నిరోజుల పనిని కచ్చితంగా కల్పిస్తారు ? **- 100 రోజులు**
- జవహర్ గ్రామ్ సమృద్ధి యోజన (జేజీఎస్‌వై) ను ఎప్పుడు ప్రారంభించారు ? **- 1999 ఏప్రిల్ 1**
- సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన (ఎస్‌జీఆర్‌వై)ను ఎప్పుడు ప్రారంభించారు ? **- 2001 సెప్టెంబర్ 25**
- ఎస్‌జీఆర్‌వై పథకంలో ఎంత శాతం నిధులను కేంద్రప్రభుత్వం ఆహార ధాన్యాల రూపంలో అందిస్తుంది ? **- 50 %**
- 2006 నుండి ఎస్‌జీఆర్‌వైని దేనితో అనుసంధానం చేశారు ? **- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈ)**
- జాతీయ పనికి ఆహార పథకంను ఎప్పుడు ప్రారంభించారు ? **- 2004**
- జాతీయ పనికి ఆహార పథకాన్ని 2006లో ఎందులో విలీనం చేశారు ? **- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీపీ)**
- స్మాల్ ఫార్మర్స్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ స్థాపన ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి ? **- చిన్నకారు రైతుల అభివృద్ధి కోసం**
- "మార్జినల్ ఫార్మర్స్ అండ్ అగ్రికల్చరల్ లేబర్" పథకం స్థాపన ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి ? **- సబ్సిడీ ద్వారా పాడి, మత్స్య కోళ్ల పరిశ్రమల ఏర్పాటుకు సాయపడటం**
- సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం (ఐఆర్‌డీపీ)ను ఏ ప్రణాళికలో ప్రారంభించారు ? **- 5వ ప్రణాళిక**
- 1999 ఏప్రిల్ 1 నుంచి ఐఆర్‌డీపీని ఏ పథకంలో విలీనం చేశారు ? **- గ్రామ స్వరోజ్‌గార్ యోజన (ఎస్‌జీఎస్‌వై)**
- గ్రామీణ యువకుల స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని (టీఆర్‌వైఎస్‌ఈఎమ్) ఎప్పుడు ప్రారంభించారు ? **- 1979 ఆగస్టు 15**
- టీఆర్‌వైఎస్‌ఈఎమ్ పథకానికి అయ్యే ఖర్చులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిష్పత్తి ఎంత ? **- 50 : 50**
- టీఆర్‌వైఎస్‌ఈఎమ్ పథకాన్ని 1999 సంవత్సరంలో ఎందులో విలీనం చేశారు ? **- స్వర్ణ జయంతి గ్రామ సమృద్ధి యోజన (ఎస్‌జీఎస్‌వై)**
- గ్రామీణ ప్రాంతాల్లోని చేతివృత్తుల వారు తమ ఉత్పత్తి నాణ్యతను పెంచుకొని అధిక ఆదాయాన్ని పొందుటకు అధిక పనిముట్లను పంపిణీ చేసే కార్యక్రమం ఏది ? **- ఎస్‌ఐటీఆర్‌ఏ (సప్లయ్ ఆఫ్ ఇంప్రూవ్డ్ టూల్ కిట్స్ రూరల్ ఏజెన్సీ)**
- ఎస్‌ఐటీఆర్‌ఏ ను 1999 ఏప్రిల్ 1 నుండి ఎందులో విలీనం చేశారు ? **- స్వర్ణ జయంతి గ్రామ సమృద్ధి యోజన (ఎస్‌జీఎస్‌వై)**
- భూగర్భ జలాలను వెలికితీసి, వ్యవసాయ రంగానికి నీటిపారుదల సౌకర్యం కల్పించడం కోసం 1997 ఫిబ్రవరి 1న ప్రారంభించిన పథకం ఏది ? **- గంగా కళ్యాణ్ యోజన**
- గంగా కళ్యాణ్ యోజన పథకం ఖర్చులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిష్పత్తి ఎంత ? **- 80 : 20**
- గంగా కళ్యాణ్ యోజన పథకాన్ని 1999 ఏప్రిల్ 1 నుంచి ఎందులో విలీనం చేశారు ? **- స్వర్ణ జయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన (ఎస్‌జీఎస్‌వై)**
- గ్రామీణ ఆరోగ్యం, మంచినీటి సరఫరా, విద్యుత్, ప్రాథమిక విద్య, పోషకాహారం మొదలగు అవసరాలను కల్పించడం కోసం 1974 సంవత్సరంలో ప్రారంభించిన పథకం ఏది ? **- కనీస అవసరాల పథకం**



- కనీస అవసరాల పథకంను ఏ ప్రణాళికలో ప్రారంభించారు ? **- 5వ ప్రణాళిక**
- 20 సూత్రాల పథకం ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి ? **- పేదరికాన్ని తొలగించి, ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగుపరచడం**
- 20 సూత్రాల పథకాన్ని ఎవరు ప్రారంభించారు ? **- అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ**
- ఎడారులుగా మారుతున్న ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం కోసం 1973-74లో ప్రారంభించిన పథకం ఏది ? **- ఎడారి అభివృద్ధి పథకం**
- 'సమగ్ర వ్యర్థ భూమి అభివృద్ధి పథకం'ను ఏ ప్రణాళికలో ప్రారంభించారు ? **- 11వ ప్రణాళికలో**
- సమగ్ర నీటి కుంటల నిర్వహణ కార్యక్రమంను ఏ సంవత్సరంలో ప్రారంభించారు ? **- 2009లో**
- ఐఆర్‌డీపీ, టీఆర్‌వైఎస్‌ఈఎమ్, ఎస్‌ఐటీఆర్‌ఏ, డీడబ్ల్యూఏసీఆర్‌ఏ, జీజేవై, ఎండబ్ల్యూఎస్ లను విలీనం చేసి, స్వయం ఉపాధి పథకాలుగా మార్చుతూ ఏ పథకంగా ప్రారంభించారు ? **- స్వర్ణ జయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన (ఎస్‌జీఎస్‌వై)**
- ఎస్‌జీఎస్‌వై లోని ఖర్చులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాల నిష్పత్తి ? **- 75: 25**
- ఎస్సీ, ఎస్టీలకు, వెట్టిచాకిరీ నుంచి విముక్తి పొందినవారికి, బీపీఎల్ వారికి, పేదవారికి ఇంటి వసతి కల్పించడం కోసం 1985 సంవత్సరంలో ప్రారంభించిన పథకం ఏది ? **- ఇందిరా ఆవాస్ యోజన (ఐఏవై)**
- ఇందిరా ఆవాస్ యోజనా (ఐఏవై) పథకాన్ని ఎందులో విలీనం చేశారు ? **- జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం)**
- భూగర్భ జలాలు, ఉపరితల జలాలను వినియోగించుకొని గ్రామాలకు మంచినీటి సదుపాయాన్ని అందించేందుకు 2009లో ప్రారంభించిన పథకం ఏది ? **- జాతీయ గ్రామీణ త్రాగునీటి పథకం (ఎన్‌ఆర్‌డీడబ్ల్యూపీ)**
- స్వచ్ఛందంగా ప్రజలను గ్రామీణాభివృద్ధి కార్యకలాపాల్లో పాల్గొనేలా చూడటం, సమగ్ర గ్రామీణాభివృద్ధి స్వయం సమృద్ధికై ఉద్దేశించిన పథకాలను, స్కీములను ప్రోత్సహించడం కోసం సహాయపడే సంస్థ ఏది ? - CAPART (Council for Advancement of People Action and Rural Technology)
- మధ్యాహ్న భోజన పథకం ఎప్పుడు ప్రారంభమైంది ? **- 1995, ఆగస్టు 15**
- 'భారత్ నిర్మాణ్ యోజన' పథకంలో ఎంపిక చేసిన అంశాలు ఎన్ని ? **- 6**
- 'భారత్ నిర్మాణ్ యోజన'ను ప్రస్తుతం ఎందులో భాగంగా అమలు పరుస్తున్నారు ? **- స్వచ్ఛ భారత్**
- గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ వసతులు సమకూర్చడం కోసం 2003 సంవత్సరంలో ప్రారంభించిన పథకం ఏది ? **- పురా (ప్రొవైడింగ్ అర్బన్ ఎమినిటీస్ ఇన్ రూరల్ ఏరియాస్)**
- పురా నమూనాను రూపొందించింది ఎవరు ? **- డాక్టర్ అబ్దుల్ కలాం**
- పురా పథకం కింద ఒక్క బ్లాకుకు ఎంత కేటాయించారు ? **- 2000 కోట్లు**
- గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టులకు విత్త సహాయాన్ని అందించేందుకు 1984 సంవత్సరంలో కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన నిధి పేరేమిటి ? **- ఎన్‌ఎఫ్‌ఆర్‌డీ (నేషనల్ ఫండ్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్)**
- ఇందిరాక్రాంతి పథకంను ఏ ప్రణాళికలో ప్రారంభించారు ? **- 10వ ప్రణాళిక**
- ఇందిరా క్రాంతి పథకం కింద నిర్వహించే కార్యక్రమాలు ఏవి ? సూక్ష్మ విత్తం, ఆహార భద్రత, దీపం, బీమా, సామాజిక అభివృద్ధి, గ్రామీణ నిర్మిత కేంద్రాలు, స్వీయ యాజమాన్య సంస్థల నిర్మాణం
- గ్రామ పంచాయతీల పారిశుద్ధ్యాన్ని ప్రోత్సహించడానికి 2003 అక్టోబర్‌లో ప్రారంభించిన పథకం ఏది ? **- నిర్మల్ గ్రామ పురస్కార్**
- ఆర్థికంగా బలహీనవర్గాల వారికి ఒక మిలియన్ ఇళ్లు నిర్మించడం కోసం 2009లో ప్రారంభమైన పథకం ఏది ? **- ఎఫోర్డబుల్ హౌసింగ్ ఇన్ పార్ట్‌నర్‌షిప్ (ఏహెచ్‌ఐపీ)**
- జాతీయ గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం (అజీవిక పథకం) (నేషనల్ రూరల్ లైవ్‌లీహుడ్ మిషన్) ను ఎప్పుడు ప్రారంభించారు ? **- 2011, జూన్ 3**
- జాతీయ గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం (అజీవిక పథకం)ను ప్రస్తుతం ఏ పథకంగా పిలుస్తున్నారు ? **- దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన**
- గ్రామాలలో పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసి, సామాజిక సామరస్యాన్ని పెంపొందించడం కోసం 2016 సంవత్సరంలో ప్రారంభించిన పథకం ఏది ? **- గ్రామ ఉదయ్ సే భారత్ ఉదయ్ అభియాన్**
- తీర్థయాత్రా స్థలాల వద్ద అవస్థాపన సౌకర్యాలు కల్పించి, తీర్థయాత్రల ప్రాధాన్యతను పెంచి, ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రాలుగా వాటిని అభివృద్ధి చేయడానికి ప్రారంభించిన పథకం ఏది ? **- ప్రసాద్ (పిలిగ్రిమ్ రిజువినేషన్ అండ్ స్పిరిట్యువల్ ఆగ్యుమెంటేషన్ డ్రైవ్)**
- 7 రకాల వ్యాధులు సోకకుండా పిల్లలకు టీకాలు వేయించడానికి, వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించేందుకు కేంద్రం ఏప్రిల్ 7, 2015న ప్రారంభించిన పథకం ఏది ? **- మిషన్ ఇంద్రధనుష్**
- గ్రామీణ మహిళ, శిశు అభివృద్ధి పథకం (డెవలప్‌మెంట్ ఉమన్ అండ్ చిల్డ్రన్ రూరల్ ఏరియాస్ - డీడబ్ల్యూఏసీఆర్‌ఏ) ఎప్పుడు ప్రారంభమైంది ? **- 1982 సెప్టెంబర్**
- గ్రామీణ మహిళల్లో పొదుపు ప్రవృత్తిని పెంచి, వారికి ఆర్థిక భద్రతను కల్పించడం కోసం 1993 అక్టోబర్ 2న ప్రారంభమైన పథకం ఏది ? **- మహిళా సంవృద్ధి యోజన (ఎంఎస్‌వై)**
- ఇందిరమ్మ పథకం ఎప్పుడు ప్రారంభమైంది ? **- 2006, ఏప్రిల్ 1**
- గర్భిణులు, పాలిచ్చే తల్లులకు ఆరోగ్య, పోషకాహార వృద్ధికి నగదు బదిలీ ద్వారా అందించడం కోసం కేంద్రప్రభుత్వం 2010 సంవత్సరంలో ప్రారంభించిన పథకం ఏది ? **- ఇందిరా మాతృత్వ సహయోగ్ యోజన (ఐజీఎంఎస్‌వై)**
- 11-18 సంవత్సరాల వయసుగల కౌమార దశ బాలికలకు మంచి పోషకాహారాన్ని అందించడం కోసం కేంద్రప్రభుత్వం 2010 నవంబర్ 19న ప్రారంభమైన పథకం ఏది ? **- రాజీవ్‌గాంధీ కౌమారదశ బాలికల సాధికారత పథకం**
- 2010 సంవత్సరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ చేపట్టిన మహిళా సాధికారత జాతీయ మిషన్ (ఎన్‌ఎంఈడబ్ల్యూ) కి ఏమని నామకరణం చేశారు ? **- మిషన్ పూర్ణ శక్తి**
- అహింసా మెసెంజర్ పథకం ఎప్పుడు ప్రారంభమైంది ? **- 2013 ఆగస్టు 31**
- భారతీయ మహిళా బ్యాంక్ (బీఎంబీ) ఎప్పుడు ప్రారంభమైంది ? **- 2013, నవంబర్ 19**
- భారతీయ మహిళా బ్యాంక్ మొట్టమొదటి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎవరు ? **- ఉషా అనంత సుబ్రమణ్యన్**
- బాలికలు స్కూల్లో పేరు నమోదు చేసుకొని, చదువు కొనసాగించేలా ప్రోత్సహించడం, కనీసం ఇంటర్ వరకు చదివేలా చేయడం కోసం 2005 ఏప్రిల్ 1న ప్రారంభించిన పథకం ఏది ? **- బాలికా శిశు సంరక్షణ పథకం**
- అభివృద్ధి అంతరాలను తగ్గించడానికి ప్రారంభించిన స్కీమ్ ఏది ? **- ఉన్నతి**
- గ్రామీణ ఆరోగ్యస్థాయి తక్కువగా ఉన్న 18 రాష్ట్రాలలో ప్రజలకు సమర్థవంతమైన ప్రాథమిక ఆరోగ్యాన్ని కల్పించడం కోసం 2005 ఏప్రిల్ 25న ప్రారంభించిన పథకం ఏది ? **- జాతీయ గ్రామీణ ఆరోగ్య కార్యక్రమం (నేషనల్ రూరల్ హెల్త్ మిషన్- ఎన్‌ఆర్‌హెచ్‌ఎం)**
- పేద కుటుంబాలకు చెందిన గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు, ఉచిత రవాణా సౌకర్యాలు కల్పించడం కోసం ప్రారంభించిన పథకం ఏది ? **- జననీ సురక్షా యోజన**
- జననీ సురక్షా యోజన పథకం కింద ఆడ శిశువు జన్మిస్తే ఆమె పేరుమీద ఎంత డబ్బును బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తారు ? **- రూ.5,000**
- దేశంలో వివిధ ప్రాంతాల్లో గల ఆరోగ్య అసమతౌల్యతను తగ్గించేందుకు ఉద్దేశించిన పథకం ఏది ? **- ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన**
- ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ఎప్పుడు ప్రారంభమైంది ? **- 2015 మే 9**
- ప్రతి సంవత్సరం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 1న 13 కేటగిరీల్లో విశిష్ట సేవలు అందించిన వారికి ఏ పురస్కారాన్ని ఇస్తారు ? **- వయోశ్రేష్ఠ సమ్మాన్**
- దీన్‌దయాళ్ వికలాంగుల పునరావాస పథకం ఎప్పుడు ప్రారంభమైంది ? **- 1999**
- ఎంఫిల్, పీహెచ్‌డీ లాంటి ఉన్నత చదువులు చదివే వారికోసం ఫెలోషిప్‌లు ఇస్తున్న పథకం ఏది ? **- రాజీవ్‌గాంధీ ఫెలోషిప్**
- గిరిజన ఉత్పత్తులను పెంచడం, వాటిని దళారుల నుండి కాపాడటంలో సహాయపడే దేశంలోనే అతిపెద్ద సహకార సంస్థ ఏది ? **- ట్రైబల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా**
- గిరిజన విద్యార్థులకు సీబీఎస్‌ఈ సిలబస్‌తో 2006 సంవత్సరంలో ప్రారంభమైన పాఠశాలలు ఏవి ? **- ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్**
- ప్రాథమిక, ఉన్నత స్థాయిలో గురుకుల పాఠశాలలను బాలికల కోసం 2004 జూలైలో ప్రారంభించిన పాఠశాలలు ఏవి ? **- కస్తూరిబా పాఠశాలలు**
- రోష్ని పథకాన్ని ఎవరు ప్రారంభించారు ? **- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ**
- ఇంజినీరింగ్ సాంకేతిక విద్య, సైన్స్ రంగాల్లో విదేశాల్లో పరిశోధన కొనసాగించడానికై గిరిజన విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించే పథకం ఏది ? **- నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ స్కీమ్ ఫర్ హయ్యర్ స్టడీస్ అబ్రాడ్**
- పారిశుధ్య కార్మికులను విముక్తి చేసి, ప్రత్యామ్నాయ సదుపాయాలను ఏర్పాటు చేయడం కోసం 1997 సంవత్సరంలో ప్రారంభమైన పథకం ఏది ? **- జాతీయ సఫాయి కర్మచారి కమిషన్**
- అన్నపూర్ణ పథకాన్ని కేంద్రప్రభుత్వం ఎప్పుడు ప్రారంభించింది ? **- 2000 ఏప్రిల్ 1**
- పేదల్లో నిరుపేదలను గుర్తించి, అధిక సబ్సిడీపై ఆహార ధాన్యాలను అందించడానికి 2000, డిసెంబర్‌లో కేంద్రప్రభుత్వం ప్రారంభించిన పథకం ఏది ? **- అంత్యోదయ అన్న యోజన (ఏఏవై)**
- రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన (ఆర్‌ఎస్‌బీవై) పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు ? **- 2007, అక్టోబర్ 1**
- పట్టణ గ్రామీణ ప్రాంతాల్లోని 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సున్న వారికి బీమా సౌకర్యం కల్పించడం కోసం 2000 ఆగస్టు 10న ప్రారంభమైన పథకం ఏది ? **- జనశ్రీ బీమా యోజన**
- గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని పేద కుటుంబ యజమానులకు బీమా కల్పించడం కోసం 2007, అక్టోబర్ 2న ప్రారంభమైన పథకం ఏది ? **- ఆమ్ ఆద్మీ బీమా యోజన**
- వరండాలో రెండు పక్కల గదులు, బాలురు బాలికలకు మౌలిక సదుపాయాలు, త్రాగునీటి సదుపాయం మొదలైనవి ఏర్పాటు చేయడం కోసం 1987-88లో ప్రారంభించిన పథకం ఏది ? **- ఆపరేషన్ బ్లాక్ బోర్డ్**
- భారత రాజ్యాంగ సవరణ 86 ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల లోపు వయస్సుగల పిల్లలకు ఉచిత, తప్పనిసరి విద్యను అందించడం కోసం 2001-2002 సంవత్సరంలో కేంద్రప్రభుత్వం ప్రారంభించిన పథకం ఏది ? **- సర్వశిక్ష అభియాన్**
- సర్వశిక్ష అభియాన్ పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా నిష్పత్తి ? **- 85 : 15**
- డ్రాప్ ఔట్ రేటును తగ్గించి, నమోదు రేటులను 9,10 తరగతుల్లో 75% పెంచడానికి 2009, మార్చిలో ప్రారంభించిన పథకం ఏది ? **- రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్**
- 2009 సెప్టెంబర్ 8న ప్రారంభమైన "సాక్షర భారత్"ను గతంలో ఏమని పిలిచేవారు ? **- నేషనల్ లిటరసీ మిషన్**
- ఉన్నతస్థాయి విద్యను అభివృద్ధిపరచడానికి 2013 సంవత్సరంలో ప్రారంభించిన "రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్" పథకానికి అయ్యే ఖర్చులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిష్పత్తి ఎంత ? **- 65: 35**
- పట్టణ నిరుద్యోగిత, అల్ప నిరుద్యోగితలను నిర్మూలించి ఉద్యోగిత ద్వారా పేదరికాన్ని నిర్మూలించడం కోసం 1989 అక్టోబర్‌లో ప్రారంభమైన పథకం ఏది ? **- నెహ్రూ రోజ్‌గార్ యోజన**

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
155.06 ▲	44.45 ▲	-15 ▲	30,210	100 ▲	41,300	69.72
35,850.16	10,771.80	30,015	ప్రొద్దుటూరు 30,210	40,100	ప్రొద్దుటూరు 42,442	
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
భారతీ ఇన్‌ఫ్రాటెల్	293.75	3.05
యాక్సిస్ బ్యాంక్	637.45	2.88
టాటామోటార్స్	175.35	2.57
ఎన్‌టీపీసీ	149.70	1.96
గ్రాసిం	824.80	1.80

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఇండియాబుల్స్	793.90	-4.33
బజాజ్ ఆటో	2,658.55	-2.77
రెడ్డీల్యాబ్స్	2,558.65	-1.59
ఐషర్ మోటార్స్	20,477.00	-1.36
ఎస్‌బ్యాంక్	194.40	-1.32

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	70.19	69.72
యూరో	79.63	79.47
పౌండ్	88.16	88.26
ఆస్ట్రేలియా డాలర్	48.89	49.12
సింగపూర్ డాలర్	51.38	51.22

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	30,210	32,310
చెన్నై	30,210	32,310
బెంగళూరు	29,680	31,743
ముంబై	31,280	33,454
విజయవాడ	-	32,850
విశాఖపట్నం	30,210	32,620
ప్రొద్దుటూరు	30,210	31,720
ముడి చమురు	57.06	

ఏటీఎంలను వట్టిపోనివ్వకండి

- నగదు నిండేలా చర్యలు తీసుకోండి
- ఆర్బీఐకి సూచించిన పార్లమెంటరీ ప్యానెల్



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా నగదు లేకుండా దర్శనమిస్తున్న ఏటీఎంలపై పార్లమెంటరీ ప్యానెల్ స్పందించింది. ఈ సమస్యను పరిష్కరించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు సూచించింది. ఈ పరిస్థితి ద్రవ్య కొరతకు దారితీయవద్దన్న కమిటీ.. నగదు నిండుగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశిం చింది. అలాగే తగినన్ని ఏటీఎంలను అందుబాటులోకి తీసుకురావాలని బ్యాంకులనూ కోరింది. ఔట్ ఆఫ్ సర్వీస్ ఏటీఎంలనూ బాగుచేయాలన్న కమిటీ.. బ్యాంకు ల ద్వారా జన్ ధన్ ఖాతాలు పెద్ద ఎత్తున తెరుచుకున్నా యని, ఆ కస్టమర్లకు సరిపడా ఏటీఎంలు లేకుండా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆర్థిక వ్యవహారా లపై ఏర్పాటైన ఈ స్టాండింగ్ కమిటీ గత వారం పార్లమెంట్‌లో తమ నివేదికను ప్రవేశపెట్టింది. ఆర్బీఐ గణాంకాల ప్రకారం గతేడాది సెప్టెంబర్ నాటికి దేశం లో 2,21,492 ఏటీఎంలున్నాయి. ఇందులో 1,43,844 ఏటీఎంలు ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందినవైతే, 59,645 ఏటీఎంలు ప్రైవేట్ రంగ బ్యాం కులవి, 18,003 విదేశీ బ్యాంకులు, పేమెంట్స్ బ్యాంకులు, చిన్నతరహా ఆర్థిక బ్యాంకులతోపాటు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలకు చెందిన, నిర్వహిస్తున్న వైట్ లేబుల్ ఏటీఎంలున్నాయి. కాగా, డిజిటల్ లావాదేవీలు తగ్గుముఖం పట్టి, తిరిగి సంప్రదాయ నగదు లావాదేవీలు పెరుగుతున్నాయని అభిప్రాయపడ్డ పార్లమెంటరీ కమిటీ.. ఏటీఎంలలో నగదు లభ్యత లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నది. గ్రామీణ, తృతీయ, ద్వితీయ శ్రేణి పట్టణాల్లో ఏటీఎంలు చాలావరకు నో క్యాష్ బోర్డులతో కనిపిస్తున్నా యన్నది. ఈ కమిటీకి కాంగ్రెస్ సీనియర్ నేత ఎం వీరప్ప మొయిలీ నాయకత్వం వహిస్తున్నారు.

కొత్త నియామకాలు చేపట్టండి

పదవీ విరమణలతో ఖాళీ అవుతున్న స్థానాలను కొత్త నియామకాలతో భర్తీ చేయాలని ప్రభుత్వ రంగ బ్యాంకులకు పార్లమెంటరీ ప్యానెల్ సూచించింది. సమీప భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యోగులు రిటైర్ కానుండటంతో జూనియర్, మధ్య స్థాయిల్లోని వారితో ఆ లోటును పూడ్చుకోవాలన్నది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20)లో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని 95 శాతం జీఎం స్థాయి ఉద్యోగులు, 75 శాతం డిప్యూటీ జీఎం స్థాయి ఉద్యోగులు, 58 శాతం అదనపు జీఎం స్థాయి ఉద్యోగులు పదవీ విరమణ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో బ్యాంకింగ్ సిబ్బంది ఎంపిక ఇనిస్టిట్యూట్ వివరాల ప్రకారం క్లరికల్, ప్రొబేషనరీ ఆఫీసర్, స్పెషలిస్ట్ ఆఫీసర్ స్థాయిల్లో ఉద్యోగుల సంఖ్య పడిపోతున్నదన్న కమిటీ.. ఎక్కువ పని గంటలు, ఒత్తిడితో కూడిన విధులు, తక్కువ వేతనాలు వంటివి బ్యాంకింగ్ రంగ ఉద్యోగార్థులకు నిరుత్సాహకరంగా ఉన్నాయని పేర్కొన్నది. కాబట్టి ఈ అంశాలపై దృష్టి సారించి సమస్యను అధిగమిస్తే బాగుంటుందని సూచించింది.

మరో 69 విదేశీ కార్యాలయాలు మూత!

ప్రభుత్వరంగ బ్యాంకుల యోచన

ప్రభుత్వరంగ బ్యాంకులు మరో కీలక నిర్ణయం తీసుకున్నాయి. విదేశాల్లో ఉన్న శాఖల ద్వారా అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలో నేపథ్యంలో ఇప్పటికే పలు బ్యాంకులు శాఖలను మూసివేయగా..తాజాగా మరో 69 శాఖలను మూసివేయడానికి సిద్ధమయ్యాయి ప్రధాన బ్యాంకులు. పునర్ వ్యవస్థీకరణలో భాగంగా వచ్చే కొన్ని నెలల్లో ఈ శాఖలకు తాళం వేయనున్నట్లు ప్రకటించాయి. ఇప్పటికే 35 బ్రాంచ్‌లను మూసివేసిన బ్యాంకు లు..మరో 69ని మూసివేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. విదేశాల్లో శాఖలను నిర్వహించడం చాలా ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ అని, అలాగే పలు శాఖలు ఉన్న ఒకే నగరంలో వీటిని కుదించాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. జనవరి 31, 2018 నాటికి 165 విదేశాల్లో శాఖలు నిర్వహిస్తున్నాయి ప్రభుత్వరంగ బ్యాంకులు. వీటిలో అత్యధికంగా ఎస్‌బీఐ 52 శాఖలను ఏర్పాటు చేయగా, బ్యాంక్ ఆఫ్ బరోడా 50, బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 29లు ఉన్నాయి. దేశాల విషయానికి వస్తే బ్రిటన్‌లో 32 శాఖలను ఏర్పాటు చేసిన పీఎస్‌బీలు..హాంకాంగ్, అరబ్ దేశాల్లో 13 చొప్పున, సింగపూర్‌లో 12లు నిర్వహిస్తున్నాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో 41 శాఖలు మూతపడ్డాయి. వీటిలో ఎస్‌బీఐ తొమ్మిదింటిని మూసివేయగా, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎనిమిది, బ్యాంక్ ఆఫ్ బరోడా ఏడు శాఖలకు తాళం వేశాయి.

విజ్ఞానం

కృత్రిమ తీపి పదార్థాలతో బరువుపై నో కంట్రోల్




కృత్రిమ తీపి పదార్థాల వినియోగంతో బరువు తగ్గేందుకు ఏ విధంగానూ తోడ్పడవని తెలు స్తోంది. షుగర్ ఫ్రీ పదార్థాలు సుగర్ లేకుండా సహకరిస్తాయి కానీ, బరువు తగ్గేందుకు ఎటు వంటి ఆధారం లేదు. సుగర్ ఫ్రీ పదా ర్థాలు తక్కువగా తీసుకుంటే కూడా బరువు పెరిగే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. బిఎమ్‌జె జర్నల్‌లోని ప్రచురణ ఆధారంగా షుగర్ ఫ్రీ వంటి వాడకంతో బరువు తగ్గుతున్నట్లు ఎటువంటి ఆస్కారం లేదని వెల్లడించింది. ఆరోగ్య కరమైన జీవన విధానం, శైలి ద్వారా మాత్రమే ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. షుగర్ అధికంగా ఉన్న ఆహారం, ఉప్పు లేక కొవ్వు పదార్థాలు సుగర్ ఫ్రీ ఉన్నకూల్ డ్రింక్స్ వాడకం ఎక్కువ కావడంతో ఆరోగ్యంపై పెనుప్రభావం చూపుతోంది. నాన్ సుగర్ స్వీటెనర్స్ వినియోగానికి అమోదం తెలిపినప్పటికీ తక్కువ మందికి మాత్రమే వీటివలన ఉపయోగాలు, హాని తెలిసే అవ కాశం ఉంది. రోజువారీ ఆహారంలో వీటి వినియోగంతో ఇవన్నీ మరింత పాపులర్ అయిన విషయం తెలిసిందే... ఆరోగ్యంగా ఉన్న మధ్య వయస్కులు, పిల్లలపై 56 పరిశోధనల్లో నాన్ సుగర్ ఐటెమ్స్ ఎక్కువగా తీసుకోవడం, పరిమితంగా తీసుకోవడంపై పరిశోధన జరిగింది. వారి వయసు, బ్లడ్ సుగర్ కంట్రోల్, ఓరల్ హెల్త్, కేన్సర్, కార్డియో వాస్కులార్ వ్యాధులు, కిడ్నీ వ్యాధులు, మూడ్స్‌పై పరిశోధన చేయగా నాన్ సుగర్ ఐటెమ్స్ తక్కువగా వినియోగించిన వారిలో ఎక్కువగా వినియోగించిన వారితో పోల్చి చూసుకుంటే బరువు తక్కువగానే పెరిగినట్లు తెలుస్తోంది. చిన్నారుల్లో నాన్ సుగర్ స్వీటెనర్స్‌తో బరువు పెరిగినట్లుగా గుర్తించారు.

లాభాల్లో సెన్సెక్స్

ఐటీ, రియాల్టీ, బ్యాంకింగ్ స్టాక్స్ అండ

న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్లు వారం ప్రారంభం ఆరంభంలోనే అదరగొట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల పరిణామాలు, దేశీయంగా పెరిగిన కొనుగోళ్ల ఒత్తిడితో బీఎస్ఈ సెన్సెక్స్ ఆరంభంలోనే 300 పాయింట్లు ఎగబాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం మరోసారి 10,800 పాయింట్లు ఎగువన ట్రేడ్ అవు తోంది. వరుసగా రెండవ సెషన్‌లో మార్కెట్లు ఐటి, రియాల్టీ, బ్యాంకు స్టాక్స్ అండతో లాభాల్లో నమోద య్యాయి. దేశీయ మదుపరుల కొనుగోళ్ల అండతో మార్కెట్లు లాభాల్లో ముగిసాయి. ఆసియా మార్కెట్లు స్థిరంగా కొనసాగుతుండడంతో పాటు అమెరికా-చైనా వాణిజ్య చర్చలు ఇన్వెస్టర్ల సెంటిమెంటుకు ఊతమిచ్చి నట్టు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 155.06పాయింట్లతో 0.43శాతంతో 35,850 పాయింట్లు నమోదుచేసింది. నిఫ్టీ 49.25పాయింట్లతో 0.46శాతంతో 10,776.60పాయింట్లు నమోదు చేసింది. సెన్సెక్స్ అత్యధికంగా 386పాయింట్ల లాభాన్ని నమోదుచేయగా, నిఫ్టీ 108 పాయింట్లతో 10,835 పాయింట్లు నమోదుచేసింది. బిఎస్ఇ మిడ్‌కాప్, స్మాల్‌కాప్ సూచీలు 0.03శాతం, 0.06శాతం లాభాల్ని నమోదుచేసాయి. 29సెక్టరల్ సూచీల్లో 14బిఎస్ఇ సూచీల్లో రియాల్టీ, ఐటి,టెక్, యుటిలిటీస్, పవర్,1 శాతం పైగా లాభాల్ని నమోదుచేసాయి. హెల్త్‌కేర్, ఇండస్ట్రియల్స్, ఆటో, క్యాపి టల్ గూడ్స్, మెటల్ నష్టాల్లో నమోదయ్యాయి. యాక్సిస్ బ్యాంకు, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్, టైటాన్, మారుతి సుజుకి, ఎన్‌టిపిసి టాప్ గెయినర్స్ కాగా కీలకసూచీలైన బజాజ్ ఆటో, హీరో మోటాకార్ప్, బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, యస్ బ్యాంకు, ఎస్‌బీఐ మేజర్ లూజర్స్‌గా ఉన్నారు. అంతర్జాతీయ రంగంలో యుఎస్ ఈక్విటీ ఫ్యూచర్స్, యూరోపియన్ స్టాక్స్ లాభాల్లో నమోదుకాగా ఆసియా షేర్లు ర్యాలీని నమోదుచేసాయి. చమురు దరలు 1శాతంపైగా లాభాల్లో నమోదయ్యాయి.

జోరందుకున్న వెండి,బంగారం



న్యూఢిల్లీ: పసిడి, వెండి ధరలు పెరి గాయి. కొనుగోలు దారుల అండతో సోమ వారం బంగారం ధర పెరిగింది. రూ.150 పెరగడంతో పది గ్రా ముల బంగారం ధర రూ.32,650కి చేరింది. అంతర్జా తీయ పరిణామాలు, డాలరు విలువ పడిపోవడంతో పాటు బంగారు ఆభరణాల తయారీదారుల దగ్గర నుంచి డిమాండ్ ఊపందుకోవడంతో పసిడిధర పుంజుకున్నట్లు బులియన్ మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. పసిడి బాటలోనే వెండి పయనిస్తోంది. గత వారం స్వల్పంగా తగ్గిన వెండి ధర మళ్లీ పుంజుకొని రూ.40వేల మార్క్‌ను దాటింది. రూ.410 పెరగడంతో కేజీ వెండి రూ.40,010కి చేరింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల దగ్గర నుంచి డిమాండ్ రావడంతో వెండి ధర పెరిగినట్లు ట్రేడర్లు చెబుతున్నారు. అటు అంతర్జాతీయంగా పసిడి ధర పెరుగుదలను నమోదు చేసుకుంది. న్యూయార్క్ మార్కెట్లో బంగారం ధర 0.33శాతం పెరగడంతో ఔన్సు 1,289.50 డాలర్లు పలుకుతోంది.

పెరిగిన ప్రత్యక్ష పన్నుల వసూళ్లు

న్యూఢిల్లీ: ఏప్రిల్-డిసెంబరు 2018 మధ్య ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 14.1శాతం పెరిగినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీనికి సంబంధించిన తాజా గణాంకాలను సోమవారం విడుదల చేసింది. మొత్తం రూ.8.74లక్షల కోట్ల మేర ప్రత్యక్ష పన్నులు వసూలు అయినట్లు ఆర్థిక శాఖ పేర్కొంది. ఇక పన్ను రీఫండ్లు రూ.1.30లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇవి 17శాతం అధికమని ఆర్థిక శాఖ వెల్లడించింది. ఇక అడ్వాన్స్ ట్యాక్స్ కింద రూ.3.64లక్షల కోట్లు వసూలయ్యాయి. ఏడాది క్రితం ఇదే సమయంతో పోలిస్తే ఇవి14.5శాతం అధికం. రీఫండ్లను జారీ చేసిన అనంతరం నికర వసూళ్లు రూ.7.43లక్షల కోట్లుగా ఉన్నాయి. బడ్జెట్‌లో నిర్దేశించుకున్న ప్రత్యక్ష పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.11.50లక్షల కోట్లలో ఇది 64.7శాతంగా ఉన్నట్లు ఆర్థికశాఖ తెలిపింది. ఏప్రిల్-డిసెంబరులో కార్పొరేట్ ఆదాయ పన్ను 14.8శాతం, వ్యక్తిగత ఆదాయ పన్ను 17.2శాతం వ ృద్ధి చెందాయి. రీఫండ్‌లను పరిగణనలోకి తీసుకున్న అనంతరం వ్యక్తిగత ఆదాయపు పన్నుల వసూళ్లలో నికరంగా 14.8శాతం వ ృద్ధి ఉండగా, కార్పొరేట్ పన్ను వసూళ్లు 16శాతం పెరిగాయి. ఏడాది క్రితం వసూళ్లలో ఆదాయం వెల్లడి పథకం కింద వచ్చిన రూ.10.844కోట్లు ఉన్నాయని, ఈ ఆర్థిక సంవత్సరంలో అవి లేవని ఆర్థిక శాఖ పేర్కొంది.

ఐదు నెలల గరిష్టానికి రూపాయి



ముంబై: డాలర్ మారకంతో రూపాయి ఐదు నెలల గరిష్టానికి చేరింది. 0.54శాతం పెరిగి రూ పాయి 69.39 వద్ద ముగిసింది. అంతకుముందు 69.73 వద్ద ముగిసిన రూపాయి ప్రారం భంలో 69.42 వద్ద ప్రారంభమై ఒక దశలో 69.36 వద్ద చేరింది. అమెరికా, చైనాల మధ్య తలెత్తిన వాణిజ్య యుద్ధం నేపథ్యంలో డాలర్ విలువ తగ్గిందని చెప్ప వచ్చు. ఈ ఏడాది మార్చిలో వెలువడనున్న జీడీపీ 7.2శాతం నమోదుకావచ్చునని అంచనావేస్తోంది. ఈ నెల అనంతరం చైనా ఉపాధ్య క్షుడితో ట్రంప్ సమా వేశం దావోస్‌లో జరగనుంది. ఈ ఏడాది ఇప్పటివరకు రూపాయి 0.86శాతం దిగజారింది. విదేశీ మదు పరులు 145.20 మిలియన్ డాలర్ల ఈక్విటీలను అమ్మి నట్లు నమోదైంది. ఆసియా కరెన్సీలు అత్యధికంగా నమోదయ్యాయి. ఇండోనేషియన్ రూపయ 1.3శాతం, మలేషియన్ రింగిట్ 0.61 శాతం, సౌత్ కొరియన్ వన్ 0.46శాతం, జపనీస్ యెన్ 0.36శాతం, చైనా రెన్మింబిని 0.36శాతం, ఫిలిప్పైన్స్ పెసో 0.30శాతం, చైనా ఆఫ్‌షోర్ 0.19శాతం, తైవాన్ డాలర్ 0.16శాతం పెరిగాయి.


మార్కెట్లోకి లారెట్ 'డియాన్‌ఎక్స్'



న్యూఢిల్లీ: లండన్‌కు చెందిన లారెట్ ఆటోమోటివ్ కార్పొరేషన్ భారత మార్కెట్లోకి ప్రవేశించే సన్నాహాల్లో ఉంది. ఇందులో భాగంగా 2021నాటికి తన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ డియాన్‌ఎక్స్‌ను విడుదల చేయాలని భావిస్తోంది. ఈ కంపెనీ పుదుచ్చేరిలో 37 కోట్ల డాలర్ల (సుమారు రూ.2,577 కోట్లు) పెట్టుబడితో వాహనాల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసే పనిలో ఉంది. తొలుత ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 10,000 వాహనాలుగా ఉంటుంది. 2023 నాటికి ఈ సామర్థ్యాన్ని 23,000 వాహనాలకు పెంచాలని కంపెనీ భావిస్తోంది. డియాన్‌ఎక్స్ దాని విడిభాగాలను ఈ ప్లాంట్‌లోనే తయారు చేసి అసెంబుల్ చేయనున్నారు. 2021నాటికి ఈ ప్లాంట్ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉందని కంపెనీ సీఈఓ మార్కస్ పలేటి తెలిపారు. డియాన్‌ఎక్స్‌ను ఒకసారి చార్జింగ్ చేస్తే 540 కిలో మీటర్ల వరకు ప్రయాణించవచ్చని ఆయన చెప్పారు. 2021 సంవత్సరంలో భారత్‌తో పాటు యూరోపియన్ మార్కెట్లలోనూ ఏకకాలంలో విడుదల చేస్తామని ఆయన తెలిపారు. రెండు వేరియంట్లలో డియాన్‌ఎక్స్ అందుబాటులో ఉంటుందని, ధర రూ.40 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. 5.4 సెకన్ల వ్యవధిలోనే ఈ మోడల్ 0-100 కిలో మీటర్ల వేగాన్ని అందుకుంటుందని చెప్పారు. ఈ ఎస్‌యూవీలో అత్యాధునిక ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఇంటిగ్రేషన్ ఉంటుందని చెప్పారు.

ప్రైవేట్ లేబుల్స్ అమ్మకాలొద్దు

- ఈ-కామర్స్ సంస్థలకు అవకాశం ఇవ్వొద్దు
- డీఐపీపీని కోరిన ట్రేడర్ల సమాఖ్య



న్యూఢిల్లీ: ఈ-కామర్స్ సంస్థల సైట్లపై ప్రైవేట్ లేబుల్స్ అమ్మకాలకు అనుమతి ఇవ్వొద్దని పారిశ్రామిక విధాన ప్రోత్సాహక శాఖ (డీఐపీపీ)ను అఖిల భారత వర్తకదారుల సమాఖ్య (సీఏఐటీ) ఆదివారం కోరింది. ఈ మేరకు డీఐపీపీ కార్యదర్శి రమేశ్ అభిషేక్‌కు సీఏఐటీ ఓ లేఖ రాసింది. ఓ సంస్థ బ్రాండ్ కింద మరో సంస్థ తయారుచేసిన ఉత్పత్తులనే ప్రైవేట్ లేబుల్స్ అంటా రు. ప్రైవేట్ లేబుల్స్ ఉత్పత్తులు, సేవలు సహజంగా తక్కువ ధరలకు లభిస్తాయి. ప్రముఖ సంస్థలకు చెందిన ఈ తరహా ఉత్పత్తులు, సేవల విలువ కంటే ప్రైవేట్ లేబుల్స్ ప్రోడక్ట్స్, సర్వీసులు చౌకగా అందుబాటులో ఉంటాయి. దీంతో వినియోగదారులు వీటి కొనుగోళ్లకే ఆసక్తి కనబరుస్తున్నారు. గడిచిన కొన్నేండ్ల నుంచే ఈ-కామర్స్ సంస్థలు దుస్తులు, గృహాలంకరణ, గ్రాసరీ వంటి ఉత్పత్తుల్లో ప్రైవేట్ లేబుల్స్‌ను మార్కెట్‌కు పరిచయం చేసేశాయి. ఫలితంగా పెద్దపెద్ద సంస్థల అమ్మకాలు ప్రభావితమయ్యాయని సీఏఐటీ గుర్తుచేసింది. మార్కె ట్‌లో ఆరోగ్యకరమైన పోటీని ప్రైవేట్ లేబుల్స్ చంపే స్తున్నాయని చెప్పింది. ప్రభుత్వ ఖజానాకూ ఇది తీవ్ర దెబ్బేనని, పెట్టుబడులకూ భంగకరమని వ్యాఖ్యా నించింది.

ఫిబ్రవరి 1 నుంచే అమలవ్వాలి..

ఈ-కామర్స్ రంగం కోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పాలసీలో చేసిన మార్పుల అమలుకు నిర్దేశించిన గడువును పొడిగించవద్దని కూడా సీఏఐటీ విజ్ఞప్తి చేసింది. వచ్చే నెల 1 నుంచి ప్రతిపాదిత సవరణలు అమల్లోకి వస్తాయని కేంద్ర వాణిజ్య, పరిశ్ర మల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితే కొన్ని విదేశీ బహుళజాతి సంస్థలు అమలు తేదీని 4-5 నెలలు పొడిగించాలని కోరుతున్న నేప థ్యంలో అలాంటి నిర్ణయం తీసుకోవద్దని లేఖలో కోరింది. విధానపరమైన నిర్ణయాల్లోగల లోపాలను అడ్డం పెట్టుకుని ఈ-కామర్స్ కంపెనీలు అక్రమాలకు తెరతీయాలని ప్రయత్నిస్తున్నట్లు సీఏఐటీ ఈ సందర్భంగా ఆరోపించింది. తద్వారా చిరు వ్యాపారుల ఉనికే ప్రమాదంలో పడిపోయే వీలుందని ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు శరవేగంగా విస్తరిస్తున్న ఈ-కామర్స్ పరిశ్రమకు ఊతమిచ్చేలా దేశ, విదేశీ సంస్థలకు ఒకే రకమైన నియమ నిబంధనలను ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉన్నదని రిసెర్చ్, అడ్వొకసి సంస్థ సీయూటీఎస్ ఇంటర్నేషనల్ అభిప్రాయపడింది.

సింగరేణి బొగ్గు 45 మిలియన్ టన్నులు

ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలంలో ఉత్పత్తి చేసిన సంస్థ

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన బొగ్గు సంస్థ సింగరేణి ఉత్ప త్తిని గణనీయంగా పెంచుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి మూడు త్రైమాసి (ఏప్రిల్-డిసెంబర్) కాలంలో 45.57 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. నిర్దేశించుకున్న లక్ష్యాని కంటే 2.24 మిలియన్ టన్నులు తక్కు వగా ఉత్పత్తి చేసింది. ఈ తొమ్మిది నెలలకాలంలో 47.51 మిలియన్ టన్నుల ఉత్పత్తిని కంపెనీ గతంలో లక్ష్యంగా పెట్టుకుంది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో ఉత్పత్తి చేసిన 41.99 మిలియన్ టన్నులతో పోలిస్తే మాత్రం గణనీయంగా పెంచుకున్నది. గత నవంబర్, డిసెం బర్ నెలల్లో వరుసగా 5.67 మిలియన్ టన్నులు, 6.04 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేసింది. 49.11 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా చేయ్యాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ..దీంట్లో 49.06 మిలియన్ టన్నులను సరఫరా చేసింది. మరోవైపు, దేశంలో బొగ్గు కొరత లేదని, 2014లో 217 మిలియన్ టన్నులు దిగుమతి కాగా, ప్రస్తుతం ఇది 208 మిలియన్ టన్నులకు తగ్గిందని ఇటీవల లోక్ సభలో కేంద్ర బొగ్గు శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్స రంలో ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 7.4 శాతం బొగ్గు ఉత్పత్తి పెరిగిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థయైన సింగరేణిలో కేంద్రానికి 51 శాతం వాటా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నది.

మహారాష్ట్ర వాటా 24 శాతానికి పైనే..

దేశంలోని మొత్తం రుణాల్లో: ఆర్బీఐ

ముంబై: గత ఆర్థిక సంవత్సరంలో వివిధ బ్యాంకుల నుంచి దేశంలో మంజూరైన రుణాల్లో మహారాష్ట్రదే అధిక వాటాగా ఉన్నది. భారత రిజర్వు బ్యాంకు(ఆర్బీఐ) విడుదల చేసిన 'బేసిక్ స్టాటిస్టికల్ రిటర్న్స్ ఆఫ్ షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్స్ ఇన్ ఇండియా' నివేదికలో ఈ విషయం వెల్లడైంది. గత ఆర్థిక సంవత్సరం 2017-18లో(మార్చి 31, 2018కి అందిన సమాచారం మేరకు) బ్యాంకుల నుంచి దేశంలో మొత్తం రూ.87.67 లక్షల కోట్ల మేర రుణాలు అందాయి. ఇందులో 21.56 లక్షల కోట్ల రుణాలు పారిశ్రామిక రంగానికి మారు పేరైన మహారాష్ట్రకు మంజూరయ్యాయి. దేశంలోని మొత్తం వాటాలో ఇది 24.6శాతం అన్న మాట. బ్యాంకుల నుంచి మహారాష్ట్ర పొందిన మొత్తం రుణాల్లో అధికభాగం 39.6శాతం(8.53 లక్షల కోట్లు)మేర రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కేటాయించింది. ఇక మిగిలిన రంగాలలో నిర్మాణం(9.15శాతం), బేసిక్ మెటల్స్(6.24శాతం), విద్యుత్, గ్యాస్, నీరు(5.44శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కాగా, వ్యవసా యరంగంపై మాత్రం బీజేపీ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఈ రంగంపై కేవలం 4.3శాతం(రూ.92,707 కోట్లు) మాత్రమే ఆ రాష్ట్రం కేటాయించింది. వ్యవసాయ రంగానికి దేశంలో కేటాయించిన సగటు 13.68శాతం కంటే తక్కువగా కేటాయించడం గమనార్హం.

16 విమానాశ్రయాల్లో ప్లాస్టిక్ నిషేధం

న్యూఢిల్లీ : ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) 16 విమానాశ్రయాల్లో ఒక సారి మాత్రమే వాడే ప్లాస్టిక్ వస్తువులను నిషేధించింది. ఇకపై స్ట్రాలు, ప్లాస్టిక్ ప్లేట్లు వంటి వాటిని పాసింజర్ టెర్మినల్స్‌లో అనుమతించరు. ఇండోర్, భోపాల్, అహ్మదాబాద్, విజయవాడ, తిరుపతి, భువనేశ్వర్, తిరుచ్చి, డెహ్రాడూన్, వడోదరా, చండీగర్, రాయ్‌పూర్, మధురై, పూణే, వైజాగ్, కోల్‌కటా, వారణాసి విమాశ్రాయాల్లో ఈ నిభందన అమలుకానుంది. ఏడాదికి 10 లక్షల కంటే ఎక్కువ ప్రయాణికులు కలిగిన 34 విమాశ్రయాలలో ఈ నిభందన అమలు చేయనున్నట్లు, దీన్ని ఈ నెల 31లోగా అమల్లోకి తేనున్నట్లు, తొలి విడుతలో భాగంగా ఈ 16 విమాశ్రయాలను ఎంపిక చేశామని, ఈ ఎంపిక ప్రక్రియను క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చేపట్టునట్లు ఏఏఐ అధికారులు తెలిపారు.

ఉడాన్ పథకంలో కొత్త మార్గాలు

న్యూఢిల్లీ : సామాన్య ప్రజలకు చౌక ధరలకు విమానయాన ప్రయాణం అందించేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉడాన్ పథకం మూడో విడతలో భాగంగా 111 విమాన మార్గాల కొరకు 15 విమానయాన కంపెనీల నుంచి బిడ్లు అందినట్లు అధికారులు తెలిపారు. మొత్తం కంపెనీల్లో 6 కంపెనీలు కౌంటర్ బిడ్డింగ్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. స్పైస్ జెట్ 37, ఇండిగో 20, గొడావట్ ఎంటర్‌ప్రైజస్ 15 మార్గాల కోసం మూడో రౌండు వేలంలో పాల్గొన్నాయని, హెలీకాప్టర్ మార్గాలను ఉడాన్ 3 లోకి తీసుకురాలేదని, ఉడాన్ 2లో మార్గాలను ఇంకా అమల్లోకి తీసుకురాని కారణంగానే వీటిని నిలిపివేశామని తెలిపారు. గువహిటి విమానాశ్రయం నుంచి ఢాకా, బ్యాంకాక్ మార్గాలకు ఉడాన్ పథకంలో అంతర్జాతీయి విమాన సర్వీసులు నడుపనున్నట్లు తెలిపారు.


ఐటీ కోసం రూ.2.59 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకోసం పెట్టే ఖర్చు రోజురోజుకు అధికమవుతున్నది. ప్రస్తుత సంవత్సరంలో ఐటీ ఖర్చు 11.9 శాతం పెరిగి రూ.2,59,762 కోట్లకు చేరుకోనున్నదని కోయిన్ ఏజ్ కన్సల్టింగ్ అంచనావేస్తున్నది. ముఖ్యంగా కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వాలు డిజిటల్ రంగానికి పెద్దపీట వేస్తుండటం ఇందుకు దోహదం చేస్తున్నదని తెలిపింది. 2017 నుంచి విశ్లేషిస్తే..పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత టెక్నాలజీ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని, ఆ తర్వాతి ఏడాదిలో ఐటీ రంగం తిరిగి వృద్ధిలోకి వచ్చిందని కోయెన్ ఏజ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి కపిల్ దేవ్ సింగ్ తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచిన ఐటీ రంగం ప్రస్తుత సంవత్సరంలో కూడా ఇదే తీరు వృద్ధిని నమోదు చేసుకునే అవకాశం ఉన్నదన్నారు. 108 మంది పెద్ద, మధ్యస్థాయి దేశీయ ఎంటర్‌ప్రైజెస్‌లకు చెందిన చీఫ్ ఇన్ఫర్మేషన్ అధికారులు/ఐటీ విభాగ అధిపతుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను తయారుచేసింది.

మానవ మస్తిష్క రూపురేఖలను వెలుగులోకి తెచ్చి, నోబెల్ పొందిన

డాక్టర్ వాల్టర్ రుడాల్ఫ్ హెస్





20వ శతాబ్దం పూర్వార్థంలోనే మానవ మెదడుపై పరిశోధనలు మొదలయ్యాయి. శరీరంలో వివిధ అవయవాల పనితీరు తెలుసుకోవాలంటే మెదడు నుండి వాటికి సంకేతాలు ఏ విధంగా వస్తున్నాయో తెలుసుకోవడం అవసరం అయింది. అంతేకాదు, మెదడులో ఏ భాగం నుండి వివిధ అవయవాలకు సంకేతాలు ఏ విధంగా అందుతున్నాయో ఖచ్చితంగా తెలుసుకోవాలంటే సంక్లిష్టమైన మెదడు గురించి వివరంగా, ఖచ్చితంగా పరిశోధించవలసిన అవసరం స్పష్టం అయింది.

స్విట్జర్లాండ్ దేశస్తుడు, ఫిజియాలజీలో నిష్ణాతుడు అయిన వాల్టర్ రుడాల్ఫ్ హెస్ ఈ రంగంలో మెదడుపై పరిశోధన చేసి విప్లవాత్మకమైన మార్పులకు మార్గదర్శకుడయ్యాడు.

వాల్టర్ హెస్ 1881 మార్చి 17న స్విట్జర్లాండ్‌లోని ఫ్రాన్స్ ఫీల్డ్‌లో జన్మించాడు. చిన్నతనం నుండీ అత్యంత ప్రతిభావంతుడైన విద్యార్థిగా పేరుపొందాడు. సైన్సురంగంలో అతని అభిరుచిని గుర్తించి, తండ్రి సైన్స్‌లో నిష్ణాతుడు కావాలని ఆకాంక్షించి, తండ్రే స్వయంగా తనకు తోడ్పడ్డాడు. తన ఫిజిక్స్ లేబరేటరీలో కుమారుని చేత ఎన్నో ప్రయోగాలు చేయించటం ప్రారంభించాడు. వాల్టర్‌కి వైద్యరంగంలో పెరుగుతున్న అభిరుచిని గుర్తించి, అతనిని మెడికల్ కాలేజీలో చేర్చాడు. 1899లో స్విట్జర్లాండ్‌లోని లుసాన్‌లోను, బెర్లిన్‌లోను, కీల్‌లోను, జూరిచ్‌లోను వైద్యవిద్యలో నిష్ణాతుడయ్యాడు. 1906లో మెడికల్ డాక్టరయ్యాడు. తరువాత సర్జరీలో నిష్ణాతుడయ్యాడు.



చిన్నతనం నుండి ఫిజిక్సులో తాను జరిపిన పరిశోధనలు అతని భావిజీవితంలో ఎంతగానో ఉపయోగపడ్డాయి. రక్తప్రసరణ కొలవడానికి Viscometer రూపొందించాడు. శరీరంలో రక్త ప్రసరణ వేగాన్ని అంచనా వెయ్యగలిగాడు. Blood viscosityపై తన పరిశోధనా ఫలితాలు తన థీసెస్‌లో వివరిం చాడు. 1907లో జూరిచ్‌లో ప్రఖ్యాత వైద్యుడు ఓటో హాబ్ (Otto Haab) వద్ద శిక్షణ పొంది Ophthalmologistఅయ్యాడు. ఒక దశాబ్దం నేత్రవైద్యునిగా పనిచేశాడు. Hess Screenను కనుగొని, దానిని రూపొందించాడు.

పెళ్ళి చేసుకుని భార్యాపిల్లలతో, ప్రఖ్యాత వైద్యునిగా మంచి మెడికల్ ప్రాక్టీసులో స్థిరపడ్డా, తన లక్ష్యం పరిశోధకుడు కావాలని, మెదడు శరీరంలో వివిధ అవయవాలకు సంకేతాలు ఎలాగ అందుతాయి అన్న విషయంపై మౌలిక పరిశోధన చెయ్యాలన్న తన తపన చల్లారలేదు. regulation of blood flow కి ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు గల సంబంధంపై పరిశోధించాడు.


మొదటి ప్రపంచయుద్ధం ఆరంభమైన కాలంలో జర్మనీలో బాన్ నగరంలో బాన్ యూనివర్శిటీలోని ఫిజియాలజికల్ ఇన్‌స్టిట్యూట్‌లో 1916లో చేరి ఫిజియాలజీలో పరిశోధనలను ప్రారంభించాడు. తరువాత 1917లో జూరిచ్‌లో ఫిజియాలజీ ప్రొఫెసరు అయి 1911 నుండి 1957 వరకూ పనిచేస్తూ ఫిజి యాలజికల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టరుగా బాధ్యతలు స్వీకరించాడు. 1951లో రిటైర్ అయ్యేవరకూ ఆ పదవిలో వున్నాడు.

1930లో పిల్లుల మెదడుపై పరిశోధన ప్రారంభించి శరీర అంతర్గత అవయవాలకు మెదడులో ఏ భాగం ఏ ఏ అవయవాలను నిర్దేశిస్తూ సంకేతాలు పంపుతుందో స్పష్టంగా గుర్తించాడు. తన పరిశోధనలు 1949లో అతనికి ఫిజియాలజీ / మెడిసిన్‌లో నోబెల్ బహుమతి లభించేట్లు చేశాయి. నోరు-వాయ లేని జంతువులపై పరిశోధనలు చెయ్యకూడదని, జంతుప్రియుల విమర్శలను ఎదుర్కొని మానవ కళ్యాణానికి పరిశోధనలు చేయక తప్పదని స్పష్టం చేశాడు.

మెదడుపై పరిశోధనలతో Brain stimulation techniques ఉపయోగించడం 1920 దశకంలో ప్రారంభమైంది. మెదడులో జుశ్రీవక్షీతీశీఎవం ద్వారా Brain stimulation పద్ధతిని వాల్టర్ వినియోగించాడు. మెదడు అనాటమీలో ఏ భాగం stimulate చెయ్యడం ద్వారా వివిధ జబ్బులను నయం చెయ్యవచ్చో దృష్టి సారించాడు. మెదడులో వివిధ భాగాలను విస్తృతంగా పరిశోధించి Brain mapping చేశాడు. తద్వారా ఫిజియాలజికల్ పరిణామాలను స్పష్టంగా గుర్తించగలిగాడు.

Interrupted Direct-current (DC) Stimulation పద్ధతిని అభివృద్ధి పరిచాడు. చాలా సున్నితంగా ఎలక్ట్రిక్ షాక్‌లు యిస్తూ మెదడులో సంభవించే పరిణామాలను అంచనా వెయ్యడం అతను ప్రారంభించాడు.


Hypothalamus stimulation ద్వారా జంతువులలో వచ్చే మార్పులను క్షుణ్ణంగా పరిశీలించాడు. Brainలో ఒక్కో భాగం stimulate చెయ్యడం ద్వారా ఫిజియాలజికల్ మార్పులను స్పష్టంగా గుర్తించగలిగాడు. BrainలోAnterior part stimulation ద్వారా బి.పి. ధృతి తగ్గడం, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తగ్గడం, ఆకలి, దాహం,



మూత్రం, విరోచనం వంటివి తగ్గిపోయాయి. మరోప్రక్క Hypothalamusలో Posterior stimulateచెయ్యడం వలన జంతువుల ప్రవర్తనలో మార్పు సుస్పష్టం అయింది.

అంతేకాదు, వాల్టర్ తన పరిశోధనల ద్వారా పిల్లులను నిద్రపుచ్చడం కూడా చేయగలిగాడు. అయితే చాలామంది అతని ఈ ప్రయోగం నిజం కాదని తప్పుబట్టారు. కాని తరువాత జరిగిన పరిశోధనలు వాల్టర్ చెప్పింది నిజం అని తేల్చాయి. వాల్టర్ హెస్ తన 92వ ఏట స్విట్జర్లాండ్‌లోని లకార్నోలో 1973 ఆగస్టు 12న హృదయగతి ఆగిపోవడంతో మరణించాడు. జీవితాంతం స్విట్జర్లాండ్ పౌరునిగానే వుండి తన విశిష్ట పరిశోధనల ద్వారా మెదడుపై గొప్ప విషయాలు కనుగొని మానవ కళ్యాణానికి తోడ్పడ్డాడు. అతని జీవితం, కృషిపై పలు పుస్తకాలు వెలువడ్డాయి. బెర్న్, జెనీవా, మెక్‌హిల్, ఫ్రైబర్గ్ యూనివర్శిటీలు ఆ మహాశాస్త్రజ్ఞుడిని గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. అతని పరిశోధనలు సైకియాట్రికి, ఫిజియాలజీకి ఎంతగానో తోడ్పడ్డాయి.

Methods/Techniques of Deep Brain Stimulation





బన్నీ వేలంటైన్స్ గిఫ్ట్

ఇండస్ట్రీలో హిట్ కోసం ఎదురుచూస్తున్న ఏకైన స్టార్ హీరో అల్లు అర్జున్ ఒక్కటే. బన్నీకి తప్ప అందరికి హీరోలకు హిట్స్ ఉన్నాయి. లాస్ట్ ఇయర్ బన్నీ చేసిన నా పేరు సూర్య ఆశించిన స్థాయిలో హిట్ అవ్వలేదు. దీంతో.. ఈసారి తీయబోయే సినిమాతో ఇండస్ట్రీ హిట్ కొట్టాలనుకుంటున్న అల్లు అర్జున్.. దాదాపు ఆరు నెలల నుంచి మంచి కథ కోసం వెయిట్ చేస్తూనే ఉన్నాడు. మధ్యలో విక్రమ్ కుమార్ - పరశురామ్ లాంటి పేర్లు విన్పించినా.. ఫైనల్ గా త్రివిక్రమ్ కే అవకాశం ఇచ్చాడు. త్రివిక్రమ్-బన్నీ కాంబినేషన్ లో ఇప్పటివరకు రెండు సినిమాలు వచ్చాయి. ఒకటి జులాయి - రెండు సన్ ఆఫ్ సత్యమూర్తి. ఈ రెండు సినిమాలు బాగానా ఆడినా అల్లు అర్జున్ కి కావాల్సిన ఇండస్ట్రీ హిట్ మాత్రం రాలేదు. దీంతో.. ఈసారి ఇద్దరూ కలిసి ఇండస్ట్రీ హిట్ పై కన్నేశారు. ఈ మూవీని ఫిబ్రవరి 14న అంటే వేలంటైన్స్ డే రోజున లాంచ్ చేయబోతున్నారు. ఫిబ్రవరిలో మూవీ స్టార్ట్ చేసి దసరా నాటికి రిలీజ్ చెయ్యాలనేది ప్లాన్. ముచ్చటగా మూడోసారైనా.. వీళ్లిద్దరూ అనుకుంటున్న ఇండస్ట్రీ హిట్ సాధిస్తారో లేదో.






కమల్‌తో దక్షిణ కొరియా భామ..

డాషింగ్ డైరెక్టర్ శంకర్ - విశ్వనటుడు కమల్ హాసన్ కాంబినేషన్‌లో 'ఇండియన్' సీక్వెల్ (ఇండియన్-2) చిత్రం రానుంది. ఈ చిత్ర షూటింగ్ ఈనెల 18వ తేదీ నుంచి జరుగనుంది. ఇందుకోసం ఏర్పాట్లు కూడా చురుగ్గా సాగుతున్నాయి. ముఖ్యంగా, ఈ చిత్రాన్ని తక్కువ సమయంలోనే పూర్తి చేయాలన్న పట్టుదలతో దర్శకుడు శంకర్ ఉన్నారు. పైగా ఇందులో కమల్‌హాసన్ సరసన నటించే ఛాన్స్‌ను ఇప్పటికే కాజల్ అగర్వాల్ కొట్టేసింది. ఈ చిత్రం కోసం ఆమె కత్తిసాము వంటి విద్యలను కూడా ప్రాక్టీస్ చేస్తోంది. ఈ నేపథ్యంలో లోక నాయకుడు సరసన నటించే అవకాశాన్ని దక్షిణ కొరియా సింగర్, నటి ఒకరు కొట్టేశారు. ఆమె పేరు.. సుజీ బే. ఒక కొరియా నటి తమిళ సినిమాలో కనిపించనుం డటం ఇదే మొదటిసారి. పైగా ఈ చిత్రంలో సింహభాగం షూటింగ్ తైవాన్‌లో జరగనుంది. యువ సంగీత దర్శకుడు అనిరుధ్ సంగీత బాణీలు సమకూర్చనున్న ఈ చిత్రంలో సింబు, దుల్కర్ సల్మాన్‌తో పాటు మరికొంతమంది ముఖ్యపాత్రల్లో నటించనున్నారు.

చిరు.. చిన్నల్లుడి నెక్స్ట్ హీరోయిన్ ఈమే

'విజేత' సినిమాతో తెరంగేట్రం చేసిన చిరు చిన్నల్లుడు కళ్యాణ్ దేవ్.. ఈ సినిమా ఇచ్చిన రిసల్ట్‌తో కొంత గ్యాప్ తీసుకున్నాడు. మళ్ళీ ఇప్పుడు తన రెండో సినిమాతో సెట్స్ పైకి వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. పులివాసు దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే మొదలుకానుంది. అయితే తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్‌ని ఫిక్స్ చేశారని తెలుస్తోంది. హీరోయిన్‌గా చాలామంది పేర్లను పరిశీలించి.. చివరికి రియా చక్రవర్తిని ఖరారు చేసిందట చిత్ర యూనిట్. అంతకుముందు ఈమె 'తూనీగ తూనీగ' చిత్రంలో నటించింది. హిందీలో "హాఫ్ గర్ల్ ఫ్రెండ్, బ్యాంక్ చోర్, జలేబి" సినిమాలతో యూత్‌కి బాగా చేరువైంది. చిత్ర స్టోరీ లైన్‌కి రియా చక్రవర్తి బాగా సూట్ అవుతుందని భావించిన దర్శకనిర్మాతలు.. ఆమెని సెలక్ట్ చేశారని సమాచారం. ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, పోసాని కృష్ణమురళి కీలక పాత్రలు పోషించనుండగా.. తమన్ సంగీతాన్ని సమకూర్చుకూర్చనున్నారు.



ఎన్టీయార్ కోసం ఎదురుచూస్తున్నా

ఈ సంక్రాంతికి భారీ సినిమాలు బాక్సాఫీస్ వద్ద పోటీ పడబోతున్నాయి. మెగాపవర్ స్టార్ రామ్‌చరణ్ తేజ్ నటించిన వినయ విధేయ రామ నందమూరి బాలకృష్ణ నటించిన ఎన్టీయార్, విక్టరీ వెంకటేష్, వరుణ్ తేజ్ కలిసి నటించిన ఎఫ్2 ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. తాజాగా వినయ విధేయ రామ సినిమా ప్రమోషనల్ ఇంటర్వ్యూలో పాల్గొన్న చరణ్ మిగతా రెండు సినిమాల గురించి మాట్లాడాడు. ఎన్టీయార్ బయోపిక్ అందరూ గౌరవించాల్సిన చిత్రం. ఆ సినిమా కోసం టీమ్ అంతా ఎంతో హార్డ్ వర్క్ చేసింది. ఎంతో బాధ్యతగా, ఎంతో గౌరవంతో ఆ సినిమాను తెరకెక్కించారు. ఎన్టీయార్ జీవితాన్ని క్రిష్ ఎలా తెరకెక్కించాడో చూడాలని అందరూ ఎదురు చూస్తున్నారు. నేను కూడా ఆ సినిమా కోసం వెయిట్ చేస్తున్నా అన్నాడు. అలాగే ఎఫ్2 గురించి మాట్లాడుతూ.. వెంకటేష్‌గారి కామెడీ ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. ఆయన కామెడీ టైమింగ్ సూపర్బ్. ఆయనతో కలిసి వరుణ్ ఎలా చేశాడో చూడాలనుకుంటున్నా అంటూ చెర్రీ తెలిపాడు.



సీక్రెట్ వెల్లడించిన రాశీఖన్నా

టాలీవుడ్‌లో రాణిస్తున్న హీరోయిన్ రాశీఖన్నా ఇప్పుడు కోలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. 'ఇమైక్కా నొడిగల్'తో తమిళ సినీరంగప్రవేశం చేసింది. తాజాగా హీరో జయంరవితో కలిసి 'అడంగ మరు' అనే చిత్రంలో నటించింది. ఈమె తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన మనసులోని మాటను చెప్పింది. అంతేకాదు.. తన బ్యూటీ సీక్రెట్‌ను కూడా బయటపెట్టింది. 'ఇమైక్కా నొడిగల్' చిత్రంలో నయనతార, విజయ్ సేతుపతిలు జంటగా కనిపించారు. 'అందులో నాకు చాన్స్ దొరకనందుకు బాధగా ఉంది. అదేసమయంలో 'విక్రమ్ వేదా' చూసిన తర్వాత విజయ్ సేతుపతితో కలిసి నటించాలని ఆశగా ఉంది. అదేవిధంగా 'తెరి', 'మెర్సల్' చిత్రాలను కూడా చూశాను. విజయ్-అట్లీ కాంబినేషన్ అద్భుతం. వీరిద్దరి కాంబినేషన్‌లో విజయ్ సరసన నటించే అకాశం రావాలని కోరుకుంటున్నా' అని ఇంటర్వ్యూలో పేర్కొంది. 'వ్యక్తిగత ఆరోగ్యంపైన నాకు అమితమైన శ్రద్ధ. ఆరోగ్యంగా, అందంగా ఉండేందుకు పరితపిస్తుంటాను. అందుకే ప్రతిరోజూ గంటన్నరపాటు వ్యాయామం చేస్తుంటాను. తీసుకునే ఆహారపదార్థాల్లో ఎక్కువ కారం ఉంటే నాకు ఇష్టం ఉండదు. అధిక మసాలా వేసి చేసిన వంటకాల జోలికి కూడా పోను' అంటూ తన బ్యూటీ సీక్రెట్‌ను తెలిపింది.





ఒక్కరైనా అర్థం చేసుకుంటే చాలు

చిన్నప్పటి నుంచి సహాయం చేయాలనే గుణం ఉందని సినీ నటుడు సుమన్ అన్నారు. రాజమహేంద్రవరం జేఎన్‌రోడ్డులోని ఏకేసీ కాలేజ్ రోటరీ రివర్‌సిటీహాల్‌లో స్వర్ణాంధ్ర సంస్థ ఆధ్వర్యంలో సినీ హీరో సుమన్ 40వసంతాల సినీ వేడుక ఆత్మీయ పురస్కారసభ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి సినీ నటుడు సుమన్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నటుడు సుమన్‌కు నటమిత్ర బిరుదు ప్రదానం చేసి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే ఇతరులకు సాయం చేసే గుణం ఉందని, సహాయం చేసిన 10మందిలో కనీసం ఒకరైనా తాను చేసిన సహాయాన్ని మంచితనంతో అర్థం చేసుకుంటే అదే చాలన్నారు. ఇటీవల విశాఖపట్నంలో ఆధ్యాత్మిక నటప్రవీణ బిరుదు ఇచ్చారని తెలిపారు. సినీ జీవితంలో ఎన్నో ఆటుపోటులు ఎదుర్కొన్నానన్నారు. తాను సినీ జీవితంలోకి వచ్చి 40ఏళ్లయిందని పేర్కొంటూ, స్వర్ణాంధ్ర సంస్థ చేస్తున్న మంచి పనులకు సంస్థ సభ్యులను అభినందించారు.

కోర్టు ధిక్కారంపై అనిల్ అంబానీకి సుప్రీం నోటీసు

న్యూఢిల్లీ : ఎరిక్‌సన్ ఇండియా కంపెనీకి రూ.550 కోట్ల బకాయిల చెల్లింపులో కోర్టు ధిక్కారానికి పాల్పడినందుకు రిలయన్స్ కమ్యూనికేషన్స్ చైర్మన్ అనిల్ అంబానీకి సుప్రీంకోర్టు సోమవారం నోటీసు జారీ చేసింది. దీనిపై నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాలని ఆదేశించింది. బకాయిలను 2018 డిసెంబరు 15కల్లా చెల్లించాలని సుప్రీంకోర్టు గత సంవత్సరం అక్టోబరులో ఆదేశించింది. రిలయన్స్ సంస్థ రూ.550 కోట్ల చెల్లింపులో కోర్టు ధిక్కారానికి పాల్పడటంపై ఎరిక్‌సన్ పిటిషన్ దాఖలు చేయగా, జస్టిస్ ఆర్‌కే నారిమన్ నేతృత్వంలోని ధర్మాసనం నోటీసు జారీ చేసింది. రూ.550 కోట్లకుగానూ రూ.118 కోట్లే చెల్లిస్తామని రిలయన్స్ తరపు న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహత్గి కోరారు. అందుకు ఎరిక్‌సన్ తరపు న్యాయవాది నిరాకరించి, మొత్తం బకాయిలను చెల్లించాలని వాదించారు.

ఉపాధి హామీని నీరుగారుస్తున్న కేంద్రం : చిదంబరం విమర్శ

న్యూఢిల్లీ : కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) పథకం పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి. చిదంబరం విమర్శించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పథకం నీరుగారిపోతోందని అన్నారు. ఫలితంగా 'గ్రామీణ క్షోభ' నెలకొన్నదని చెప్పారు. ఉపాధి హామీ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో బడుగుజీవులు ఆకలితో అలమటిస్తున్నారని అన్నారు. సోమవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ, ఈ పథకానికి నిధులు కేటాయించేందుకు రాష్ట్రాల వద్ద ఉండడం లేదని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఇంకా మూడు మాసాలు మాత్రమే ఉందని, ఇప్పటికి ఈ పథకం క్రింద రూ.331 కోట్లు మాత్రమే రాష్ట్రాలకు కేటాయించారని తెలిపారు. ఈ పథకానికి కేంద్రం మరిన్ని నిధులు విడుదల చేస్తుందన్న సమాచారం లేదని అన్నారు. ఈ పథకానికి సంబంధించి మరో ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే కార్మికులకు తగినన్ని రోజులు పని చూపించకపోవడమన్నారు. నిధుల లభ్యత ఆధారంగా పని కల్పిస్తున్నారని చిదంబరం తెలిపారు. 'నిధులు అందుబాటులో లేకపోవడంతో, చాలా పంచాయతీలలో పనిని నిలిపివేశారు' అని తెలిపారు. 'కూలి చాలా తక్కువగా ఉంటోంది. ఉపాధి అవకాశాలు శూన్యం. ఒకప్పుడు కార్మికుల ఆకలిని తీర్చిన ఈ పథకం నేడు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది' అని చిదంబరం అన్నారు.

పౌరసత్వ బిల్లుపై మిణుకుమిణుకు ఆశలు

- ఆఫ్ఘనిస్థాన్ నుంచి స్వదేశానికి హిందువులు, సిక్కులు
- గౌరవప్రద జీవనం కోసం స్వదేశంలో పోరాటం
- ఏళ్లు గడుస్తున్నా దక్కని ఫలితం
- శరణార్థుల కల నెరవేరేనా..?



న్యూఢిల్లీ : జస్వంత్ కౌర్, ఆఫ్ఘనిస్థాన్‌లో ఒక పౌర యుద్ధంలో తన ఇద్దరు కుమారులను కోల్పోయిన మహిళ. అత్యంత దయనీయ పరిస్థితుల తర్వాత ఆమె తన కుటుంబంతో పదేళ్ల క్రితం ఆ దేశం వీడి స్వదేశానికి వచ్చింది. అయితే తన మాతృభూమి భారతదేశంలోనే ఒక గౌరవప్రదమైన జీవితం కోసం పోరాటం ప్రారంభమవుతుందని కౌర్‌కు తెలియదు. భారత్‌లో భద్రత పొందేందుకు ఆఫ్ఘనిస్థాన్‌లో హింసను తప్పించుకునేందుకు వేలాది మంది హిందూ సిక్కులతోపాటు కౌర్ తన కోడళ్లు, మనుమరాళ్లతో స్వదేశానికి చేరారు. కానీ పౌరసత్వం లేక వారు స్తంభించిపోతున్నారు. పౌరసత్వ ప్రక్రియ కోసం 12 ఏళు లేదా అంతకుమించిన కాలం పడుతోంది. తీవ్రమైన జాప్యం నెలకొంటుంది. పౌరసత్వ ప్రక్రియ కోసం ఒక కార్యాలయం నుంచి మరొక కార్యాలయానికి పరుగులు పెట్టాల్సిన పరిస్థితి. 60వ పడిలో ఉన్న కౌర్‌కు ఇది పెద్ద సవాలుగా మారింది. ఆమె కుటుంబంలో అంతా మహిళలే ఉన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో హిందూ-సిక్కు సమాజం అధికంగా ఉండే జలాలాబాద్‌లో ఒక ఆత్మాహుతి బాంబు దాడిలో కౌర్ మూడో కుమారుడు మరణించాడు. 'అదే యూరప్, పశ్చిమ దేశాల్లో పరిస్థితితో పోల్చితే, అక్కడ ఆఫ్ఘన్ శరణార్థులు ఐదేళ్లలో నివాసం పొందుతారు' అని ఖల్సా దివాన్ సొసైటీ ఢిల్లీ అధ్యక్షుడు మనోహర్ సింగ్ తెలిపారు. కౌర్ కొన్ని సంవత్సరాల తర్వాత పునరుద్ధించాల్సిన వీసాపై భారత్‌లో నివసిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఇటీవల దీర్ఘకాల వీసాను ప్రవేశపెట్టింది. కానీ దానికి సంబంధించిన నిబంధనలు మరింత కఠినతరంగా ఉన్నాయి. దరఖాస్తుదారులు నేరానికి పాల్పడటం లేదా నిబంధనలు ఉల్లంఘిస్తే దానికి బాధ్యత వహించే ఇద్దరు భారత పౌరుల హామీని శరణార్థులు ఇప్పుడు పొందాల్సిన అవసరం ఉందంటూ నిబంధన విధించబడిందని మనోహర్ సింగ్ పేర్కొన్నారు. వివక్ష ఎదుర్కొని భారత్‌కు వచ్చిన బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్‌ల్లో మైనార్టీ సమాజ ప్రజల కోసం పౌరసత్వ ప్రక్రియను సులభతరం చేసేందుకు పౌరసత్వ(సవరణ) బిల్లుపైనే ఇప్పుడు కౌర్ ఆశలన్నీ ఉన్నాయి. జలాలాబాద్ దాడి నేపథ్యంలో జస్వంత్ కౌర్ మూడో కుమారుడి భార్య తిర్‌పాల్ కౌర్ కూడా తిరిగి తన నలుగురు పిల్లలతో కలిసి పశ్చిమ ఢిల్లీలోని తన అత్తంటికి చేరారు. సంయుక్త పార్లమెంటరీ కమిటీ శరణార్థుల పౌరసత్వానికి సంబంధించి సోమవారం ఒక నివేదిక సమర్పించనున్నది. పౌరసత్వ(సవరణ) బిల్లును ప్రవేశపెట్టాలని ఈ మేరకు సిఫార్సు చేసే అవకాశం ఉంది. సరైన ధ్రువీకరణ పత్రం కలిగి లేనప్పటికీ, 12 ఏళ్లకు బదులుగా భారత్‌లో ఆరు సంవత్సరాల నివాసం తర్వాత పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌ల్లో క్రిస్టియన్లు, పార్సీలు, జైనులు, బౌద్ధులు, హిందువులు, సిక్కు మైనార్టీ వర్గాల ప్రజలకు భారత పౌరసత్వం మంజూరుకు 1955 పౌరసత్వ చట్టం సవరణకు ఈ బిల్లు ఉద్దేశించబడింది. అయితే మతం ఆధారంగా పౌరసత్వం కల్పించాలనే ఈ బిల్లును కాంగ్రెస్, టీఎంసీ, సీపీఎం, మరికొన్ని ఇతర పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జేపీసీ నివేదిక సమర్పించిన తర్వాత కేంద్ర కేబినెట్ పౌరసత్వ సవరణ బిల్లు పున: ముసాయిదా బిల్లును ఆమోదించింది. లోక్‌సభలో నివేదిక సమర్పించిన తర్వాత జనవరి 8 మంగళవారం ముగియనున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లు ఆమోదం పొందుతుందో లేదో చూడాలని ఆ వర్గాలు తెలిపాయి. పౌరసత్వం ఒక రాజ్యాంగ నిబంధన అని, మతం ఆధారంగా కల్పించేది కాదని ప్రతిపక్ష పార్టీలకు చెందిన వేర్వేరు సభ్యులు పేర్కొన్నారు. భారత్ లౌకిక దేశమని వారు స్పష్టం చేస్తున్నారు. ప్రతిపక్ష ఎంపీ ఒకరు మాట్లాడుతూ ఈ బిల్లు ప్రస్తుత రూపంలో అమలులోకి వచ్చినట్లయితే, 1971, మార్చి తర్వాత దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన ఎవరినైనా విదేశీయుడుగా ప్రకటించబడటం, దేశం నుంచి బహిష్కరించడానికి సంబంధించిన అస్సాం ఒప్పందానికి విరుద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు.

మరోపక్క, ఈశాన్య భారతానికి చెందిన ఒక వర్గం ప్రజలు, సంస్థలు ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నారు. మతంతో సంబంధం లేకుండా చట్టవిరుద్ధ వలసదారుల కటాఫ్ తేదీ 1971, మార్చి 24కు సంబంధించి 1985 అస్సాం ఒప్పంద నిబంధనలకు ఇది విరుద్ధంగా ఉంటుందని చెబుతున్నారు. ఇక మేఘాలయ, మిజోరం ప్రభుత్వాలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ మేరకు తీర్మానాలను కూడా ఆమోదించాయి. 'మేము ఎలాంటి పరిహారం, ఉద్యోగాలు, ఇళ్లు కోరుకోవడం లేదు. గౌరవప్రదమైన జీవితాన్ని, ఉపాధిని మాత్రమే కోరుతున్నాం. వ్యాపారం కోసం, మంచి విద్య కోసం విదేశాలకు వెళ్లాలంటే భారతదేశ పాస్‌పోర్టు లేకుండా అది సాధ్యం కాదు' అని మనోహర్ సింగ్ పేర్కొన్నారు. ఆఫ్ఘనిస్థాన్ నుంచి భారత్‌కు వచ్చిన సిక్కులు, హిందువులు ఈ దేశంలో గౌరవప్రదమైన జీవితం పొందడానికి ఖల్సా దివాన్ సొసైటీ కృషి చేస్తోంది. ఆఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడు మహమ్మద్ దౌద్ హత్య తర్వాత 1979లో సింగ్ భారత్‌కు వచ్చేశారు. ఇది సిక్కుల మొదటి ప్రధాన నిష్క్రమణ. ఇక ముజాహిదిన్‌ల రాక, సోవియట్ యూనియన్ బలగాల ఉపసంహరణ తర్వాత 1992లో ఆఫ్ఘనిస్థాన్‌ను హిందువులు, సిక్కులు వీడి రావడం రెండో క్రమం. 'ఆఫ్ఘనిస్థాన్ రాజ్యాంగం మత స్వేచ్ఛను అనుమతిస్తుంది. కానీ హిందువులు, సిక్కులు తమ మత ఆచారాలు, సాంప్రదాయాలను పాటించే సందర్భాల్లో వివక్ష, బెదిరింపులు, వేధింపులు, హింసను ఎదుర్కొంటున్నారు' అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని అధికారి ఒకరు తెలిపారు.

ఆఫ్ఘనిస్థాన్‌లో 2.20 లక్షలు ఉండే హిందూ, సిక్కుల జనాభా ఇప్పుడు 5 వేలకు తగ్గిందని భారత భద్రతా సంస్థల అంచనా పేర్కొంటోంది. 'అప్పటి ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు, ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్‌ల సహాయంతో 1992 పౌర యుద్ధం సమయంలో దాదాపు 25 వేల మంది సిక్కులు, హిందువులు తప్పించుకుని స్వదేశం చేరారు. కానీ కేవలం 35 శాతం మంది మాత్రమే పౌరసత్వం పొందారు' అని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో సింగ్ చెప్పారు. పౌరసత్వం లేకపోవడంతో ఈ ప్రజలు బహిరంగ జైలులోనే ఉంటున్నారన్నారు. మంచి విద్యార్హతలు కలిగి ఉన్నప్పటికీ, ఆఫ్ఘన్ పాస్‌పోర్టుల కారణంగా ఉద్యోగాలు పొందలేకపోతున్నట్లు ఆయన వివరించారు. అమెరికా, అనేక యూరోపియన్ దేశాల్లో జన్మించిన పిల్లలు స్థానిక పాస్‌పోర్టులు పొందినట్లుగా, వారి పిల్లలు భారత్‌లో జన్మించినప్పటికీ, ఆఫ్ఘన్ శరణార్థులు ఆఫ్ఘన్ పాస్‌పోర్టులు పొందారని సింగ్ తెలిపారు. ఇస్లాం మతంలోకి మారనట్లయితే, అక్కడి తీవ్రవాదులు మైనార్టీ వర్గాలకు వ్యాపారం, ఉపాధి అవకాశాలు నిలిపివేస్తారన్నారు. మతం పన్ను చెల్లించాలి. అలాగే దోపిడీలకు పాల్పడతారు. మహిళలు బుర్ఖాల్లోనే ఉండాలని సింగ్ పేర్కొన్నారు. పాఠశాలల్లో పిల్లలు దూషణలకు, దాడులకు గురవుతారు. దీంతో అనేక మంది విద్యకు దూరమయ్యారన్నారు. వారు ఏమీ లేకుండానే భారత్‌కు వస్తారు. వారు ఆస్తులు కొనుగోలు చేయబడవు. ఫలితంగా మరో అవకాశం లేక వారు స్వదేశానికి పయనమవుతారని వివరించారు.

పౌరసత్వ సవరణ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం

పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌ల నుంచి వలస వచ్చిన ముస్లింయేతరులకు భారత పౌరసత్వం కల్పించే పౌరసత్వ సవరణ బిల్లు పున: ముసాయిదాకు కేంద్ర కేబినెట్ సోమవారం ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బిల్లుకు ఆమోదం తెలిపారు. మంగళవారం లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. 2016లో పార్లమెంటులో తొలిసారి ప్రవేశపెట్టిన బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) లోకసభలో ఒక నివేదిక సమర్పించింది. ఇది జరిగిన కొన్ని గంటల్లోనే పరిణామం చోటుచేసుకుంది. అయితే అసోం, ఈశాన్య భారత రాష్ట్రాలకు చెందిన పెద్ద సంఖ్యలోని ప్రజలు ఈ బిల్లు పట్ల నిరసన తెలుపుతున్నారు. 1971 తర్వాత మతంతో సంబంధం లేకుండా దేశంలోకి ప్రవేశించిన విదేశీయులను బహిష్కరించాలన్న 1985 అస్సాం ఒప్పందానికి ఇది విరుద్ధంగా ఉందని పేర్కొంటున్నాయి. సరైన ధ్రువీకరణ పత్రం కలిగి లేనప్పటికీ, 12 ఏళ్లకు బదులుగా భారత్‌లో ఆరు సంవత్సరాల నివాసం తర్వాత పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌ల నుంచి వచ్చిన క్రిస్టియన్లు, పార్సీలు, జైనులు, బౌద్ధులు, హిందువులు, సిక్కు మైనార్టీ వర్గాల ప్రజలకు భారత పౌరసత్వం మంజూరుకు 1955 పౌరసత్వ చట్టం సవరణకు ఈ బిల్లు ఉద్దేశించబడింది. 2014లో ఇది బీజేపీ ఎన్నికల హామీగా ఉంది.

అసోం విద్యార్థి, సామాజిక సాంస్కృతిక సంస్థల బంద్ నేడు

పౌరసత్వ చట్ట సవరణకు కేంద్రం ముందుకు వెళ్లడాన్ని నిరసిస్తూ అసోంకు 40కి పైగా సామాజిక-సాంస్కృతిక సంస్థలతోపాటు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన ఎనిమిది విద్యార్థి సంఘాలు మంగళవారం 11 గంటల బంద్‌కు పిలుపునిచ్చాయి. మతం ఆధారంగా పౌరసత్వ మంజూరును ప్రతిపక్ష పార్టీల సభ్యులు వ్యతిరేకిస్తున్నందున మెజార్టీ ఓటుతో జేపీసీ నివేదికను సిద్ధం చేశారు. అయితే మతం ఆధారంగా పౌరసత్వం కల్పించాలనే ఈ బిల్లును కాంగ్రెస్, టీఎంసీ, సీపీఎం, మరికొన్ని ఇతర పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలకు చెందిన మరికొంతమంది సభ్యులు జేపీసీ నివేదికపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. విచిత్రమేమిటంటే, పార్లమెంటులో బిల్లును వ్యతిరేకిస్తామని బీజేపీ మిత్రపక్షం శివసేన, జేడీ(యూ)లు ప్రకటించాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం అసోంలోని సిల్చార్‌లో మాట్లాడుతూ పౌరసత్వ సవరణ బిల్లు ఆమోదానికి ప్రభుత్వం నిబద్ధతతో ఉందని పేర్కొన్నారు. 'భారతదేశ విభజన సమయంలో చేసిన ఒక తప్పుకు ప్రాయశ్చితమే పౌరసత్వ సవరణ బిల్లు. పార్లమెంటులో ఈ బిల్లు ఆమోదం పొందుతుందని ఆశిస్తున్నా. విభజన బాధితులందరికీ భారతదేశం రక్షణ కల్పిస్తుంది' అని మోడీ వ్యాఖ్యానించారు.

అనీల్ కోసం 'హాల్' బలి : రాహుల్

న్యూఢిల్లీ : రిలయన్స్ అధినేత అనిల్ అంబానీ కోసం ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్)ను బలి చేస్తోందని కాంగ్రెస్ అధినేతన రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. దేశంలోనే మంచి శాస్త్రవేత్తలు, ఇంజనీర్లుగా పేరుగన్న ఆ సంస్థలోని ఉద్యోగులను జీతాలు లేకుండా చేయడం ద్వారా వారందరినీ అనీల్ అంబానీకి చెందిన ఏఏ వెంచర్లలోకి వెళ్లేవిధంగా బలవంతం చేస్తోందని ఆయన ట్విట్టర్‌లో తెలిపారు. రాఫెల్‌ను హాల్‌కు కాకుండా అనిల్ అంబానీకి చెందిన కంపెనీకి ఇవ్వడం తెలిసిందే.

రామమందిరం ప్రారంభించండి : మహంత్

లక్నో : అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించి కోట్లాది భక్తుల మనోభావాలను గౌరవించాలని రామజన్మభూమి ట్రస్ట్ చైర్మన్ మహంత్ నృత్య గోపాల్ దాస్ కోరారు. త్వరలో ప్రధాని మోడీ ఈ సమస్యను పరిష్కరిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కుంభమేళా జరిగే జనవరి 31 నుంచి ఫిబ్రవరి1 తేదీల్లో జరిగే ధర్మసంసాద్‌లో సాధువులంతా దీనిపై గట్టి నిర్ణయం తీసుకుంటారన్నారు. జనవరి 10న విచారణ తేదీలను ప్రకటిస్తామని సుప్రీంకోర్టు వెల్లడించిన విషయం తెలిసిందే. 70 ఏళ్ల నుంచి సుప్రీంకోర్టు రామజన్మభూమి-బాబ్రీమసీదు అంశాన్ని పెండింగ్‌లో పెట్టి హిందువులను ఆవేదనకు గురిచేస్తోందన్నారు. రోజువారీగా విచారణ జరపాలని దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

యువత మరణశయ్యపై ఉంది : సామ్నా

ముంబై : మహారాష్ట్రలోని శివసేన పార్టీ పత్రిక సామ్నా మరోసారి ప్రధాని మోడీ ప్రభుత్వంపై విరుచుకు పడింది. బీజేపీని గెలిపించిన యువత ప్రస్తుతం మరణశయ్యపై ఉందని, అధికారంలోకి రావడం కోసం బీజేపీ ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని యువతకు గాలంవేసిందన్నారు. అయితే గతేడాది దేశంలో 1.09 కోట్ల ఉద్యోగాలు కోల్పోయారని మండిపడింది. 70 లక్షల ఉద్యోగాలు కల్పించామని ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం కోటి ఉద్యోగాలు పోవడానికి బాధ్యత వహించాలని సామ్నా సంపాదకీయం పేర్కొంది. బేటీబచావ్, బేటీ పడావ్, మహిళాసాధికారిత పై మాట్లాడే మోడీ ప్రభుత్వంలో 65 లక్షల మంది మహిళలు ఉపాధి కోల్పోయారని వివరిస్తూ, నిరుద్యోగుల భావోద్వేగాలతో ఆటలాడుకోరాదని శివసేన హెచ్చరించింది.

అఖిలేష్‌కు మాయావతి బాసట

లక్నో(ఉత్తరప్రదేశ్) : ఉత్తరప్రదేశ్‌లో జరిగిన మైనింగ్ కుంభకోణంలో సీబీఐ విచారణను ఎదుర్కోనున్న సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్‌కు బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి బాసటగా నిలిచారు. సీబీఐ విచారణ చేయనున్నట్లు వార్తలు రావటంతో అఖిలేష్‌కు మాయావతి సోమవారం ఫోన్ చేసి మద్దతు ప్రకటించారు. బీజేపీ జిమ్మిక్కులకు ఏమాత్రం అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలను లొంగదీసుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తుంటాయని వ్యాఖ్యానించారు. తప్పుడు కేసులతో భయపెట్టి ట్రాప్ చేసేందుకు ప్రయత్నించటం సహజమేనన్నారు. సీబీఐ విచారణపై ఏమాత్రం భయపడాల్సిన అవసరంలేదని, తాను అండగా ఉంటానని చెప్పారు.

ఎంపీ అసెంబ్లీ స్పీకర్ పదవికి బీజేపీ నామినేషన్

భోపాల్ (మధ్యప్రదేశ్) : మధ్యప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ పదవికి బీజేపీ పోటీ పడుతోంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రంలో ఇప్పటికే ఆ పార్టీ అభ్యర్థిగా గోటేగావ్ ఎమ్మెల్యే ఎన్‌పీ ప్రజాపతి నామినేషన్‌ను దాఖలు చేయగా, తాజాగా బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి, హర్సూద్ ఎమ్మెల్యే విజయ్ షా నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆయన వెంట మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్, ఇతర పార్టీ నాయకులు ఉన్నారు. ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యేని నియమించటం అనాయితీ అని, నియామకంలో కాంగ్రెస్ పార్టీ నిబంధనలను ఉల్లంఘించిందని, అందుకే స్పీకర్ పదవికి పోటీ చేస్తున్నట్లు బీజేపీ ప్రకటించింది. బీజేపీ నామినేషన్‌ను సీఎం కమల్‌నాథ్ స్వాగతించారు. స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవంగా జరగటం ఆనవాయితీగా వస్తోందని, బీజేపీ తమ నామినేషన్‌ను ఉపసంహరించుకునే అవకాశం ఉందని రాష్ట్ర మంత్రి ఒకరు తెలిపారు.

నలుగురు టీడీపీ, అన్నాడీఎంకే సభ్యుల సస్పెన్షన్

న్యూఢిల్లీ : లోక్‌సభ వ్యవహారాలకు పలుమార్లు ఆటంకం కలిగించినందుకు మరో నలుగురు టీడీపీ, అన్నా డీఎంకే సభ్యులపై స్పీకర్ సుమిత్రా మహాజన్ సోమవారం సస్పెన్షన్ వేటు వేశారు. లోక్‌సభ ప్రారంభమైన వెంటనే రెండు పార్టీలకు చెందిన ఎంపీలు స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి ఏపీకి ప్రత్యేక హోదా, కావేరి నదిపై డ్యామ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఆ సమయంలో ఒకసారి సభను స్పీకర్ వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా సభా వ్యవహారాలకు ఆటంకం కలిగించటంతో అన్నా డీఎంకే నేత పీ వేణుగోపాల్, టీడీపీ ఎంపీ ఎన్ శివప్రసాద్‌ను స్పీకర్ హెచ్చరించారు. ప్రశ్నోత్తరాలకు ఆటంకం కలగటంతో రెండు పార్టీలకు చెందిన నలుగురిని స్పీకర్ సభ నుంచి సస్పెండ్ చేశారు. .

రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి కల్పించండి

న్యూఢిల్లీ : దేశంలోని అన్ని రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత జితేంద్రరెడ్డి కోరారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో భాగంగా సోమవారం ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన చట్టాలను కేంద్ర చట్టాలు హరించేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత చట్టాలు సహకార సమాఖ్య వ్యవస్థకు భిన్నంగా ఉన్నాయన్నారు.

కోటాపై తలో మాట...!


అగ్రవర్ణాల్లో పేదలకు 10 శాతం కోటా ఇవ్వాలనే కేంద్ర కేబినెట్ నిర్ణయంపై భిన్నస్వరాలు వినిపించాయి. నిజంగా ఈబీసీలకు రిజర్వేషన్ కల్పించటం మంచిదేనని, కానీ అమలులో కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధిని ఎక్కువ మంది ప్రశ్నించారు. చట్ట సవరణ జరిగే అవకాశమే లేదని, దమ్ముంటే పార్లమెంటులో ప్రవేశపెట్టాలని డిమాండు చేశారు. ఇది ఎన్నికల జిమ్మిక్కుగా కాంగ్రెస్ కొట్టివేయగా.. రాజ్యాంగ సంస్థలను దెబ్బతీసే చర్యగా ప్రకాశ్ అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. కేరళ సీఎం పినరయి విజయన్ ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. ఆర్థిక పరమైన రిజర్వేషన్లకు చట్టం ఆమోదించదని అసదుద్దీన్ ఓవైసీ స్పష్టం చేశారు. ఈబీసీలకు కోటాపై వివిధ రాజకీయ పార్టీల స్పందన ఇలా ఉంది.

ఎన్నికల జిమ్మిక్కే : అభిషేక్ సింఘ్వీ



న్యూఢిల్లీ : ఈబీసీకి కోటా నిర్ణయాన్ని ఓ పోల్ జిమ్మిక్కుగా కాంగ్రెస్ ఆరోపించింది. అభిషేక్ మను సింఘ్వీ దీనిపై ట్వీట్ చేశారు. కోటా 50 శాతం దాటరాదని సుప్రీం తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ కోటాను ఎలా అధిగమిస్తుందని సింఘ్వీ ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడిన నాలుగు ఏళ్ల 8 నెలల తర్వాత ఈ నిర్ణయాన్ని తీసుకుందని, అంటే ఇది ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకున్నారని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. ఉత్తరాఖండ్ మాజీ సీఎం హరీశ్ రావత్ మాట్లాడుతూ పూర్తిగా ఎన్నికల స్టంట్ అన్నారు.

చెల్లుబాటు కాని నిర్ణయం : ప్రకాశ్ అంబేద్కర్



అగ్ర వర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ తప్పు పట్టారు. గతంలో ఇలాంటి నిర్ణయం తీసుకున్నా చెల్లుబాటు కాలేదని చెప్పారు. రాజ్యాంగ సంస్థలను దెబ్బతీసే చర్యల్లో భాగంగానే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన వ్యాఖ్యానించారు.

స్వాగత పరిణామం : పినరయి విజయన్



తిరువనంతపురం: అగ్రవర్ణాల్లో పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని కేరళ ప్రభుత్వం స్వాగతించింది. అగ్ర వర్ణాల రిజర్వేషన్‌కు సీపీఎం చాలాకాలంగా డిమాండు చేస్తోందని కేరళ సీఎం పినరయి విజయన్ తెలిపారు. 'రిజర్వేషన్ విధానాన్ని ధ్వంసం చేయాలని చాలాకాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మేము మాత్రం అగ్రవర్ణాల్లో పేదలకు రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రతిసారి డిమాండు చేస్తూనే ఉన్నాం. ఎట్టకేలకు ఇందుకు సంబంధించిన నిర్ణయం తీసుకున్నారు. ఇది స్వాగతించదగిన పరిణామం' అని పినరయి విజయన్ అన్నారు.

సవరణ బిల్లు పెడతారా ? : కేజ్రీవాల్




కేంద్ర కేబినెట్ నిర్ణయానికి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చీఫ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మద్దతు ప్రకటించారు. పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని బీజేపీని సవాలు చేశారు. సవరణ బిల్లు తీసుకు వస్తే తాము మద్దతు ఇస్తామని అన్నారు. అలాకాకుంటే అది కేవలం ఎన్నికల స్టంటేనన్న విషయం తేటతెల్లమవుతుందని ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఇది పచ్చి అబద్ధం : యశ్వంత్ సిన్హా



అగ్రవర్ణాల్లో పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై మాజీ ఆర్థిక, విదేశాంగ శాఖ మంత్రి యశ్వంత్ సిన్హా ఘాటుగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన పచ్చి 'అబద్ధం' తప్పు మరోటి కాదని అన్నారు. కేంద్రం నిర్ణయం లీగల్ పరమైన చిక్కులకు తావిస్తుందని, పార్లమెంటు ఉభయ సభల్లోనూ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి సమయం కూడా లేదని అన్నారు. ఈ విషయాలన్నీ తెలిసే ప్రభుత్వం ఈ ప్రకటన చేసిందన్నారు. దీనిని బట్టే ప్రభుత్వ వైఖరి ఏమిటో అర్థమవుతుందని ఓ ట్వీట్‌లో ఆయన ఎద్దేవా చేశారు.

రాజ్యాంగ వ్యతిరేకం : ఒవైసీ



ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్న కేంద్ర కేబినెట్ నిర్ణయంతో మజ్లిస్ పార్టీ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ విభేదించారు. ఆర్థిక కారణాలతో రిజర్వేషన్లు కల్పించడాన్ని రాజ్యాంగం ఒప్పుకోదని ఆయన అన్నారు. దళితులకు జరిగిన చారిత్రక అన్యాయాలను సరిదిద్దటానికి, సామాజిక న్యాయం చేయడమే రిజర్వేషన్ల ముఖ్యోద్దేశమని అన్నారు. పేదరిక నిర్మూలనకు అనేక పథకాలు అమలు చేయవచ్చని చెప్పారు. రిజర్వేషన్లు మాత్రం సామాజిక న్యాయం అందించడానికే పరమితమన్నారు. రాజ్యాంగం సైతం ఆర్థిక కారణాలను బట్టి రిజర్వేషన్లు ఇవ్వడాన్ని ఒప్పుకోదని ఒవైసీ చెప్పారు.

సాధ్యం కాదు : కోదండరాం



అగ్రవర్ణ రిజర్వేషన్ల నిర్ణయం మంచిదే కానీ, సాధ్యమయ్యే పని కాదని తెలంగాణ జన సమితి అధినేత కోదండరాం సోమవారం అన్నారు. రాజ్యాంగంలోని నిబంధనలు ఈ నిర్ణయాన్ని అమలు చేయడానికి ఇబ్బందే అన్నారు. రాజ్యాంగ సవరణ చేస్తే చేయవచ్చునని చెప్పారు. కానీ ఇప్పటికి ఇప్పుడు ఇది సాధ్యమయ్యే పని కాదన్నారు. అగ్రవర్ణాలకు రిజర్వేషన్లపై రాష్ట్రాల అభిప్రాయం కూడా తీసుకోవాలని, దీన్ని అమలు చేయాలంటే ఈ మూడు నెలల సమయం సరిపోదని చెప్పారు. ఇది రాజకీయంగా లబ్ధి పొందేందుకు తీసుకున్న నిర్ణయం అన్నారు. ఈబీసీలపై చిత్తశుద్ధి ఉంటే ఈ నాలుగేళు ఏం చేశారని ప్రశ్నించారు.

రాజకీయ లబ్ధి కోసమే : ఆర్.కృష్ణయ్య



అగ్రవర్ణాలకు రిజర్వేషన్ల నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని బీసీ నేత ఆర్.కృష్ణయ్య అన్నారు. ఇష్టం వచ్చినట్లు రిజర్వేషన్లు ఇస్తామంటే కుదరదని చెప్పారు. రిజర్వేషన్లను అర్ధవై శాతానికి పెంచుతామంటే ఊరుకునేది లేదని చెప్పారు. అగ్రవర్ణాలకు రిజర్వేషన్ల పైన పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీకి దమ్ముంటే దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండు చేశారు. బీసీలకు 53 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

మంచిదే కానీ : జేపీ, లోక్‌సత్తా అధినేత



అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు ఆహ్వానించదగ్గ పరిణామం అని లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ అన్నారు. అగ్రవర్ణాలకు రిజర్వేషన్ కేంద్రం ఎలా కల్పిస్తుందో చూడాలన్నారు. రిజర్వేషన్ పరిమితి 50 శాతంగా ఉందని గుర్తు చేశారు. ఉన్న రిజర్వేషన్లలో 10 శాతం తగ్గించి అగ్రవర్ణాలకు ఇస్తారా చూడాలన్నారు. రిజర్వేషన్ ఫలాలు నిజమైన పేదలకు అందడం లేదన్నారు. రిజర్వేషన్లు పొందుతూ ఓ స్థాయికి ఎదిగిన తర్వాత సామాజిక బాధ్యతగా రిజర్వేషన్ వదులుకోవాలన్నారు.



కేశఖండన కార్మికులను పర్మినెంట్ చేయాల్సిందే

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల్లోని కేశ ఖండనశాలలో పనిచేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ అలయాల నాయీ బ్రాహ్మణ బార్బర్స్ కార్మిక సంఘాల కార్యాచరణ కమిటీ (జేఏసీ) నేతలు డిమాండ్ చేశారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ నాయీ బ్రాహ్మణ బార్బర్స్ కార్మిక సంఘాల కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ ధర్నా చౌక్ నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ గౌరవాధ్యక్షులు అన్నవరపు బ్రహ్మయ్య మాట్లాడుతూ కేశఖండన కార్మికులు కనీస ఆదాయం లేక దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయకపోతే మరోసారి సమ్మె తప్పదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను చేయాలన్నారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వడంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఏపీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెవుల కృష్ణాంజనేయులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ఓటు ద్వారా సమాధాన చెప్పాలన్నారు. కేశఖండనశాలలో రిటైర్ అయిన వారికి నెలకు రూ.5 వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు మల్కాపురం కనకారావు మాట్లాడుతూ తమను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు ఇంటూరి బాజ్జి, ద్రాక్షారపు శ్రీనివాసరావు, గుంటుపల్లి రామదాసు, ఏలూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జగన్‌కి సీఎం కుర్చీ తపనే

విశాలాంధ్ర - సి బెళగల్ : వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి సీఎం కుర్చీ తప్ప రాష్ట్ర ప్రజల ఇబ్బందులు పట్టవని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలంలో సోమవారం జన్మభూమి మా ఊరు కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యురాలు బుట్టారేణుక, ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. తొలుత మేళతాళాలు, పూలవర్షం కురిపిస్తూ గ్రామస్తులు స్వాగతం పలికారు. కొత్తకోట నుంచి గూడూరు వరకు ఎత్తిపోతల పథకంతోపాటు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జన్మభూమి సభలో కృష్ణమూర్తి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మళ్లీ చంద్రబాబే ముఖ్యమంత్రి అవుతారన్నారు. రాజన్న రాజ్యం వచ్చి జగన్ ముఖ్యమంత్రి అయితే ప్రభుత్వ అధికారులు జైలుకెళతారే తప్ప రాష్ట్రం అభివృద్ధి చెందదన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా, కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత చంద్రబాబునాయుడుదేనన్నారు. సంక్రాంతి చంద్రన్న కానుకలు, కొత్త పెన్షన్లు తదితరవాటిని అందజేశారు. కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే మణిగాంధీ, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, పులకుర్తి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యుద్ధాలు వద్దు..

అమెరికా అణు కళాశాల ప్రొఫెసర్ పీటర్ కుజినిక్

విశాలాంధ్ర-విశాఖ సిటీబ్యూరో : చరిత్రలో యుద్ధాలు తీవ్ర నష్టాలు మిగిల్చాయని, నాటి అనుభవాలతో ఏ దేశం కూడా యుద్ధాల వైపు ఆలోచించవద్దని అమెరికా యుద్ధ ఉన్మాదాన్ని తెలియజేస్తూ ప్రచురించిన 'ది అంటోల్డ్ హిస్టరీ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా' పుస్తక రచయిత పీటర్ కుజినిక్ పిలుపునిచ్చారు. విశాఖలోని పౌర గ్రంథాలయంలో సోమవారం జరిగిన సదస్సులో ఆ పుస్తక వివరాలను ఆయన వివరించారు. 70 ఏళ్ల పీటర్ కుజినిక్ అమెరికా అణు అధ్యయన కళాశాల ఆచార్యులుగా పనిచేశారు. ఆ శాఖకు డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. యుద్ధాలు వద్దు అనే ఏకైక నినాదంతో భారత్ దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న ఆయన ప్రతీ మనిషికి బోధిస్తున్నారు. అనేక రహస్య విషయాలను తమ పుస్తకంలో పొందుపర్చిన ఆయన భవిష్యత్ తరాలకు చాటిచెప్పాలన్న ఆశయంతో ముందుకుసాగుతున్నారు. పుస్తకం ముందు మాటలో 1900 నుంచి 1920 వరకు మొదటి ప్రపంచ యుద్ధం, అక్టోబర్ విప్లవం వుడ్రో విల్సన్ గురించి వివరించారు. రెండవ ముందుమాటలో 1920 నుంచి 1940 వరకు రూజ్వెల్ట్, స్టాలిన్, హిట్లర్ వాళ్ల వ్యూహాలు, ఘర్షణలు పొందుపర్చారు. చివర అధ్యాయంలో బుష్, ఒబామా గురించి చెబుతూ ఇద్దరూ ఒకే విధానాలు అమలు చేశారన్నారు. రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ పూర్తిగా లొంగిపోయే పరిస్థితి వచ్చినా అనేక అనుమానాలతో అమెరికా ఆ రెండు అణుబాంబులు జపాన్‌లో జారవిడిచిందని ఆచార్యులు తెలియపరిచారు. గ్లోబల్ నెట్వర్క్స్ ఫౌండేషన్, ఇస్కఫ్ నేతృత్వంలో జరిగిన సదస్సులో తొలుత పీటర్ కుజినిక్‌ను ఘనంగా సత్కరించారు. ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు ఎం అధవరావు, విరియాల గౌతమ్, కార్యదర్శి టి.సుకుమారన్, రాష్ట్ర అధ్యక్షులు జేవీ ప్రభాకర్, అధ్యక్షులు రాష్ట్ర గ్లోబల్ నెట్వర్క్స్, మిత్రులు లక్ష్మణరావు, రాంప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఐటా టెన్నిస్ టోర్నీ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఎస్‌వీ రామయ్య స్మారక ఐటా టెన్నిస్ సిరీస్ టోర్నీ సోమవారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రారంభమైంది. శాప్ చైర్మన్ డాక్టర్ పి.అంకమ్మచౌదరి, కృష్ణాజిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.పట్టాభిరామయ్య, టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి కె.రాధాకృష్ణమూర్తి, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు. మొదటి రౌండ్‌లో పీసీ విఘ్నేష్ (తెలంగాణ) 7-5, 6-3 తేడాతో యశ్వంత్ లోనాథన్ (తమిళనాడు)పై, లంకా సుహిత్‌రెడ్డి (తెలంగాణ) 7-5, 7-6(4) తేడాతో విమల్ రాజు జయచంద్రన్ (తమిళనాడు)పై, అలోక్ అర్థయ్ (కర్ణాటక) 6-2, 6-2 తేడాతో తాత్యాగ (కర్ణాటక)పై గెలుపొందారు. కొండూరి శ్రీనివాస్ (ఏపీ) 6-2, 6-2 తేడాతో వి.రోహిత్ (తమిళనాడు)పై, రాజన్ (తమిళనాడు) 6-4, 6-1 స్కోర్ తేడాతో జీవూర్ (కర్ణాటక)పై, జీవీ సౌమ్యనాయుడు (ఏపీ) 6-4, 2-6, 6-3 తేడాతో ఎంఎస్ కార్తీక్‌పై. తీర్థ శశాంక్ (తెలంగాణ) 6-2, 6-4 తేడాతో అనిరుధ్‌కుమార్ (తమిళనాడు)పై విజయం సాధించారు. శివదీప్ కొసరాజు (ఏపీ) 6-2, 6-7(4), 6-4 తేడాతో వీఎం సందీప్ (తమిళనాడు)పై. తరుణ్ అనిరుధ్ (తెలంగాణ) 6-4, 6-2 తేడాతో బుర్రా రామ్‌సాయి (ఏపీ)పై గెలుపొందారు.

జర్నలిస్టుల ఇళ్ళ కోసం 18 నుంచి దీక్షలు

విశాలాంధ్ర -విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలోని జర్నలిస్టుల ఇళ్ళ నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని కోరుతూ ఈ నెల 18వ తేదీ నుంచి విజయవాడలో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ ఫోరం (ఏపీజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు చెవుల కృష్ణాంజనేయులు తెలిపారు. విజయవాడ ఎన్‌జీవో హోమ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ జర్నలిస్టుల ఇళ్ళ నిర్మాణం ఆగిపోతుందనే భయం జర్నలిస్టుల్లో నెలకొందన్నారు. జర్నలిస్టులకు మూడు పడకల ఇళ్లు నిర్మిస్తామన్న ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.200 కోట్లు ప్రకటించి రూ.100 కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. ప్రభుత్వ పెద్దలకు జర్నలిస్టుల ఇళ్ళ నిర్మాణంపై చిత్తశుద్ధి ఉన్నప్పటికీ అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సంక్రాంతి పండుగ లోపు ప్రభుత్వం స్పందించకుంటే 18వ తేదీ నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నామన్నారు. సమావేశంలో ఏపీజేఎఫ్ నాయకులు వీర్ల శ్రీనివాసయాదవ్, యామినేని వెంకట రమణ, టి.అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కిర్లంపూడి షుగర్ ఫ్యాక్టరీ ఆస్తుల జప్తు'

విశాలాంధ్ర-పిఠాపురం : కార్మికుల బకాయిల వసూళ్ళ కోసం తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడి షుగర్ ఫ్యాక్టరీ భూముల జప్తునకు జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు కిర్లంపూడి షుగర్ మిల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి అమలకంటి లక్ష్మీపతి సోమవారం ఇక్కడ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పిఠాపురం పట్టణంలో కిర్లంపూడి షుగర్ ఫ్యాక్టరీ దశాబ్దాల క్రితం అకస్మికంగా మూతపడిందని, కార్మికులకు పరిహారం, ఇతర బకాయిలు చెల్లించలేదన్నారు. కార్మికులకు పరిహారం చెల్లించాలంటూ విశాఖపట్నం లేబర్ కోర్టు 2017 డిసెంబర్‌లో కార్మికులకు అనుకూల తీర్పు ఇవ్వడంతో సుమారు రూ.17 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం పరిహారం చెల్లించకపోవడంతో కార్మికులు యూనియన్ ద్వారా పిఠాపురంలోని 12వ అదనపు జిల్లా కోర్టులో ఈపీ (ఎగ్జిక్యూషన్ పిటీషన్) దాఖలు చేయడంతో కిర్లంపూడి షుగర్ మిల్స్‌కు చెందిన 42 ఎకరాల 34 సెంట్ల భూముల జప్తునకు ఉత్తర్వులు జారీ చేశారు. కార్మికుల బకాయిల వసూళ్ల కోసం ఈ ఫ్యాక్టరీ ఆస్తులు కోర్టు ఆధీనంలో ఉన్నాయని, ఎవరూ కొనడం లేదా అమ్మడం చేయరాదని పిఠాపురంలో టముకు వేసినట్లు యూనియన్ కోశాధికారి అమలకంటి లక్ష్మీపతి తెలిపారు.

బందరు పోర్టుకు ముహూర్తమెప్పుడో!

- శంకుస్థాపన తేదీల మార్పుతో అయోమయం
- తరుముకొస్తున్న ఎన్నికల కోడ్
- నేటికీ కొనుగోలు చేసిన పట్టాభూమి 450 ఎకరాలే
- బ్యాంకుల రుణం ఊసే లేదు



విశాలాంధ్ర - మచిలీపట్నం : మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనుల శంకుస్థాపన తేదీ ఖరారులో గందరగోళం అనేక అనుమానాలకు దారితీస్తోంది. ఈ నెల 11న ముఖ్యమంత్రి చంద్రబాబు రిమోట్ ద్వారా శంకుస్థాపన చేస్తారని ఒకసారి, 27వ తేదీనని మరోసారి, నెలాఖరులోపు అంటూ ప్రభుత్వ ప్రతినిధుల నుంచి రకరకాల ప్రకటనలు వెలువడటంపై ఈ ప్రాంత ప్రజల్లో చర్చ సాగుతోంది. ఎన్నికల కోడ్ ముంచుకొస్తున్న తరుణంలో అసలు పనులు మొదలవుతాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పోర్టు నిర్మాణానికి మొత్తం 4,800 ఎకరాల భూమి అవసరమని నిర్ణయించారు. దీంతో 3,010 ఎకరాలను 2016 మార్చి నెలలోనే సమీకరించి కాకినాడ పోర్టు డైరెక్టర్‌కు అప్పగించారు. మిగిలినదంతా పట్టా భూములు కావడంతో రైతుల నుంచి కొనుగోలు కోసం ఎంయూడీఏకి ఇటీవల రూ. 200 కోట్లను విడుదల చేశారు. ఈ నగదుతో 1,585 ఎకరాల పట్టాభూములను ఎకరం రూ.25 లక్షల చొప్పున కొనుగోలు ప్రక్రియ చేపట్టారు. ఇప్పటివరకు కేవలం 450 ఎకరాలను మాత్రమే రైతులు ఎంయూడీఏకి విక్రయించారు. మిగిలిన భూములకు సంబంధించి పెద్ద రైతులు ఎంయూడీఏకి విక్రయించేందుకు ముందుకు రాకపోవడంతో భూ కొనుగోలు ప్రక్రియ నత్తనడకనసాగుతోంది. పెద్ద రైతులు విక్రయిస్తే తామూ ఇస్తామని చిన్న రైతులు ఎంయూడీఏ అధికారులకు చెబుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. పెద్ద రైతుల్లో ఎక్కువ మంది అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన వారే కావడం గమనార్హం. పోర్టుకు భూముల కొనుగోలు, రోడ్డు, రైల్వేట్రాక్ కనెక్టవిటీ కోసం మరో 500 ఎకరాల కొనుగోలు కోసం ఎంయూడీఏ చైర్మన్, అధికారులు ప్రయత్నిస్తున్నా అడుగు ముందుకుపడని పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్డు నిర్మాణ ప్రాంతంలో భూములను తమకు అప్పగిస్తే భారీ వాహనాల రాకపోకలకు అనుగుణంగా రహదారి పనులు ప్రారంభిస్తామని ఇటీవల పోర్టు నిర్మాణ పనుల బాధ్యతలు చేపట్టిన నవయుగ సంస్థ ప్రతినిధులు చెప్పినట్లు సమాచారం. పోర్టు నిర్మాణానికి భూమి కొనుగోలు, ఇతర పనుల కోసం రూ.1,380 కోట్లు అవసరమని నిర్ణయించారు. ఈ మొత్తాన్ని వివిధ బ్యాంకుల ద్వారా రుణంగా తీసుకుంటామని పాలకులు చెబుతూ వస్తున్నారు. ఇంతపెద్ద మొత్తం రుణం ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇన్ని ఇక్కట్ల మధ్య పోర్టు పనులు ఎప్పటికి ప్రారంభిస్తారనే చర్చ సర్వత్రా సాగుతోంది. ఫిబ్రవరి నెలలో ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందనే ప్రచారం నేపథ్యంలో శంకుస్థాపన రాజకీయ డ్రామానే అనే విమర్శలు లేకపోలేదు.

మైనర్ బాలికపై అత్యాచారయత్నం

విశాలాంధ్ర - డోన్ : తొమ్మిదేళ్ళ చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేసిన ఘటన కర్నూలు జిల్లా డోన్ పట్టణంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. డోన్ పట్టణంలోని కొండపేటకు చెందిన చిన్నారి స్థానిక పాతపేట జిల్లా పరిషత్ పాఠశాల్లో చదువుతోంది. చిన్నారి ఇంటిపక్కన నివాసం ఉంటున్న దస్తగిరి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి చిన్నారి ఇంటి పరిసరాల్లో ఆడుకుంటున్న సమయంలో దస్తగిరి జనావాసాలు లేని ప్రాంతానికి తీసుకెళ్ళి అత్యాచారయత్నం చేయబోయాడు. గమనించిన స్థానికులు దస్తగిరిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. పట్టణ పోలీసులకు సమాచారం అందడంతో విచారణ చేపట్టారు. బాలిక తల్లిదండ్రులు, బంధువులు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దోషిని కఠినంగా శిక్షించాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.



మిగులు విద్యుత్ ఉంటే చార్జీలు తగ్గించండి

సీపీఐ, సీపీఎం నేతల డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో : విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల లెక్కల ప్రకారం రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉంటే చార్జీలు తగ్గించి నిరంతరం సరఫరా చేయాలని సీపీఐ, సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం విశాఖలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. సీపీఐ, సీపీఎంతో పాటు వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరయ్యాయి. కమిషన్ చైర్మన్ జస్టిస్ భవానీప్రసాద్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ విశాఖ నగర కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల సవరణ, సరఫరా చార్జీల ప్రతిపాదనల కోసం ఏపీఈపీడీసీఎల్ చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల భాగస్వామ్యం లేదన్నారు. కార్యాలయంలో నిర్వహించడం వల్లే వినియోగదారులు, ప్రజలు తక్కువ మంది హాజర య్యారన్నారు. ప్రజల మధ్య బహిరంగ విచారణ చేపట్టాల న్నారు. విశాఖ జిల్లాలోని 11 ఏజెన్సీ మండలాల పరిధిలోని గ్రామాల్లో అనేక గ్రామాలు నేటికీ అంధకారంలోనే ఉన్నాయ న్నారు. విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. చేతివృత్తిదారులు, చెరకు రైతులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని, చార్జీల భారం ప్రజలపై పడకుండా చూడాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ బెల్లం తయారు చేస్తున్న చెరకు రైతులను ప్రభుత్వం వ్యాపారులుగా గుర్తిస్తున్న విధానం విడనాడి వారిని ఆదుకో వాలన్నారు. హార్టీకల్చర్ రైతులకు మొత్తం బకాయిల మాఫీతో పాటు ఉచిత విద్యుత్ సరఫరాకు జీవో జారీ చేసినట్టు బెల్లం రైతులనూ ఆదుకోవాలన్నారు. తొలుత ఆయన బెల్లం రైతులతో నినాదాలు చూస్తూ ర్యాలీగా వచ్చి భవానీప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు శోభా హైమావతి, సభ్యులు పి.రఘు, పి. రామ్మోహన్. సీఎండీ హెచ్‌వై.దొర తదితరులు పాల్గొన్నారు.

15 శాతం ఫిట్‌మెంట్ కుదరదు

ఈయూ రాష్ట్ర అధ్యక్షులు వై.వి.రావు



విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఆర్టీసీ ఉద్యోగు లకు 15 శాతం ఫిట్‌మెంట్‌ను అంగీకరించబోమని ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వైవిరావు అన్నారు. ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి సరిగా లేనందున కనీసం కష్టానికి తగిన నిజవేతనాలు దక్కాలన్న ఆలోచనతో 50 శాతం ఫిట్‌మెంట్‌ను అడుగుతుంటే 15 శాతం ఇవ్వగల మని యాజమాన్యం చెప్పడం భావ్యం కాదన్నారు. సమ్మె సన్నాహాల్లో భాగంగా ఎంప్లాయిస్ యూనియన్ తూర్పు గోదావరి రీజనల్ కార్యదర్శి గిడ్ల చిరంజీవి ఆధ్వర్యంలో ఆదివారం రాజమండ్రి సీపీఐ ఆఫీసులో రీజియన్ అధ్యక్షులు మేడిద శ్రీనువాసరావు అధ్యక్షతన యూనియన్ జిల్లా స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వైవీరావు మాట్లాడుతూ ప్రస్తుతం రోజుకి ఎనిమిది గంటలకు బదులు 10 గంటలు పనిచేస్తున్నా జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు. 2013 వేతన సవరణకు సంబంధించి 2015వ సంవత్సరంలో ఎన్జీవోలతో సమానంగా 43 శాతం ఫిట్‌మెంట్ ఒప్పందం చేసుకున్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్టీసీ ఉద్యోగులకు జీతభత్యాల్లో వ్యత్యాసం ఇంకా సుమారు 25 శాతం ఉందన్నారు. ఈ నెలాఖరులో సమస్యను పరిష్కరించు కుందామని పేకమిటీలో ఆర్టీసీ ఎండీ సురేంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. నిజవేతనాల సాధనలో రాజీ పడేది లేదన్నారు. సమ్మె నోటీసులోని డిమాండ్లలో కారుణ్య నియామకాల భర్తీకి ఆదేశాలు వచ్చాయని, ఇప్పటికే చర్చల్లో అంగీకరించిన కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ, రీజన్ టూ రీజియన్ బదిలీలకు వెంటనే ఆదేశాలు జారీ చేయాలన్నారు. నష్టాల పేరుతో సిబ్బంది కుదింపు చర్యలను అడ్డుకొనేందుకు ప్రభుత్వం ఆదుకోవడంతోపాటు మొత్తం 91 డిమాండ్ల సాధన కోసం అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని ఎంతటి పోరాటా నికైనా ముందుకు వెళ్తామన్నారు. జనవరి 8,9 తేదీల్లో జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో ఆర్టీసీ ఉద్యోగులంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఆర్టీసీలో ఎప్పుడు సమ్మె నోటీసు ఇచ్చినా ఇవ్వకపోయినా ప్రతి ఆరు నెలలకో సారి సమ్మె నిషేధం జీవో ఇవ్వడం మామూలేనని, సమ్మెలో అడుగుపెట్టిన తర్వాత ఎస్మా చట్టం ప్రయోగించినా బయ పడేది లేదని ఈయూ రాష్ట్ర నాయకులు పి.జార్జిబాబు, వై.కొండలరావు, పి.సత్యానందం, ఎస్వీరావు అన్నారు. సమావేశంలో యూనియన్ రీజియన్ గౌరవాధ్యక్షులు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మీసాల సత్యన్నారాయణ, జోనల్ కమిటీ కార్యదర్శి పెంటబానుమూర్తి, జోనల్ నాయకులు జి.వి.బి. రావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాల పరీక్షా కేంద్రం



విశాలాంధ్ర - విజయవాడ (లబ్బీపేట) : ఆహార పదార్థాలు, పానీయాల నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడికల్స్ డైరెక్టర్ పి. మంజరీ అన్నారు. విజయవాడలోని సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ ప్రాంగణంలో "అనూర్ ఎన్విరో కెమ్ అండ్ ఫుడ్ అనలిటికల్ లేబొరేటరీని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంజరీ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఆహార పదార్థాలను తయారుచేయడం, ఫుడ్ సేఫ్టీ చట్టప్రకారం వాటిని పరీక్ష చేయించుకోవాల్సిన బాధ్యత ఉత్పత్తిదారులపై కూడా ఉందన్నారు. ఆరోగ్యానికి హానికరమైన ఫుడ్‌కలర్స్, ప్రిజర్వేటివ్స్, లోహాలు, పురుగు మందుల అవశేషాలు, న్యూట్రిషనల్ విలువలు, మినరల్స్, తాగునీరు, పర్యావరణతో పాటు ఆహార సంబంధిత నాణ్యతా పరీక్షలు ఈ ల్యాబ్‌లో చేస్తారన్నారు. ఈ పరీక్షలతో కల్తీ ఆహర పదార్థాలకు తయారీదారులకు చెక్ పెట్టవచ్చన్నారు. అనూర్ లేబొరేటరీ మేనేజింగ్ పార్టనర్ ఎస్.కె. అన్సార్ మాట్లాడుతూ అధునాతన పరికరాలు, నిపుణుల పర్యవేక్షణలో నాణ్యాత ప్రమాణాల పరీక్షలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ ఫార్మా అంకుర కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎస్.బుచ్చి నాయుడు, ఫార్మస్యూటికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గరికపాటి దేవలరావు, ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారి ఎస్.పూర్ణచంద్రరరావు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

నోట్ల రద్దు ముసుగులో భారీ అవినీతి

- దేశాన్ని రక్షించేందుకే వచ్చే ఎన్నికల్లో పోటీ
- పార్టీలోకి సభ్యులను చేర్చిన వారికి తాయిలాలు
- ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ కె.ఎ.పాల్



విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్) : దేశచరిత్రలో ఎప్పుడూ లేని విధంగా పెద్దనోట్ల రద్దు ముసుగులో భారీ అవినీతి జరిగిందని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ కె.ఎ.పాల్ పేర్కొన్నారు. ప్రపంచ దేశాల్లో గొప్ప చరిత్ర కలిగిన భారతదేశం నేడు ప్రమాదంలో పడిందని, రాబోవు ఎన్నికల్లో దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విజయవాడలోని ఓ హోటల్ సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశాన్ని ఏ విధంగా రక్షించాలన్న దానిపై రెండేళ్ళుగా తమ పార్టీ ప్రణాళికల రూపకల్పనలో అనేక పార్టీల నాయకులతో చర్చిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రజా శాంతి పార్టీ పోటీకి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయన్నారు. సేవ్ సెక్యూలర్ ఇండియా, మోడీ హామీలను విస్మరించడం, చంద్రబాబు వైఫల్యం నేపథ్యంలో మేము దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని మతాల ప్రజలు భయంతో బతుకుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు అనేక హామీలు ఇచ్చినా అమలులో వైఫల్యం చెందడంతో ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రతిపక్షంగా వైసీపీ కూడా విఫలం అయిందన్నారు. తమ పార్టీని గెలిపించిన నియోజకవర్గానికి తమ ఛారిటీ తరపున వంద కోట్ల రూపాయలు విరాళం ఇస్తానన్నారు. పాల్ ఆర్మీ సభ్యులంతా గ్రామాలకు వెళ్లి ఒక్కొక్కరు వంద మందిని మా పార్టీలో చేర్పిస్తే తాయిలాలు అందిస్తామన్నారు. వెయ్యి మందిని చేర్చిన వ్యక్తికి నెలకు మూడు వేల చొప్పున ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే డ్వాక్రా రుణాలను పూర్తిగా రద్దు చేస్తామని, నిరుద్యోగులు లేకుండా అందరికీ ఉపాధి కల్పి స్తామన్నారు. రాబోవు ఇరవై రోజుల్లో ప్రజాశాంతి పార్టీ ప్రభంజనం ఏమిటో చూపిస్తామని అన్నారు. ఫిబ్రవరి వరకు సమావేశాలు పెట్టి మార్చిలో అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని వివరించారు. మాకు ఎవరితో పొత్తు అవసరం లేదని, ఎవరైనా మా వద్దకు వస్తే.. ఐదో, పది సీట్లు కేటాయిస్తామన్నారు. మా అన్నయ్య హత్య వెనుక మా వదిన పాత్ర ఉందన్నారు ఒక రాజకీయ కుటుంబం వెనకుండి ఈ హత్యకు రచన చేశారన్నారు. నన్ను కూడా హత్య చేసేందుకు కుట్రలు చేశారని, ప్రాణ హాని ఉన్నందున పోలీసు అధికారులను కలిసినా రక్షణ కల్పించలేదన్నారు. నాకేమైనా జరిగితే చంద్రబాబు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మేడర సురేష్‌కుమార్, అద్దంకి దయాకర్, షేక్ జలీల్, అబ్దుల్ రెహ్మాన్, నమ్మి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేసే వరకు మా ఊళ్లు రావొద్దు

- అధికారులకు చుక్కలు చూపిన గిరిజనులు
- మూడు గ్రామాల్లో జన్మభూమి సభలు రద్దు
- పోలీసుల రక్షణలో వెనుదిరిగిన అధికారులు





విశాలాంధ్ర - కొమరాడ : ఆ రహదారి నిర్మించాకే తమ గ్రామాల్లో అడుగు పెట్టాలని విజయనగరం జిల్లా కొమరాడ మండలంలోని పెదశాఖ, పూడేసు, మసిమండ పంచాయతీల గిరిజనులు తేల్చి చెప్పారు. కొమరాడ తహశీల్దార్ యు.రాజకుమారి ఆధ్వర్యంలో మసిమండ, పెదశాఖ పంచాయతీల్లో, ఎంపీడీవో కె.గౌరీశంకరరావు నేతృత్వంలో పూడేసు పంచాయతీలో జన్మభూమి సభల నిర్వహణకు సోమవారం అధికారులు వెళ్లారు. పెదపెదుము గ్రామ సమీపంలోకి అధికారులు చేరుకోవడంతో గిరిజనులు రహదారికి అడ్డంగా భారీ కర్రలు కట్టి నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. ఏళ్లతరబడి ఈ గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి జన్మభూమిలో అధికారులు హామీలతో చేతులు దులుపుకుంటున్నారన్నారు. గతంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులతోపాటు ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్లకు అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినా కనీసం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే శంకుస్థాపన చేస్తేనే ఆందోళన విరమిస్తామని తేల్చి చెప్పారు. జన్మభూమి నియోజకవర్గ ప్రత్యేకాధికారి మనోరమా, ఐటీడీఏ డీఈ తిరుమలేసు ఫోన్‌లో పార్వతీపురం సీఐ జి.రాంబాబుకు సమాచారం ఇవ్వడంతో కొమరాడ పోలీసు ఘటనా స్థలికి చేరుకున్నారు. ఆందోళన విరమించాలని చెప్పినప్పటికీ వినకపోవడంతో అధికారుల రక్షణకు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గిరిజనులు ఆందోళన కొనసాగించారు. అధికారులను గ్రామాల్లోకి వెళ్లనివ్వకపోవడంతో మూడు పంచాయతీల్లో జన్మభూమి సభలను రద్దుచేసి అధికారులు వెనుదిరిగారు. రహదారుల సమస్యపై భవిష్యత్‌లో ఆందోళన తీవ్రతరం చేస్తామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శాంతమ్మ, మాజీ సర్పంచులు సోములు, రమణమ్మ, అమ్మాజమ్మ, గిరిజన సంఘ నాయకులు భాస్కరరావు, కె.వృద్ధబో, ఆనంద్, సుబ్బారావు, కృష్ణ, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అరసం వర్క్‌షాపు

విశాలాంధ్ర విలేకరి - విజయవాడ : సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో తలెత్తుతున్న పెడధోరణులను, పాలకవర్గాల దోపిడీని, మత, మితవాద భావజాలపు వికృత పోకడలను ఎండగడుతూ కొత్త తరహా రచనలు, కవితలు, పాటలు రావాల్సిన అవసరం ఉందనీ, అందుకు వీలుగా త్వరలో కవులు, కళాకారుల వర్క్‌షాపును నిర్వహించాలని అరసం రాష్ట్రశాఖ నిర్ణయించింది. సోమవారం విజయవాడలోని చంద్ర రాజేశ్వరరావు లైబ్రరీ (అరసం రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. అభ్యుదయ, సాహిత్య, ఉద్యమ చరిత్రను గ్రంథస్థం చేసేందుకు ఒక ప్రణాళికను రూపొందించారు. కొన్ని జిల్లాల్లో అరసం మహాసభలు జరగాల్సి ఉన్నందున, వాటిని వెంటనే నిర్వహించాలని కూడా కార్యవర్గం తీర్మానించింది. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఓబులేసు, అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి మీసేవ బంద్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్య లను ప్రభుత్వం పరిష్కరించనందుకు నిరసనగా ఈ నెల 17వతేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక బంద్ పాటిస్తున్నట్లు మీసేవ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.యుగంధర్ తెలిపారు. మీసేవ డైరెక్టర్‌కు ఈ మేరకు సమ్మె నోటీసు ఇచ్చామని వెల్లడించారు. 2011వ సంవత్సరంలో రెండు డిపార్ట్‌మెంట్‌లకు చెందిన 20 సర్వీసులతోప్రారంభమైన మీసేవ కేంద్రాలు ప్రస్తుతం 36 డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన 400పైగా సేవలను అందిస్తు న్నాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పదివేల మీసేవా కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తున్నామన్నారు. గత ఏడు ఏళ్లగా సేవలు అందిస్తున్నప్పటికీ చాలీచాలని కమీషన్‌తో అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతు న్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలు మార్లు కమీషన్ పెంచాలని ప్రభు త్వాన్ని కోరినప్పటికీ స్పందించలేదన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 17వతేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక బంద్ పాటిస్తున్నట్లు తెలిపారు. మీసేవా కేంద్రాలలో రాష్ట్రవ్యాప్తంగా 20వేల మంది ఉద్యోగులు ఉపాధి పొందుతున్నారని వెల్లడించారు.



33 శాతం రిజర్వేషన్ల కోసం

నినదించారు

శీతాకాల సమావేశాల్లోనే బిల్లు పెట్టండి

రాష్ట్రవ్యాప్తంగా మహిళా సమాఖ్య ఆందోళనలు

విశాలాంధ్ర - నెట్‌వర్క్ : చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్‌ల కోసం మహిళలు మరోసారి గళం విప్పారు. మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రిజర్వేషన్లు తప్పనిసరని మహిళా లోకం నినదించింది. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు) పిలుపు మేరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్‌లు, ప్రధాన కూడళ్లలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ధర్నాలు, నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు జరిగాయి. కృష్ణాజిల్లా మచిలీపట్నం, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు, జిల్లా తిరుపతి, కర్నూలు, అనంతపురం, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, ఏలూరు, కాకినాడలో 33 శాతం రిజర్వేషన్ల కోసం పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మహిళలను రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చేస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని పలువురు మహిళా సమాఖ్య నాయకులు పేర్కొన్నారు. మహిళలకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు కల్పించకుండా ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు జాతీయ నాయకురాలు గీతా ముఖర్జీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లుకు తక్షణమే చట్టరూపం ఇవ్వాలన్నారు. రాజకీయ పార్టీలు మహిళలను ఓటుబ్యాంకుగా చూస్తూ, బిల్లు పార్లమెంట్‌కు వచ్చినపుడు మాత్రం వ్యతిరేకించటం శోచనీయమన్నారు. ప్రతిసారీ ఎన్నికల హామీగా ఉన్న రిజర్వేషన్ బిల్లును ప్రస్తుత సమావేశాల్లో అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అదే జరిగితే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని నాయకులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలలో భాగంగా తిరుపతిలో జరిగిన ఆందోళనలో మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు వీ జయలక్ష్మీ, చిత్తూరు జిల్లా కార్యదర్శి నీలిమా పాల్గొన్నారు. అలాగే విశాఖలో రాష్ట్ర కార్యదర్శి విమల, జిల్లా అధ్యక్షురాలు ఎంఏ బేగం, గుంటూరు జిల్లాలో నాగభైరు రామ సుబ్బాయమ్మ, స్వాతి, ఒంగోలులో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం విజయ, ఎస్ రావమ్మ, నెల్లూరులో వినోదిని, విజయమ్మ, ఏలూరులో జిల్లా నాయకులు నెక్కంటి జగదాంబ, గాళ్ల శారద, కర్నూలులో జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు ఎస్ గిడ్డమ్మ, భాగ్యలక్ష్మీ, కడపలో సీ బషీరున్నీసా, విజయలక్ష్మీ, అనంత పురంలో జిల్లా నాయకురాలు పద్మావతి, విజయనగరంలో మాణిక్యం, బేగం, మచిలీ పట్నంలో పీ రాణి, లలిత, రత్నకుమారి, శ్రీకాకుళంలో జిల్లా కార్యదర్శి ప్రభావతి పాల్గొన్నారు. పలు జిల్లాల్లో అధికారులకు వినతిపత్రాలను కూడా అందజేశారు.

పలువురు డీఎస్పీల బదిలీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ఆర్‌పీ ఠాకూర్ సోమవారం ఉత్తర్వులను వెలువరించారు. వెయిటింగ్‌లో ఉన్న బి.శ్రీభవానిహర్షను తిరుపతి ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్ డీఎస్పీగా నియమించారు. తిరుపతి ఎస్‌బీ డీఎస్పీగా ఉన్న రవి మనోహర్‌చారిని కడప ఎస్‌బీ డీఎస్పీగా, చిత్తూరు సీసీఎస్ డీఎస్పీ వి.అల్లాభక్షను తిరుపతి ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్ డీఎస్పీగా, నెల్లూరు ఎస్సీఎస్టీ సెల్ డీఎస్పీ కె.శ్రీనివాస చారీని ఒంగోలు ఎస్సీఎస్టీ సెల్ డీఎస్పీగా, ఒంగోలు డీసీఆర్‌బీ డీఎస్పీ బి.మరియదాసును నెల్లూరు ఎస్సీఎస్టీ సెల్ డీఎస్పీగా, చిత్తూరు డబ్ల్యూపీఎస్ డీఎస్పీ వి.నారాయణ స్వామిరెడ్డిని గుంతకల్ డీఎస్‌ఆర్‌పీకి బదిలీ చేశారు.

నిజమైన పేదలకు రిజర్వేషన్ మంచిదేగానీ..

లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రిజర్వేషన్ సౌకర్యం పేదలు, అణగారినవారికి దక్కినప్పుడే దాని ఆశయం నెరవేరుతుందని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ అన్నారు. అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. అయితే, 10 శాతం రిజర్వేషన్లు ఎలా అమలుచేస్తారో చూడాలని వ్యాఖ్యా నించారు. 'రాష్ట్రానికి కేంద్ర హామీలు- ప్రతిపత్తి' నివేదికను విజయవాడలో సోమవారం ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా రిజర్వేషన్లపై స్పందిస్తూ అగ్రవర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్లు కల్పించాలన్న సంకల్పం మంచిదేగానీ, సుప్రీం కోర్టు రిజర్వేషన్లను 50 శాతానికి పరిమితం చేసిన నేపథ్యంలో, దానికి లోబడి వీటిని కూడా అమలు చేయాలంటే సమాజంలో పెద్ద సంక్షోభం వస్తుందన్నారు. రిజర్వేషన్లు సమాజాన్ని నిట్టనిలువుగా చీలుస్తు న్నాయని, వాటితో కేవలం కొంతమందికే లాభం కలుగుతోందన్నారు. వాస్తవానికి నిజ మైన పేదలకు, అణగారిన వర్గాలకు మాత్రమే రిజర్వేషన్లు అవసరమన్నారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఆర్థికంగా కుబేరులైన వారి కుటుంబాలు వారి కులం పేరుతో రిజర్వేషన్లు సౌకర్యం పొందడం అన్యాయమన్నారు. అటువంటి వారు స్వచ్ఛందంగా రిజర్వేషన్లను తిరస్కరించి తమ నిజాయితీని నిరూపించు కోవాలన్నారు. కులం ఏదైనా నిజమైన పేదలకు వాటిని కల్పిం చాలన్నారు. అది గుర్తించడం కూడా పెద్ద కష్టమేమీ కాదన్నారు. ఉదాహరణకు తల్లిదండ్రుల చదువు, పిల్లలు ఏ పాఠశాలలో చదివారో గమనిస్తే వారి పేదలో, ధనవంతులో తేలిపోతుందన్నారు.

పల్లె గొంతెండుతోంది..

- గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి అవస్థలు
- శీతాకాలంలోనూ ట్యాంకర్లే ఆధారం
- ప్రత్యామ్నాయ చర్యల్లో ప్రభుత్వం



విశాలాంధ్ర - అమరావతి : తాగునీటి కోసం గ్రామీణ ప్రాంత ప్రజలు నేటికీ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవటంతో చుక్క నీటి కోసం నానా ప్రయాసలు పడాల్సి వస్తోంది. వేసవి రాకుండానే శీతాకాలంలోనే ఇన్ని అవస్థలు పడుతున్న గ్రామ వాసులు వేసవికాలం తలుచుకొని ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రం లోని పలు మండలాల్లో తాగునీటి సమస్య తీవ్రత నేపథ్యంలో ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా అందిస్తున్న నీరు సైతం చాలీచాలని పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా ప్రకాశం, చిత్తూరు, కడప, అనంతపురం, నెల్లూరు, కర్నూలు జిల్లాల్లోని అత్యధిక మండలాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 1,247 పైబడి ఆవాస ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఉన్నట్లు అధికారిక గణాంకాలు తెలియ చేస్తున్నాయి. కాగా దాహార్తి తీర్చేందుకు అధికారులు ట్యాంకర్లతో నీటిని సరఫరా, బోర్లు ఏర్పాటు వంటి ప్రత్యా మ్నాయ చర్యలు చేపడుతూనే ఉన్నారు.

భూగర్భ జలాలు ఊహించని స్థాయిలో పడిపోవడంతో మోటార్లు పని చేయక తాగునీటి పథకాలు మొరాయిస్తున్నాయి. ఆరు జిల్లాల్లో సమగ్ర నీటి పథకాలు, తాగునీటి పథకాల భూగర్భ జలాలు అడుగంటిన నేపథ్యంలో నీటి సరఫరాకు సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిత్యం 1,800 ట్యాంకర్లకి పైగా నీటిని అందిస్తోంది. అలాగే వేసవి వచ్చిందంటే తాగునీటి సమస్య మరింత తీవ్రమవు తుందని అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. వ్యవసాయ బావుల్లో సైతం నీరు లభ్యత క్షీణిస్తోం దని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ముందు జాగ్రత్త చర్యల్లో ఆ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలు..

రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ముఖ్యంగా ఆరు జిల్లాల్లో ఈ ప్రభావం బాగా ఉందని అధికారిక గణాంకాలు ద్వారా తెలుస్తోంది. కడప జిల్లాలో రాయచోటి, బద్వేల్ నియోజకవర్గాలు ఉండ గా, నెల్లూరు జిల్లాలో ఉదయగిరి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో నంది కొట్కూరు, ఎమ్మిగనూరు, డోన్ అనంతపురంలో మడకశిర, పెనుకొండ, కదిరి, అనంతపురం ప్రాంతాలతో పాటు చిత్తూరు జిల్లాలో పీలేరు, మదనపల్లె, పుంగనూరు, తంబళపల్లి, ప్రకాశంలో గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాలు ఉన్నాయని గణాంకాలు తెలియచేస్తున్నాయి. అయితే ఈ ప్రాంతాల్లో నీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తనదైన శైలిలో ప్రణాళికలు సిద్ధం చేసుకుంటుంది.

రోజువారీ ట్యాంకర్ల వినియోగమిలా..

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తోంది. ప్రకాశం జిల్లాలో 1,084 ట్యాంకర్లతో, చిత్తూరు జిల్లాలో 148 ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తుండగా, కడపలో 152, అనంతపురంలో 147, నెల్లూరు జిల్లాలో 125, కర్నూలులో 32, గుంటూరు జిల్లాలో 101 ట్యాంకర్లను వినియోగించి ప్రజల దాహం తీర్చేందుకు చర్యలు తీసు కుంటున్నారు. కాగా ప్రస్తుతం రోజు 5,600 నుంచి 6 వేల ట్రిప్పుల వరకు నీటిని సరఫరా చేస్తుండగా 7,921 ట్రిప్పులు వేయాలని శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టు కున్నట్లు తెలుస్తోంది. అయితే మరిన్ని ట్రిప్పులు కావాలని ప్రజల నుంచి డిమాండు వస్తోంది. అయితే వేసవి వచ్చే నాటికి అనువుగా ఉన్న చోట బోర్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు చెబుతున్నారు. అయితే నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్న తాము ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకునేందుకు పోటీ పడాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి ప్రభుత్వం ఏ విధంగా ముందుకు వెళ్తుందో అన్నది ఆసక్తికరంగా మారింది.

నిర్దేశిత ప్రామాణికాలతోనే ఈవీఎంల పరిశీలన

- పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయండి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సిసోడియా



ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సిసోడియా

విశాలాంధ్ర - కాకినాడ : ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రామాణికాల ప్రకారం ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియను నిర్వహిం చాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆర్.పి. సిసోడియా అధికారులను కోరారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించిన సిసోడియా స్థానిక అంబేద్కర్ భవన్ ఆడిటో రియంలో నిర్వహిస్తున్న ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్(ఎఫ్ఎల్‌సి) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా, జిల్లా ఎస్పీ విశాల్ గున్నిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా ఎఫ్ఎల్‌సీ నిర్వహణకు చేపట్టిన చర్యలను సీఈఓకు వివరిం చారు. జిల్లాలో మొత్తం 4,580 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ఎన్నికల నిర్వహణకు బఫర్‌తో కలిపి 11,450 కంట్రోల్ యూనిట్లు, 14,656 బ్యాలెటింగ్ యూనిట్లు, 12,366 వీవీపాట్ యంత్రాలు కేటాయించడం జరిగిందన్నారు. ఈ యంత్రాలకు 20 మంది బీహెచ్ఇఎల్ ఇంజనీర్ల సహకారంతో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎఫ్ఎల్‌సి నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే ఎఫ్ఎల్‌సి కేంద్ర లోపల, బయట పటిష్టమైన భద్రతకు చేపట్టిన చర్యలను, సిబ్బంది మోహరిం పును జిల్లా ఎస్పీ విశాల్ గున్ని వివరించారు. అంబేద్కర్ భవన్‌లో చేపట్టిన పటిష్ఠ భద్రతా ఏర్పాట్ల పట్ల సీఈఓ సిసోడియా సంతృప్తి వ్యక్తం చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో యంత్రాల ద్వారా ప్రక్రియను పార దర్శకంగా నిర్వహించాలని, మొత్తం ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయించడంతో పాటు సీఈవో, ఎలక్షన్ కమిషనర్ పరిశీలనకు వెబ్‌కాస్ట్ చేయాలని సూచించారు. ఎఫ్ఎల్‌సీ ప్రక్రియలో పాల్గొనే ప్రతి వ్యక్తి గుర్తింపు కార్డు కలిగి ఉండాలని, హాలులోకి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు ప్రతిసారీ తప్పనిసరిగా ఆపాదమస్తకం తనిఖీ చేసి పంపాలన్నారు. ఓటింగ్ యంత్రాలు, వాటి బాక్స్‌లపైన గతంలో వినియోగిం చినపుడు అంటించిన స్టిక్కర్లు, సీళ్ల ఆనవాళ్లు లేకుండా పూర్తిగా శుభ్రం చేయాలని సూచించారు. ప్రతి బటన్ నొక్కి మాక్ పోల్‌తో యంత్రాల పని తీరును తనిఖీ చేయాలని, అనంతరం వాటిలో రికార్డయిన పూర్వ సమా చారాన్ని పూర్తిగా తొలగించి, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ సీళ్లు వేసి భద్రపరచాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రామాణిక చర్యలను కచ్చి తంగా అమలు చేయాలని, ఎఫ్ఎల్‌సీ మొత్తం ప్రక్రియ పారదర్శకంగా, ఎవరికీ ఎటువంటి అపో హలు లేని రీతిలో స్వేచ్ఛా యుత వాతా వరణంలో నిర్వహించాలని అధికారులకు సూచించారు.

అనంతరం ఆయన కలెక్టరేట్ పక్కనున్న ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి, జిల్లాకు కేటాయిం చిన వీవీపాట్ యంత్రాలను, భద్రతకు చేపట్టిన చర్యలను పరిశీలిం చారు. భద్రతను మరింత సుధృ డం చేసేందుకు గోడౌన్ చుట్టూ రక్షణ వలయాన్ని మరింత పటిష్ఠ పరచాలని ఆయన సూచించారు. తదుపరి ఆయన కలెక్టరేట్‌ను సందర్శించి నూతనంగా ఆధునీకరించిన ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాలును ప్రారంభించారు. అలాగే ఆధునీకరించిన జిల్లా కలెక్టర్ ఛాంబర్, కోర్టు హాలు, నూతనంగా నిర్మించిన వివేకానంద ప్రజా దర్బారు హాలు, నిర్మాణంలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌లను తిలకించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఎ.మల్లిఖార్జున, డీఆర్‌వో ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి, కాకినాడ ఆర్డీవో బి.రాజకుమారి, ఎఫ్ఎల్‌సీ కేంద్రం ఇన్‌చార్జి డేవిడ్ రాజు, బెల్ సంస్థ ఇంజనీర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆర్.వెంకటేశ్వరరావు (వైసీపీ), బి.వెంకటేష్ నాయుడు (ఐఎన్‌సీ), డి.ఎస్.వి. భద్రరావు (టీడీపీ), జి.సింహాచలం (బీఎస్పీ), కె.గంగరాజు, (బీజేపీ), ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీపై కేంద్రం వివక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని, ఇందుకు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ వ్యాఖ్యలే నిదర్శనమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విజయవాడలోని దాసరిభవన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని డిమాండు చేస్తూ ఢిల్లీ కేంద్రంగా ఈ నెల 3, 4 తేదీల్లో ధర్నాచేపట్టామన్నారు. 3వ తేదీన అకారణంగా తమపై పోలీసులు లాఠీచార్జీకి దిగార న్నారని, 11మందికి గాయాలయ్యాయని వివరిం చారు. ఎవ్వరూ వెనక్కి తగ్గకుండా 4వ తేదీన ధర్నాను విజయవంతంగా నిర్వహించామని చెప్పా రు. లాఠీఛార్జ్, అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేసినా ఉద్యమకారులెవరూ బెదరలేదని చెప్పారు. రాష్ట్రానికి కేంద్రం ద్రోహం చేయడం దారుణ మన్నారు. ధర్నా అనంతరం కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీని తామంతా కలిసి రాష్ట్ర విభజన హామీలు, ప్రత్యేక హోదా అమలు అంశాలను వివరించామన్నారు. తాము సూచించిన ఒక్క అంశానికీ కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించ లేదన్నారు. ప్రత్యేక హోదాను ప్రస్తావించగా...'ఏపీ ముఖ్యమంత్రిని అడిగే ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చామంటూ' దాటవేత ధోరణితో కనబరిచార న్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు 2017-18, 2018-19 సంవత్సరానికి రూ.350 కోట్లు చొప్పున మొత్తంగా రూ.700కోట్ల ప్యాకేజీ అందలేదని చెప్పినా, దాన్ని సీరియస్‌గా తీసుకో లేదని చెప్పారు. 'విశాఖ రైల్వేజోన్‌ను ప్రస్తావించగా, అది హామీనే కాదంటూ మాట్లాడారని, కడప స్టీల్ ప్లాంట్ అంశంపై మాట్లాడుతూ, ఏపీ ప్రభుత్వం నుంచి తమకు సరిగ్గా వివరాలు అందలేదని' బుకాయించారని రామకృష్ణ వివరించారు. ఏపీ లోటుబడ్జెట్టు రూ.16వేల78కోట్లకుగాను ప్రభుత్వం ఇచ్చింది..రూ.3979కోట్లేనని ప్రస్తావించగా...ఏపీ ప్రభుత్వం వేర్వేరు స్కీములు పెట్టుకుంటే తామేమీ చేయలేమంటూ అరుణ్‌జైట్లీ నొక్కిచెప్పారన్నారు. ఏపీలో లోటుబడ్జెట్టుపై కాగ్ స్పష్టంగా నివేదికిచ్చిన అంశాన్ని గుర్తుచేసినా..కేంద్ర మంత్రిలో కదలిక లేదని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం, ప్రధాని మోడీ, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ సైతం రాష్ట్రానికి ఎలాంటి సహకారం అందించాల్సిన అవసరం లేదనే ధోర ణితో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబో యే ఎన్నికల్లో బీజేపీకి బుద్ధిచెప్పాలని పిలుపు నిచ్చారు. బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తలతో మాట్లాడిన సమయంలో మోడీ బ్లాక్‌మెయిల్ వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. టీడీపీ-బీజేపీ ఇద్దరూ కలిసినప్పుడు ఒక రకంగాను, విడి పోయినప్పుడు వివక్షతతో బ్లాక్‌మెయిల్ రాజకీయా లకు దిగడం దారుణమని విమర్శించారు. రాష్ట్ర ప్రజలంతా కేంద్ర ప్రభుత్వ వైఖరిని రాజకీయాలకు అతీతంగా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు.

పోలవరం రికార్డు ప్రశంసనీయం..

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఏకకాలంలో 24గంటలపాటు దాదాపు 30వేల ఘనమీటర్ల కాంక్రీట్ వేసి గిన్నీస్ వరల్డ్ రికార్డు సృష్టించడం ప్రశంసనీయమని రామకృష్ణ కొని యాడారు. ఈ ప్రాజెక్టు పనుల్లో పాల్గొన్న 3,600 మంది కార్మికులు, 500మంది సాంకేతిక సిబ్బంది, నవయుగ కంపెనీ చైర్మన్ విశ్వేశ్వరరావు, ఎండీ శ్రీధర్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సీపీఐ తరపున అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర, దేశాలలో అభివృద్ధికి ముందడుగు వేయడానికి శు భసూచికమని, ప్రజలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించి నట్లుగా సీపీఐ భావిస్తోందని చెప్పారు. ప్రాజెక్టు పనుల్లో చెమటోడ్చి పనిచేసిన కార్మికుల కృషిని ఆయన కొనియాడారు.

సమ్మెకు కార్మిక సంఘాలు సన్నద్ధం

ఈ నెల 8,9 తేదీల్లో దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలన్నీ సమ్మెకు సన్నద్ధమయ్యాయని రామకృష్ణ చెప్పారు. రాష్ట్రంలోని 13జిల్లాల వ్యాప్తంగా కార్మిక, వ్యవసాయ, రైతు సంఘాలన్నీ రోడ్డెక్కనున్నాయని తెలిపారు. 9న వ్యవసాయ, కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఈ సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై దేశవ్యాప్తంగా 40కోట్ల మంది కార్మికులు తెలుపుతున్న నిరసనలో అందరూ భాగస్వాములవ్వాలని కోరారు. మోడీ నుంచి మార్పు వచ్చేంతవరకూ పోరాటాలు కొనసాగిం చాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమా వేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జల్లి విల్సన్, జి.ఓబులేసు, పి.హరినాథరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధిహామీని తప్పుదోవ పట్టిస్తున్న పాలకులు

వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్



విశాలాంధ్ర-అనకాపల్లి : వామపక్ష పార్టీల ఎంపీల కృషిఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ విమర్శిం చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం విశాఖజిల్లా శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలుచేయాలనే అంశంపై సోమవారం విశాఖ జిల్లా అనకాపల్లిలోని వై.విజయకుమార్ హాలులో శివలంక కొండలరావు అధ్యక్షతన జిల్లా స్థాయి సదస్సు జరిగింది. శేఖర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు భూములు కొని ఇవ్వాలని చట్టంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎక్కడైనా ఇచ్చారా..? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కరవు విలయతాడవం చేస్తోందని, కరవు నివారించి, రైతుల ఆకలిచావులు లేకుండా చేయాలని డిమాండు చేశారు. విశాఖ జిల్లాలో 4,97,963 జాబ్‌కార్డులున్నా రూ.40 కోట్ల అరవై లక్షలు కూలి చెల్లించాల్సి ఉందని చెప్పారు. వ్యవసాయ కూలీలు, ముఖ్యంగా మహిళా కూలీలు అందరూ ఏకమై జాబ్ కార్డులతో పనిలేకుండా 200 రోజుల పనిదినాలు రూ.500లు కూలీ ఇచ్చేలా పోరాడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ రోజుకు రూ.205 కూలీ రెండువందల పనిదినాలు అమలు జరగటం లేదని అన్నారు. ఇక్కడ పనిచేసేది కూలీలయితే కూలి డబ్బులు తీసుకొనేది పచ్చ చొక్కాలవారేనని విమర్శించారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ.300 అమలు జరిగేలా చూడాలని, వలసలు, ఆకలి చావులు నిర్మూలించే దిశ గా పనులు కల్పిం చాలని కోరా రు. ప్రజల జీవన ప్రమా ణాలు మెరుగుపడే విధంగా కృషి జరగాలని అన్నారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని కౌలు రైతులు కూడా ఆత్మ హత్యలు చేసుకుంటున్నారని, వృత్తిదారులు గ్రామాలు వదిలి పట్టణాలకు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా అమలు జరిగేలా రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన ఈ సదస్సులో మళ్ల మాధవరావు, నరాలశెట్టి సత్యనారాయణ, అధిక సంఖ్యలో కార్మికులు, మేట్‌లు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సర్వం సిద్ధం

- రాష్ట్రంలో పది కార్మిక సంఘాలు సన్నద్ధం
- 8, 9 తేదీల్లో 50 లక్షలకు పైగా కార్మికుల నిరసన గళం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : జాతీయ స్థాయిలో పది కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, ఉద్యోగ, కార్మిక అసోసియేషన్ల సదస్సు పిలుపులో భాగంగా జనవరి 8, 9 తేదీల్లో దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెకు రాష్ట్రంలోని పది కేంద్ర కార్మిక సంఘాలు సిద్ధమయ్యాయి. రెండు రోజుల పాటు అన్ని రంగాల్లో పని చేసే 50 లక్షల మందికి పైగా కార్మికులు సమ్మెబాట పట్టనున్నారు. ఇప్పటికే ఏఐటీయూసీ, ఏఐటీ యూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, ఏఐయూ టీయూసీ, ఐఎఫ్‌టీయూ, వైఎస్ఆర్‌టీయూ, ఐఎఫ్‌టీయూ తదితర కార్మిక సంఘాలు ప్రచార జాతాలు, సదస్సులు, ప్రదర్శనలు, బైక్ ర్యాలీల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి వేలాది పోస్టర్లు, కరపత్రాలతో ప్రచారం సాగించారు. బ్యాంక్, పోస్టల్, రైల్వే, ఇన్సూరెన్స్, డిఫెన్స్, మున్సిపల్, వైద్య ఆరోగ్య రంగాలకు చెందిన ఉద్యోగులు ఆయా పని ప్రదేశాల్లో నిరసనలకు సిద్ధం కాగా లక్షలాది మంది ఉన్న అసంఘటిత కార్మికులు ఆటో, హమాలీ, భవన నిర్మాణ, వీధి విక్రయదారులు, ప్రభుత్వ స్కీంల్లో పని చేస్తున్న ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఐకేపీ రంగాల కార్మికులు, మహిళలు ఈ సమ్మెలో పాల్గొననున్నారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతినే కొనసాగించాలని, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించి రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలని, కార్మిక చట్టాల సవరణలను ఆపాలని, ఉన్నవాటిని పకడ్బందీగా అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల అమ్మకాన్ని ఆపాలని, కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్‌లను విధిగా అమలు చేయాలని తదితర డిమాండ్లపై నిరసనలు తెలపనున్నారు.

రాష్ట్రంలో ముఖ్య పట్టణాలైన విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరు పతి, కర్నూలు తదితర ప్రాంతాల్లో కార్మికులు పెద్దఎత్తున రోడ్లపైకి రానున్నారు. అన్ని పారిశ్రామిక వాడలలో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు కార్మికులు నిరసన గళమెత్తనున్నారు. 8వ తేదీ రాష్ట్రవ్యాపితంగా ప్రదర్శనలు, సభలు, 9వ తేదీ మానవహారాలు నిర్వహించనున్న ఈ సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని పాలకులకు కనువిప్పు కలిగించాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు.



హోదాపై జగన్ డ్రామాలు

పీసీసీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రా నికి ప్రత్యేక హోదాపై వైసీపీ అధినేత జగన్ డ్రామాలాడుతున్నారని పీసీసీ ఉపాధ్య క్షుడు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహిం చారు. ప్రత్యేక హోదా ఇస్తామంటున్న కాంగ్రెస్ ను జగన్ విమర్శిస్తారని, అటు బీజేపీని ఆయన పల్లెత్తుమాట అనరని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా రాష్ట్రపరిధిలోని అంశం కాదని, ఈ విషయాన్ని జగన్ గుర్తెరగాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో విజయవాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్నాథం పాల్గొన్నారు.





కల సాకారం

- ఆసీస్ గడ్డపై కోహ్లిసేన సంచలనం
- 72 ఏళ్ల నిరీక్షణకు తెర
- మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ పుజారా

వరల్డ్ కప్ కంటే గొప్ప విజయం: కోహ్లి

ఈ విజయం నా కెరీర్‌లో ఎంతో ఉత్తమమైనది. భారత్ ప్రపంచ కప్ గెలిచినప్పుడు.. ఆ జట్టులో నేను చిన్నవాడిని. ఆ సమయంలో జట్టులోని ప్రతి ఒక్కరూ విజయంతో ఎంతో భావోద్వేగానికి గురవడం నేను చూశా. అయితే నేను అప్పుడు అలా ఫీల్ కాలేకపోయా. ఇక్కడికి మూడుసార్లు వచ్చిన అనంతరం విజయం ఎంత కఠినమో తెలిసొచ్చింది. నేను టెస్టు కెప్టెన్‌గా ఆస్ట్రేలియా గడ్డపైనే బాధ్యతలు చేపట్టా. ఇక్కడి నుంచే మార్పు ప్రారంభమైంది. ఇప్పుడు ఈ విజయం ఎంతో ప్రత్యేకమైనది' అని కోహ్లి అన్నాడు. 'మా ఆటగాళ్లను చూసి నేను ఎంతో గర్వపడుతున్నా. ఇది వారి విజయమే. ముఖ్యంగా బౌలర్లు ప్రదర్శించిన ఆధిపత్యం గతంలో ఎప్పుడూ నేను చూడలేదు. ఇక్కడే కాదు ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాల్లో కూడా బౌలర్లు మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ విజయం యువ జట్టుకు ఒక పునాది రాయి లాంటిది.

సిడ్నీ:
టీమిండియా దశాబ్దాల కల నెరవేరింది. ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి సిరీస్ గెలిచి సగర్వంగా నిలిచింది. 4 టెస్టుల సిరీస్‌ను 2-1 తేడాతో భారత్ కైవసం చేసుకోవడంతో 72 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. ఆసీస్ గడ్డపై ఇన్నేళ్ల తర్వాత తొలి టెస్టు సిరీస్‌ను టీమిండియా కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని కోహ్లిసేన ముద్దాడి విదేశీగడ్డపై సత్తా చాటింది. గతంలో 1980-81, 1985-86, 2003-04 పర్యటనల్లో భారత్ సిరీస్‌ను డ్రా చేసుకుంది. ఇప్పటి వరకు ఆస్ట్రేలియా గడ్డపై ఆడిన 47 టెస్టుల్లో భారత్‌కు 7 విజయాలు దక్కాయి.

3-1తో ముగించాలనుకున్నా..

వరుణుడు అంతరాయం కలిగించడంతో ఆఖరి రోజు ఆట రద్దయి చివరి టెస్టు డ్రాగా ముగిసింది. దీంతో సిరీస్‌ను 3-1తో ముగించాలన్న భారత ఆశలు మాత్రం నెరవేరలేదు. మూడో టెస్టు గెలుపుతోనే భారత్‌కు సిరీస్ విజయం దాదాపు ఖాయమైంది. ఇక చివరిదైన నాలుగో టెస్టులో టీమిండియా పట్టుబిగించి ఆసీస్‌ను ఫాలోఆన్‌లోకి నెట్టింది. దీంతో అందరూ సిరీస్‌ను విజయంతో ముగిస్తారని అనుకున్నారంతా. అయితే, ఆ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. కుల్‌దీప్ 5 వికెట్లతో విజృంభించడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 300 పరుగులకు ఆలౌట్ అయింది. 322 పరుగుల భారీ ఆధిక్యం సాధించిన భారత్.. ఆసీస్‌ను ఫాలోఆన్‌కు ఆహ్వానించింది. వెలుతురులేమితో నాలుగో రోజు ఆట నిలిచిపోయే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 6 పరుగులు చేసింది. అనంతరం ఆటకు వర్షం అంతరాయం కలిగించడంతో నాలుగో రోజు ఆట ముగిసింది. వరుణుడు తన ప్రతాపాన్ని కొనసాగించడంతో ఐదో రోజు ఆట ఒక్క బంతి కూడా పడకుండానే తుడిచి పెట్టుకుపోయింది. దీంతో 2-1తో ఆధిక్యంలో ఉన్న భారత్ సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో మూడు సెంచరీలు నమోదు చేసిన భారత నయావాల్ పుజారా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌ను గెలుచుకున్నాడు.

పలువురి ప్రశంసలు

ఆసీస్ గడ్డపై చారిత్రక టెస్టు విజయాన్ని సొంతం చేసుకున్న టీమిండియాపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆసీస్ గడ్డపై సిరీస్ గెలవాలన్న దశాబ్దాల కల నెరవేరడంతో క్రికెట్, సినీ, రాజకీయ ప్రముఖులు కోహ్లిసేనపై ట్విటర్‌లో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సైతం తన ట్విట్టర్‌లో టీమిండియాకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. "ఆస్ట్రేలియాలో ఓ చారిత్రక క్రికెట్ విజయమిది. ఈ అద్భుతమైన విజయానికి టీమిండియా సభ్యులు అన్ని విధాలుగా అర్హులు. సిరీస్‌లో కొన్ని అద్భుతమైన ప్రదర్శనలతోపాటు టీమ్ వర్క్ కనిపించింది" అని మోడీ ట్వీట్ చేశారు.

మైదానంలో విరుష్క 'విజయ నడక'



ఒకప్పుడు ఆమె మైదానంలో ఉందని అందుకే ఆట గెలవలేకపోయారని కామెంట్లు చేశారు. ఇప్పుడు ఆమె సాక్షిగానే టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి, అతని బృందం టెస్టు క్రికెట్‌లో చరిత్ర సృష్టించారు. ఆమె ఎవరో కాదు సారథి విరాట్ భార్య అనుష్క శర్మ. ఆసిస్‌ను సొంత గడ్డపై మట్టి కరిపించి చారిత్రక విజయాన్ని కోహ్లిసేన సొంతం చేసుకుంది. విజయం సాధించిన అనంతరం అనుష్క మైదానంలోకి వచ్చి తన భర్తను ప్రేమగా ఆలింగనం చేసుకుని 'నిన్ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది మై లవ్' అంటూ అభినందించారు. అనంతరం మైదానంలో 'విరుష్క' జంట కలిసి నడవడం వైరల్‌గా మారింది. వారిద్దరూ మైదానంలో 'విక్టరీ వాక్' చేస్తున్నారంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

తొలి కెప్టెన్‌గా కోహ్లి

కోహ్లిసేన భారత టెస్టు క్రికెట్‌లో చరిత్ర సృష్టించింది. ఆస్ట్రేలియాను వారి సొంత గడ్డపైనే మట్టికరిపించి తన సత్తాను క్రికెట్ ప్రపంచానికి చాటింది. ఆస్ట్రేలి యాలో తొలి సిరీస్ విజయాన్ని నమోదు చేసి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని సగర్వంగా ముద్దాడింది. ఈ విజయంతో భారత అభిమానుల చిరకాల స్వప్నం నెరవేరింది. ఈ సిరీస్ విజయంతో భారత్ మరికొన్ని మైలురాళ్లను చేరుకుంది.

- ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలిచిన తొలి ఆసియా కెప్టెన్ విరాట్ కోహ్లినే. దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాల్లో భారత్ సిరీస్ విజయాలను నమోదు చేసింది.
- 1967/68లో న్యూజిల్యాండ్‌లో 3-1 తేడాతో
- 1971లో ఇంగ్లాండ్‌లో 1-0 తేడాతో
- 1986లో ఇంగ్లాండ్‌లో 2-0 తేడాతో
- 2007లో ఇంగ్లాండ్‌లో 1-0 తేడాతో
- 2008/09లో న్యూజిలాండ్‌లో 1-0 తేడాతో
- 2018/19లో ఆస్ట్రేలియాలో 2-1 తేడాతో భారత్ సిరీస్ విజయాలను సొంతం చేసుకుంది.

కోహ్లి నేతృత్వంలో విదేశీ గడ్డపై సిరీస్ విజయాలు..

- 2015లో శ్రీలంకలో 2-1 తేడాతో
- 2016లో వెస్టిండీస్‌లో 2-0 తేడాతో
- 2017లో శ్రీలంకలో 3-0తేడాతో
- 2018/19 ఆస్ట్రేలియాలో 2-1 తేడాతో

- **ఆస్ట్రేలియాలో పర్యాటక జట్లు నమోదు చేసిన సిరీస్ విజయాలు :**

ఇంగ్లండ్ రికార్డు స్థాయిలో 13 సార్లు ఆసీస్ గడ్డపై సిరీస్ విజయాలు నమోదు చేయగా.. విండీస్ నాలుగుసార్లు గెలుపొందింది. దక్షిణాఫ్రికా మూడుసార్లు, న్యూజిలాండ్, భారత్ ఒక్కో సారి సిరీస్ విజయాలను నమోదు చేశాయి.

టీమిండియాకు సలాం : పైన్



సిడ్నీ : తమ జట్టును చిత్తుగా ఓడించిన భారత జట్టుకు సలామ్ కొట్టాలని ఆస్ట్రేలియా కెప్టెన్ టిమ్ పైన్ వ్యాఖ్యానించాడు. 'మా జట్టు భారత్‌కు సలామ్ కొట్టాలి. ఈ ఘనత సాధించిన విరాట్, రవిశాస్త్రిలకు నా అభినందనలు. గత రెండు టెస్ట్‌ల ఫలితంతో మాకు కాస్త నిరాశగా ఉంది. అడిలైడ్, పెర్త్‌లో మేం మంచి ప్రదర్శన చేశాం. కానీ మెల్‌బోర్న్, సిడ్నీలలో మా ప్రదర్శన అంతంత మాత్రంగానే ఉంది' అని పైన్ అన్నాడు. ఇక తమ జట్టులోని కొన్ని విషయాలు సంతృప్తిని మిగిల్చాయని పైన్ పేర్కొన్నాడు. ముఖ్యంగా ప్రపంచంలోనే ఉత్తమైన బౌలర్లను తమ జట్టు టాప్ ఆర్డర్ ఆటగాళ్లు సమర్థవంతంగా ఎదురుకున్నారని అతను తెలిపాడు. "ఈ జట్టులో కొత్త టాలెంట్ ఉంది. ప్రపంచంలోనే ఉత్తమైన బౌలింగ్ లైన్‌అప్‌ను మా టాప్ ఆరుగురు బ్యాట్స్‌మెన్లు సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. మాకు శ్రీలంకతో టెస్ట్ సిరీస్, యాషెస్ సిరీస్‌లు ఉన్నాయి. కాబట్టి ఈ సిరీస్ మాకు ఎంతో ముఖ్యం. నేను జట్టులో ప్రతీ ఒక్కరికి సూచించేది ఒకటే.. దయచేసి డొమెస్టిక్ క్రికెట్ ఆడండి. దాని ద్వారా పరుగులు చేయడం మరింత సులభం అవుతుంది. ఇందులో ఎటువంటి సందేహం లేదు. ప్రతీ ఒక్కరు కష్టపడాల్సిందే. క్రికెట్ చాలా ఫన్నీ గేమ్.. ఎప్పుడైనా.. ఎటైనా.. మలుపు తిరగొచ్చు. మేం మా దృష్టి మొత్తం శ్రీలంక సిరీస్‌పైనే కేంద్రీకరించాం' అని పైన్ తెలిపాడు.

జాతీయ హాకీ జట్టుకు ధర్మవరం క్రీడాకారులు





విశాలాంధ్ర-ధర్మవరం టౌన్ : మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరగనున్న 9వ జూనియర్ జాతీయ పురుషుల హాకీ టోర్నమెంట్ జట్టుకు నెల్లూరులోని ఏపీ హాకీ అకాడమీలో నిర్వహించిన ఎంపికల్లో అనంత పురం జిల్లా ధర్మవరం క్రీడాకారులు బాలాజీ, అశోక్ ఎంపికైనట్లు హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి.సూర్యప్రకాశ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అసోసియేషన్ సభ్యులు, ధర్మాంబ హాకీ అసోసి యేషన్ గౌరవాధ్యక్షుడు పల్లెం వేణుగోపాల్, అధ్యక్షుడు బి.వి. శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు బండి వేణుగోపాల్, కార్యదర్శి హుస్సేన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మధుసూదన్ గౌడ్, కోశాధికారి కృష్ణప్రసాద్, సహకార్యదర్శి నారాయణస్వామితో పాటు చంద్ర, అరవింద్‌గౌడ్, అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

అప్పడే గుడ్‌బై : యువరాజ్



న్యూఢిల్లీ: ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో ఆడటానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని టీమిండియా వెటరన్ ఆటగాడు యువరాజ్ సింగ్ పేర్కొన్నాడు. గొప్పగా ఆడే సమయంలోనే ఆటకు గుడ్ బై చెప్పాలను కుంటున్నట్లు తెలిపాడు. ఇందుకోసం తీవ్రంగా కృషి చేస్తున్నా నన్నాడు. మళ్లీ తాను సత్తా చాటుకుని జట్టు లోకి వస్తానని, అదే సమయంలో వరల్డ్‌కప్ కూడా ఆడతాననే ఆశ ఉందన్నాడు. 'క్రికెట్ నాకన్నీ ఇచ్చింది. ఆటకు వీడ్కోలు పలికేట ప్పుడు అత్యుత్తమంగా ఉండాలని కోరు కుంటున్నా. బాధతో వెళ్లిపోవద్దు. ప్రస్తుతం రంజీ ట్రోఫీ ఆడుతున్నా. రంజీ ట్రోఫీ తర్వాత జాతీయ టీ20 టోర్నీ, ఐపీఎల్ ఉన్నాయి. మంచి జరుగుతుం దని ఆశిస్తున్నా. నేను సత్తా చాటడానికి ఈ టోర్నీలు ఉపయోగపడతాయనే భావిస్తున్నా' అని బెంగాల్‌తో రంజీ మ్యాచ్ సందర్భంగా యువీ పేర్కొన్నాడు.

అభ్యుదయ సాహిత్యం.. సజీవ స్రవంతి

విశాలాంధ్ర సంపాదకులు ముత్యాల ప్రసాద్



మాట్లాడుతున్న ముత్యాల ప్రసాద్. వేదికపై కే మాధవరావు, డా॥ ఆర్ చంద్రశేఖరరెడ్డి, ఎస్వీ సత్యనారాయణ, పి లక్ష్మీనారాయణ, వి శివప్రసాద్

విశాలాంధ్ర-విజయవాడ (గుణదల) : అభ్యుదయ సజీవ స్రవంతి నదీ ప్రవాహం వంటిదని విశాలాంధ్ర సంపాదకులు, అభ్యుదయ రచయితల సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి ముత్యాలప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, విజయవాడ బుక్ ఫెస్టి వల్ సొసైటీ, ఎన్టీఆర్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న 30వ విజయవాడ పుస్తక మహో త్సవం కన్నుల పండువగా సాగుతోంది. సోమ వారం సాయంత్రం యద్దనపూడి సులోచనారాణి సాహితీ వేదికపై 'అభ్యుదయ సాహిత్యం-వర్తమాన ఆవశ్యకత' అంశంపై సభ జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యం ప్రవహించే నదిలా ఒకచోట ఉధృతంగా, మరోకచోట మెల్లగా ప్రవహిస్తున్నట్టు ఎన్నో ఒడిదుడుకుల మధ్య ప్రయాణం సాగిస్తూనే ఉంటుందన్నారు. శ్రామికులవైపు సామాన్యుల వైపు అభ్యుదయ సాహిత్యం నిరంతరం ఉంటుందని తెలిపారు. వర్గవ్యవస్థలు, కులవ్యవస్థలో సమస్యలు, స్త్రీలపై వివక్ష, వెనకబడిన ప్రాంతాలు, శ్రమ దోపిడీ ఉన్నంత వరకూ అభ్యుదయ సాహిత్యం ఉంటుం దన్నారు. అది అజరామరమని పేర్కొన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్య దర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రైతు ఉద్యమంపై ప్రత్యేక కార్యక్రమం రూపొం దించి నగరంలో ఏర్పాటు చేసేందుకు కృషి జరుగుతోందన్నారు. సేవ్ కల్చర్ - సేవ్ కంట్రీ నినాదం ముందుకు తీసుకెళుతున్నామన్నారు. కష్టజీవుల జీవితాలను కేంద్ర బిందువుగా తీసు కుని సాహిత్యాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. అరసం రాష్ట్ర అధ్యక్షుడు రాచపాలెం చంద్ర శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యం మరుగున పడింది అనే వాదన వస్తోందని, అది సరికాదన్నారు. సమాజంలోని అసమానతలు శ్రమ దోపిడీ, పెట్టుబడిదారీ వ్యవస్థ, నిరం కుశత్వం ఉన్నంత వరకు అభ్యుదయ కవి సజీవంగానే ఉంటాడన్నారు. మూఢ విశ్వాసాలు, మత మౌఢ్యం ఉన్నంత వరకు సమాజాన్ని మేలుకొల్పేందుకు అభ్యుదయ సాహిత్యం తనపని తాను చేస్తుందని వివరించారు. అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యానికి ఎంతో మంది జీవం పోశారన్నారు. సమసమాజం కోసం తన జీవితాలను త్యాగం చేశారని తెలిపారు. వారి ప్రభావం సమాజంపై ఉంటుందని పేర్కొన్నారు. తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ అభ్యుదయ సాహి త్యానికి దశాబ్దాల చరిత్ర ఉందన్నారు. రష్యా విప్లవం తరువాత మార్క్సిజం ప్రపంచమంతా పాకిందని తెలుగునేలకు కూడా వచ్చిందన్నారు. మార్క్సిజాన్ని వ్యతిరేకించటం మొదలుపెట్టిన తరువాత స్వార్థ రాజకీయ నాయకులు పుట్టుకు వచ్చారన్నారు. శ్రామిక, పీడిత వర్గాలకు అం డగా నిలిచేందుకు అభ్యుదయ సాహిత్యం వచ్చిం దన్నారు. కృష్ణాజిల్లా అరసం అధ్యక్షులు కొండ పల్లి మాధవరావు మాట్లాడుతూ చదువు, సంపా దన, సౌకర్యం మాత్రమే చూస్తున్నారని వ్యక్తిత్వం వైపు చూడటం లేదన్నారు. ఇలాంటి మంచి పుస్తక ప్రదర్శనలకు పిల్లలను తీసుకుని రావటం వారికి మంచి వ్యక్తిత్వం వచ్చే అవకాశం కలుగు తుందన్నారు. ప్రస్తుతం మానవాళి పర్యావరణ విధ్వంసం చేస్తున్నారని మూడో ప్రపంచ యుద్ధం అవసరం లేకుండానే సమాప్తి జరుగుతుంద న్నారు. అనంతరం సీవీ కృష్ణయ్య రచించిన 'నేర్చుకుంటా నేర్పుతూ' పుస్తకావిష్కరణ జరి గింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వి.బాల సుబ్రహ్మణ్యం, విద్యాశాఖ అధికారి సంధ్యారాణి, పి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.